సిద్ధార్థ విద్యాసంస్థలు
(అటానమస్), పుత్తూరు, తిరుపతి జిల్లా.
Contact for Admissions :
9396904599 / 9704668399
www.sietk.org

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

SIDDHARTH INSTITUTIONS
(AUTONOMOUS)
PUTTUR, TIRUPATI (Dist.) ANDHRA PRADESH – 517583



ఆదివారం | 1-2-2026 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 326 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి తె.3:39 తదుపరి పాడ్యమి, నక్షత్రం: పుష్యమి రా.11:58 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.9:02-ఉ.10:31, దుర్ముహూర్తం: సా.4:36-5:21, అమృతఘడియలు: సా.5:59-7:29, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:50, సూర్యాస్తమయం: 6:06 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

SIDDHARTH INSTITUTIONS
(AUTONOMOUS)
PUTTUR, TIRUPATI (Dist.) ANDHRA PRADESH – 517583

NAAC GRADE A+ | UGC AUTONOMOUS | AICTE IDEA Lab



అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో దూసుకెళుతున్న డబుల్ ఇంజిన్ సర్కారు

28 JANUARY TO 08 FEBRUARY 2026

25 Silver Jubilee Celebrations 2k26

25 YEARS OF SHAPING ENGINEERS • BUILDING CAREERS • SERVING SOCIETY

COUNSELLING CODE
SDTN

25 Years of Excellence in Education
- NBA & NAAC A+ Quality Standards
- Industry-Oriented UG & PG Programs
- Experienced & Qualified Faculty
- Modern Labs & Smart Classrooms
- Strong Industry Collaboration
- Focus on Skills, Innovation & Research
- Consistent Results & University Ranks
- Placements & Career Guidance
- Business Incubation Centre for Start-ups
- Microsoft, IBM & Vertusa Centers of Excellence
- AP State Skill Development Centre
- SEIMENS State-of-the-Art Laboratories
- QSpiders Industry Training Team
- Alumni Knowledge Transfer Centre
- Center for Interdisciplinary Research (CIDR)
- Research Guidance Center & Innovation Cell

మన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల 2001లో స్థాపించి నేటి వరకు మొత్తం 21 బ్యాచులు పట్టాలు పొందారు. ప్రపంచ వ్యాప్తంగా 24 వేల మంది విద్యార్థులు దేశ విదేశాలలో స్థిరపడ్డారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా అకాడమిక్ మరియు టెక్నాలజీ పరంగా వివిధ సమస్యలపై అనుభవాన్ని సంపాదించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళాలనే సేవాభావంతో ఈ విద్యా సంస్థను ప్రారంభించి నైతిక విలువలతో కూడిన విద్య మరియు కుటుంబ వ్యవస్థ, సాంప్రదాయ సంస్కృతి గురించి భారతదేశ విశిష్టత గురించి బోధిస్తూ జీవితానికి కావలసిన సమగ్ర బోధనను అందిస్తూ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతున్నాము. విద్యార్థులు కలవాలని సంకల్పించినపుడువాళ్లతో మాట్లాడి వారి సమస్య పరిష్కరానికి కృషి చేశాము. అలాగే ఫెయిలైన విద్యార్థులు క్రుంగిపోకుండా వారిని కౌన్సిలింగ్ ద్వారా ఆత్మస్థైర్యాన్ని నింపి ఆధ్యాత్మికంగా ఆలోచింపచేసే విధంగా ప్రయత్నించాం. అవసరమైనపుడు సమయాన్ని విద్యార్థుల కోసం కేటాయిస్తూ సేవాభావంతో అధ్యాపకులు, విభాగాధిపతులు, ప్రిన్సిపల్స్ సమిష్టి కృషితో పనిచేశాము. ఈ అంకిత భావమే ఈ రోజు సిద్ధార్థ సంస్థను 25 ఏళ్ల సిల్వర్ జూబిలీ శిఖరాలకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా, టీచింగ్, నాన్-టీచింగ్ మరియు యాజమాన్యం అందరం విద్యార్థులను ఎల్లప్పుడూ సిద్ధార్థ కుటుంబ సభ్యులుగా భావించి, వారిని సమర్థవంతులుగా తీర్చిదిద్దడంలో సఫలం అయ్యామని గర్వపడుతున్నాము,

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దగ్గర ఆనాడు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసినప్పుడు సంపాదించిన అనుభవం తో ఎన్నో రకాల కార్యక్రమాలను చేపడుతూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపడానికి ప్రయత్నిస్తునేఉన్నాము. ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ముందుచూపుతో ఒక వైపు ఐ.టి. పరిశ్రమలను నిర్మిస్తూ మరోవైపు ఇంజనీరింగ్ కళాశాలలను మంజూరు చేస్తూ లక్షలాది మందిని తెలుగు విద్యార్థులు అద్భుత అవకాశాలను అందిపుచ్చుకొని ప్రపంచ దేశాలకు విస్తరించి, తెలుగు కుటుంబాల ఆర్థిక వ్యవస్థను పెంచి అభివృద్ధి చేయడం ద్వారా కలిగిన సంపద అపారమైనది. వారిచ్చిన స్ఫూర్తితోనే ఎంతో మంది ఇంజనీరులు, సాఫ్ట్వేర్ ఇంజనీరులుగా మరియు వ్యాపార వేత్తలుగా ఎదిగి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తూ ఎన్నో లక్షల కుటుంబాలు సంతోషమైన జీవితాన్ని గడుపుతూ ఎన్నో కుటుంబాల తల్లిదండ్రుల కళ్ళలో ఆనందాన్ని చూడగలిగాం.

ఇంటర్నెట్ వచ్చిన తరువాత అతివేగంగా వస్తున్నటువంటి సాంకేతిక మార్పుల వల్ల మొబైల్ ఫోన్స్ వాడకం పెరిగి ఆ సాంకేతికను మంచికి ఉపయోగించి నవారు కొందరైతే అదే మొబైల్ ఫోన్ వల్ల వారి పవిత్రమైన సమయాన్ని కోల్పోవడం జరుగుతుంది. ఇక్కడే మా విద్యార్థుల తల్లిదండ్రులకు మనవి, ఈ ఇంజనీరింగ్ నాలుగు సంవత్సరాల కాలంలో సమయం చాలా విలువైనది. దాన్ని ఉపయోగించి ఏ విజ్ఞానాన్ని అయితే సంపాదిస్తారో అదే వాళ్ళ వంద సంవత్సరాల ఆనందమయ జీవితానికి బాటలు వేస్తుంది. అదే ఇంజనీరింగ్ చదివే వయసులో పక్కదారి పడకుండా వారిని తల్లిదండ్రులు గమనించి సరైన మార్గంలో పెట్టాలని, దశా దిశా నిర్దేశం చేయాలని మనవి. విద్యార్థులు మీరు కోరుకున్న విధంగా తయారై వారు ఉన్నత శిఖరాలను అధిరోహించి కీర్తి ప్రతిష్టితలు సంపాదించి ఈ దేశానికి ఉపయోగపడే విధంగా తయారైతే ఆనందపడి, ఆ ఆనందం లో మీ కళ్ళు చెమర్చుతాయో, అవేమాకు ఆశీర్వాదంగా భావిస్తాము. అలాగే మీరు కూడా మీ బాధ్యతను నెరవేరుస్తారని అన్యదా భావింపరని మనవి. విద్యార్థుల అభిమతం మేరకు ఈ సిల్వర్ జూబిలీ వేడుకలను 12 రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో ఎంతో వేడుకగా జరుపుతున్న ఈ కార్యక్రమానికి అతిరథ మహారథులు మరియు సెలబ్రిటీలు మిమ్మల్ని అలరించడానికి విచ్చేస్తున్నారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మరియు పూర్వ విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం. పూర్వ విద్యార్థుల అనుభవాన్ని ప్రస్తుత విద్యార్థులకు అనుసంధానం చేసి, వారి ఎదుగుదలకి బాటలు వేస్తున్నాము.

ఈ ప్రాంతంలో పద్మావతి అమ్మవారు పుట్టి పెరిగి సంచరించి మరియు ఆ కలియుగ దైవం శ్రీనివాసుని (బాలాజీ) వివాహమాడిని స్థలం నారాయణవనంలోని మా కళాశాలలో 10,300 మంది విద్యార్థులు చదువుతూ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ వారి కుటుంబాలను ఆశీర్వదించిన శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి దివ్యమంగళ శాసనాలు తెలియజేస్తూ.




సదా మీ సేవలో...

డా॥ అశోక రాజు కొండూరు,
చైర్మన్, సిద్ధార్థ విద్యా సంస్థలు, పుత్తూరు



DAY 1 28-01-2026 HOMAM BEGINNING WITH DIVINE BLESSINGS	DAY 2 29-01-2026 STATUE/ MODELS FROM SCRAP IGNITING THE SPARK OF INNOVATION IN EVERY STUDENT	DAY 3 30-01-2026 EXPERT TALKS WORKSHOPS TRAINING TODAY SUCCESS TOMORROW	DAY 4 31-01-2026 PROJECT EXPO ENGINEERING IDEAS INTO REALITY	DAY 5 01-02-2026 HACKATHON 24 HOURS CODING FEST	DAY 6 02-02-2026 DEPARTMENT ASSOCIATIONS COLLECTIVE WISDOM, BEYOUND THE CLASSROOM
DAY 7 03-02-2026 QUEST 2K26, FAREWELL A NATIONAL LEVEL TECHNICAL SYMPOSIUM	DAY 8 04-02-2026 TRADITIONAL DAY A DAY DEDICATED TO TRADITION AND VALUES	DAY 9 05-02-2026 PARENTS DAY EVERY PARENT IS A PART OF OUR SUCCESS	DAY 10 06-02-2026 SPORTS DAY PLAY, LEARN, GROW BEYOUND THE CLASSROOM	DAY 11 07-02-2026 ALUMNI DAY SIDDHARTH HOME COMING	DAY 12 08-02-2026 SILVER JUBILEE CELEBRATIONS DISTINGUISHED GUESTS GRACING THE CELEBRATIONS.



40 LAKHS LPA
HIGHEST PACKAGE

JOB OFFERS
- **1901** 2024 BATCH
- **1803** 2023 BATCH
- **1714** 2022 BATCH



25 YEARS OF INSTITUTIONAL GROWTH

25 Years of Academic Excellence:
A proud journey of delivering quality education with commitment and consistency.



Student-Centric Learning:
Thousands of students empowered with knowledge, skills, and values.



Expansion of Academic Programs:
Introduction of diverse undergraduate and postgraduate courses aligned with industry and societal needs.



Strong Faculty Foundation:
Experienced, dedicated, and continuously trained faculty contributing to academic excellence.



Infrastructure Development:
Steady growth in classrooms, laboratories, libraries, hostels, sports facilities, and digital learning resources.



Technological Advancement:
Adoption of ICT-enabled teaching, smart classrooms, e-learning platforms, and digital administration.



Research & Innovation:
Encouragement of research activities, projects, seminars, workshops, and publications.



Industry & Community Engagement:
Strong linkages with industry, internships, skill-development programs, and community outreach initiatives.



Student Achievements:
Consistent academic results, university ranks, competitive exam success, and extracurricular achievements.

FROM SCRAP TO SCULPTURE — STUDENTS TURNED WASTE INTO WONDERFUL CREATIONS.











The scrap models displayed by the students are a remarkable demonstration of engineering creativity, technical understanding, and environmental responsibility. Converting discarded materials into working and conceptual models reflects innovative thinking and strong problem-solving skills. These models effectively showcase the practical application of engineering principles while promoting sustainability and resource optimization. The clarity of design, functionality, and thoughtful use of scrap materials highlight the students' dedication and technical competence. Such initiatives encourage young engineers to think responsibly, innovate with limited resources, and contribute towards sustainable development. The efforts put forth by the students are truly appreciable and deserve sincere recognition.

- Dr. K. Ashok Raju, Chairman



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



చేసింది మహాపచారం!

...'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే విధానం అన్ని వేళలా పనిచేయదు. కేసీఆర్‌తోపాటు జగన్మోహన్ రెడ్డి కూడా ఇదే విధానాన్ని నమ్ముకున్నారు. చంద్రబాబు-రేవంత్ రెడ్డి మధ్య గురుశిష్యుల బంధం ఉందో లేదో తెలియదు గానీ కేసీఆర్-జగన్ రెడ్డి ఒకే మాట-ఒకే బాటగా సాగుతున్నారు. ఇరువురి ఎత్తుగడల మధ్య ఎన్నో సామీప్యతలు ఉంటున్నాయి. ప్రభుత్వాలపై ఎదురుదాడి చేయడంలో కూడా ఇరువురూ పోటీపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను మరచిపోయి బుకాయిస్తున్నారు.

..తెలంగాణలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం ద్వారా వ్యక్తిగత గోప్యతను హరించడమే కాకుండా కేసీఆర్ అండ్ కో ఎదురుదాడి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడి కూడా జగన్ అండ్ కో ఎదురుదాడి చేస్తోంది. మేం అంతటివాళ్లం, ఇంతటివాళ్లం, మమ్మల్నే తప్పుపడతారా? అంటే కుదరదు. మమ్మల్ని ఏమైనా అంటే మా సోషల్ మీడియా కూలీలతో ఎదురుదాడి చేయిస్తామని దబాయించినా లాభం లేదు. ప్రజలు అమాయకులు కారు.. అన్నీ గమనిస్తుంటారు.

..లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన అబద్ధమని సిట్ తేల్చిందని జగన్ అండ్ కో ఊదరగొడుతున్నారు. నిజానికి సిట్ దర్యాప్తు నివేదిక అధికారికంగా విడుదల కాలేదు. జగన్ రెడ్డి హయాంలో లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కొవ్వు అవశేషాలు కనిపించాయని ఎన్డీడీబీ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ప్రకటన చేశారు.

..ఇప్పుడు సిట్ విచారణ నివేదికలో అంతకంటే దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో తిరుమలకు సరఫరా అయింది అసలు నెయ్యే కాదని తేలింది. ఆవులు లేవు.. నెయ్యి ఉత్పత్తి కాలేదు. పామాయిల్లో కొన్ని కెమికల్స్ కలిపి నెయ్యి పేరుతో సరఫరా చేశారని సిట్ విచారణలో నిర్ధారణ అయింది. దీన్ని సాంకేతికంగా కెమికల్ కాక్టెయిల్ అంటారు. జంతువుల కొవ్వు కలిపి ఉంటే ఆ దేవదేవుడికి అపచారం చేసినవాళ్లు మాత్రమే అయ్యేవారు. ఇప్పుడు అంతకంటే మహా దారుణానికి ఒడిగట్టారని స్పష్టమైంది. రసాయనాల మిశ్రమం వల్ల భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడారు. దీన్ని ఏమనాలి? ఈ పరిస్థితికి కారకులెవరు? జంతువుల కొవ్వు కలవలేదని తెలిసిపోయిందని జబ్బలు చరుచుకుంటున్న జగన్ అండ్ కో కెమికల్స్ వాడటాన్ని ఎలా సమర్థించుకుంటుంది?

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..



..ఢిల్లీ లిక్కర్ పాలసీని సవరించడం ద్వారా అవినీతికి ఆస్కారం కల్పించారన్న కారణంగా అప్పటి సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ప్రాతిపదికన తిరుమలలో నెయ్యి సరఫరా విధానాన్ని సడలించి నెయ్యి కాని నెయ్యిని సరఫరా చేసే అవకాశం కల్పించిన నాటి టీటీడీ పాలక మండలి చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి. తెలిసి జరిగినా తెలియక జరిగినా జరిగిన పాపానికి బాధ్యులందరూ శిక్ష అనుభవించాలి. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలి.

..ఈ వ్యవహారం భగవంతునికి, భక్తులకు మధ్య ఉన్న విశ్వాసానికి సంబంధించినది. ఆ దేవదేవుని సన్నిధిలోనే అవినీతి, అరాచకాలు జరుగుతున్నప్పటికీ ఉపేక్షించడం అంటే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి అపచారం చేసినట్టుగానే భావించాలి. సిట్ అధికారులు తమకు క్లీన్‌చిట్ ఇచ్చారని ఊరూ వాడా ప్రచారం చేసుకుంటున్న జగన్ అండ్ కోకు నివేదికలోని పూర్తి వివరాలు వెల్లడవుతున్న కొద్దీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డ పరిస్థితి.

..తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కృత్రిమ అసమ్మతిని రాజేసే ప్రయత్నాలను కేసీఆర్ అండ్ కో చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నాలను జగన్ అండ్ కో చేస్తున్నారు.

కల్తీ నెయ్యిపై డైవర్షన్ పాలిటిక్స్

సిట్ చార్జిషీట్ నేపథ్యంలోనే 'బూతు పురాణం'
'కల్తీ'ని సమర్థించుకోలేక వైసీపీ మల్లగుల్లాలు
దిక్కుతోచక ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ
రంగంలోకి అంబటి.. బాబుపై తీవ్ర వ్యాఖ్యలు
తానున్నానంటూ మాజీ మంత్రికి జగన్ అండ

13

సిగ్గు.. సిగ్గు

నాడు అర్థంకాని బోసడీకే అన్నందుకు విధ్వంసం
నేడు ఘోరమైన బూతు వాడితే సమర్థనా?
మందలించకపోగా.. ఫోన్ చేసి మరీ భరోసా

బూతుల రాంబాబు బరితెగింపు.. రాయలేని భాషలో సీఎంపై బూతులు

అంబటి అరెస్ట్



సీఎం చంద్రబాబుపై బూతులతో విరుచుకు పడుతున్న అంబటి.. ఆయన ఇంటి వద్ద చీపుర్లతో టీడీపీ మహిళా కార్యకర్తల నిరసన



బూతుల రాంబాబుగా పేరు పడిన వైసీపీ నేత అంబటి రాంబాబు అత్యంత అసభ్యకర రీతిలో నోటికి పని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపైనే బూతులతో బరి తెగించారు. పోలీసుల సమక్షంలోనే చెలరేగారు.

రాంబాబు తీరుతో రోజంతా రగిలిన గుంటూరు

కల్తీ నెయ్యి ఫ్లెక్సీ వివాదంలో తొలుత అడ్డగోలుగా రెచ్చిపోయిన అంబటి
అడ్డుకోబోయిన మహిళలను మరింత రెచ్చగొట్టేలా పోలీసుల సమక్షంలోనే దూషణల పర్వం
క్షమాపణ చెప్పాలంటూ అంబటి ఇంటి వద్దకు పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు, మహిళలు
అక్కడ మరోసారి చంద్రబాబుపై అవాకులు
టీడీపీ తమ్ముళ్లపై చెలరేగిపోయిన వైనం
రౌడీషీటర్లతో దాడిచేయించి, తరిమిన అంబటి
దీంతో మరింతగా రగిలిపోయిన టీడీపీ శ్రేణులు
అంబటి ఇల్లు, కార్యాలయంపై దాడి.. విధ్వంసం
అంబటిని అరెస్టు చేసి వజ్ర వాహనంలో తరలింపు
పలు సెక్షన్ల కింద కేసుల నమోదు
ఆ తర్వాత కొద్దిసేపటికి అంబటి ఆఫీస్ కిటికీ, రెండు కార్లకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు
రాష్ట్రవ్యాప్తంగా అంబటి దిష్టిబొమ్మల దహనం



ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో తగలబడుతున్న అంబటి కారు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి రాంబాబు అడ్డగోలుగా రెచ్చిపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై బూతులతో విరుచుకుపడ్డారు. పోలీసుల సమక్షంలోనే చెలరేగిపోయారు. సీఎం చంద్రబాబుపై చేసిన బూతు వ్యాఖ్యలపై ప్రశ్నించడానికి ప్రయత్నించిన తెలుగుదేశం మహిళా కార్యకర్తలపైనా అంబటి నోరుపారేసుకున్నారు. 'దమ్ముంటే అరెస్టు చేసుకోండి..' అంటూ పోలీసులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. దీంతో శనివారం గుంటూరు నగరం దాదాపు ఎనిమిది గంటలపాటు హైటెన్షన్‌తో అట్టుడికిపోయింది. అంబటి అరెస్టుతో

మిగతా 13వ పేజీలో...



మార్కెట్ బడ్జెట్?



ప్రజల వినియోగం పెంచే దిశగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు, నిర్ణయాలు
ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను కల్పించే లక్ష్యం
ట్రంప్ సుంకాల ప్రభావిత రంగాలపై దృష్టి
ఐటీ కొత్త విధానంలోనూ డిడక్షన్లకు చోటు?
రోడ్డు, రైల్వే, మౌలిక వసతులకు ప్రాధాన్యం
రక్షణ రంగానికి భారీగా కేటాయింపులు
నేడు ఉదయం 11 గంటలకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో వినియోగానికి ఊపునిచ్చి, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను కల్పించడం, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా ఈసారి కేంద్ర బడ్జెట్ ఉండవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో గత ఏడాదే కొత్త ఆదాయ పన్ను విధానంలో మినహాయింపులు, ఇటీవల జీఎస్టీ తగ్గింపును అమలు చేసిన కేంద్రం... ఈసారి మరిన్ని సంస్కరణలను ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఆర్థిక, మార్కెట్ రంగాల నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్థిక వ్యవస్థలోకి నిధులను పంప్

మిగతా 2వ పేజీలో...

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ





ఇజ్రాయెల్‌లో ట్రంప్ కోసం మోదీ ఆడి పాడారు
అమెరికా సెక్స్ కుంభకోణం సూత్రధారి ఎప్‌స్టీన్
తాజాగా విడుదలైన పత్రాల్లో ప్రధాని మోదీ పేరు
ఇజ్రాయెల్ పర్యటన తప్ప అంతా అబద్ధం
భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ


న్యూఢిల్లీ, జనవరి 31: చనిపోయిన ఆరేళ్ల తర్వాత కూడా అమెరికాను కుదిపేస్తున్న సెక్స్ కుంభకోణం నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ పేరు.. తాజాగా భారత రాజకీయాల్లో కలకలం రేపుతోంది. అమెరికా న్యాయ శాఖ తాజాగా విడుదల చేసిన ఈ కుంభకోణానికి సంబంధించిన పత్రాల్లో భారత ప్రధాని మోదీ పేరు కనిపించటం సంచలనంగా మారింది. ఎప్‌స్టీన్ రాసిన ఓ మెయిల్‌లో ప్రధాని మోదీ పేరును ప్రస్తావిస్తూ కొన్ని వాక్యాలు రాశాడు. 'భారత ప్రధాని మోదీ (నా) సలహా తీసుకున్నారు. ఇజ్రాయెల్‌లో అమెరికా అధ్యక్షుడి కోసం డ్యాన్స్ చేశారు. పాట పాడారు. వాళ్లు (మోదీ, ట్రంప్) కొన్ని వారాల క్రితమే

మిగతా 2వ పేజీలో...

బిల్‌గేట్స్‌కు సుఖ వ్యాధులు!

రష్యన్ బాలికలతో లైంగిక సంబంధాలు
ఎప్‌స్టీన్ మెయిల్స్‌లో వివరాలు

94 ఏళ్ల వయసులో దర్శకత్వం



మళ్లీ మెగాఫోన్ పట్టనున్న సింగీతం శ్రీనివాసరావు
వైజయంతీ మూవీస్ బ్యానర్‌లో కొత్త సినిమా

11

కుప్పానికి ప్రగతి కళ



కుప్పం నియోజకవర్గంలోని శివపురం నివాసం నుంచి ఈ-సైకిల్‌పై ప్రజావేదిక వద్దకు వెళుతున్న సీఎం చంద్రబాబు

7,088 కోట్ల పెట్టుబడులు..16 పరిశ్రమలు
ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి
మెరుగైన వైద్యసేవలు ప్రజల వద్దకే చేరేలా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు
కుప్పం ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
నివాసం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిల్‌పై వచ్చిన ముఖ్యమంత్రి
24 గంటల్లో 5,555 ఈ-సైకిళ్ల పంపిణీతో కుప్పానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు

కుప్పం/శాంతిపురం/గుడుపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేయడం ద్వారా ప్రజలు అభివృద్ధికి చోటిచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రెండోరోజు శనివారం ఆయన పర్యటించారు. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం బెగ్గిలపల్లెలో మునెమ్మ, వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛన్, చిన్నతాయమ్మకు వితంతు పింఛన్‌ను పంపిణీ చేశారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులతో ముచ్చటించి వారి బాగోగులు తెలుసుకున్నారు. ఆ తర్వాత శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. "దేశంలో మరే ఇతర రాష్ట్రంలో కూడా అమలు కానంతగా సంక్షేమ పథకాలు మన వద్ద అమలవుతున్నాయి. నెలకు రూ.2,730 కోట్లను పెన్షన్ల రూపంలోనే పంపిణీ చేస్తున్నాం. తమిళనాడులో రూ.315 కోట్లు, కర్ణాటకలో రూ.392 కోట్లు మాత్రమే పెన్షన్ల కోసం కేటాయిస్తున్నారు. సూపర్‌సిక్స్‌లోని అన్ని పథకాలనూ అమలు చేసి సూపర్‌హిట్ చేశాం" అని వివరించారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనన్నారు. "ఆస్తిలో మహిళలకు సమాన హక్కు ఎన్టీఆర్ కల్పిస్తే, నేను 33% రిజర్వేషన్లను ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలు చేశాను. త్వరలో చట్టసభల్లో 33% రిజర్వేషన్లు రానున్నాయి. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్

మిగతా 14వ పేజీలో...



14

తాడిపత్రిలో 30 అడుగుల వాసవీమాత విగ్రహం

కడప రోడ్డులో ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్

నోటీసులు అక్రమం.. అయినా విచారణకు వస్తున్నా



నందినగర్ ఇంట్లో నేడు విచారణకు కేసీఆర్ ఓకే
3 గంటలకు అందుబాటులో ఉంటానని కబురు

12

ఎర్రవెల్లిలో ఉంటున్నానని చెప్పినా మళ్లీ నోటీసా?
'ట్యాపింగ్ సిట్' వైఖరిని ప్రశ్నిస్తూ కేసీఆర్ సుదీర్ఘ లేఖ

పోలవరానికి సంపూర్ణ సహకారం!

రూ.3 వేల కోట్ల విడుదలకు కేంద్రం అంగీకారం
రూ.1500 కోట్ల చొప్పున రెండు విడతల్లో..
డ్యామ్ పనులపై ఆరా తీసిన కేంద్ర జలశక్తి శాఖ
ఆ శాఖ జాయింట్ సెక్రటరీతో ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహామూర్తి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి భేటీ
డిజైన్లకు త్వరలోనే ఆమోదం: జలశక్తి శాఖ



అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. చివరి అంకంలో ఉన్న ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అవరోధాలూ ఎదురు కాకుండా చూడాలంటూ కేంద్ర ఆర్థిక, జల శక్తి శాఖలను ఆదేశించింది. ఇటీవల అమరావతిలో 14 బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చినప్పుడు, పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరా తీశారు. అప్పటి షెడ్యూల్‌ను బట్టి 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని ఆమెకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అయితే..గోదావరి పుష్కరాల నాటికే పోలవరాన్ని పూర్తి చేయాలని సీఎంకు నిర్మల సూచించారు. దీంతో.. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేయాలంటూ జల వనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు

మిగతా 14వ పేజీలో...

డిప్యూటీ సీఎంగా సునేత్ర ప్రమాణం



ముంబై, జనవరి 31: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా అజిత్ పవార్ సతీమణి సునేత్ర(62) శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. తద్వారా మహారాష్ట్రలో ఈ పదవిని చేపట్టిన మొట్టమొదటి మహిళగా రికార్డు సృష్టించారు. మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత లోక్‌భవన్‌లో ఆమెతో ప్రమాణం చేయించారు. మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ సీనియర్ నాయకులు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజ్‌బల్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సునేత్ర చిన్న కుమారుడు జై పవార్, ఆయన భార్య కూడా పాల్గొన్నారు. సునేత్రకు ఎక్సైజ్, క్రీడలు, మైనారిటీ వ్యవహారాల శాఖలను కేటాయించారు. అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థిక, ప్రణాళిక శాఖలను సీఎం ఫడణవీస్ ప్రస్తుతం తన వద్దే ఉంచుకున్నారు. అంతకుముందు ఆమె తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మరోవైపు, ఎన్సీపీ సునేత్రను తమ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నుకున్నది. ప్రస్తుతం సునేత్రకు మహారాష్ట్రలోని ఉభయసభల్లోనూ సభ్యత్వం లేదు. ఆమె ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అజిత్ ప్రాతినిధ్యం వహించిన బారామతి అసెంబ్లీ స్థానంలో ఆమె పోటీ చేయనున్నారు.

సునేత్ర ప్రమాణం గురించి నాకు తెలియదు

- ఎన్సీపీలోని రెండు వర్గాలు మళ్లీ ఏకం కావాలని అజిత్ కోరుకున్నారు
- ఆ కోరికను నెరవేర్చాల్సి ఉంది: శరద్



ముంబై, జనవరి 31: మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర ప్రమాణ స్వీకారం విషయం తనకు తెలియదని ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. సునేత్ర ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశానికి సంబంధించి పవార్ కుటుంబాన్ని ఎవరూ సంప్రదించలేదని, వార్తల ద్వారానే తెలిసిందని చెప్పారు. ఎన్సీపీలోని రెండు చీలిక వర్గాలు మళ్లీ ఏకమవుతాయంటూ వార్తలు వస్తున్న వేళ శరద్ పవార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ఎన్సీపీలోని రెండు వర్గాలు మళ్లీ కలవాలని అజిత్ పవార్ కోరుకున్నట్లు శరద్ పవార్ శనివారం విలేకరులతో అన్నారు. "విలీనం గురించి ఫిబ్రవరి 12న ప్రకటించాల్సి ఉంది. అజిత్ పవారే ఆ తేదీన విలీన ప్రకటన చేద్దాం అన్నారు. కానీ, దురదృష్టవశాత్తూ విమాన ప్రమాదం జరిగింది. ఆయన కోరికను నెరవేర్చాల్సి ఉంది" అని పేర్కొన్నారు. అయితే, అజిత్ మరణం ఈ విలీన ప్రక్రియకు ఆటంకం కలిగించవచ్చని శరద్ పవార్ అభిప్రాయపడ్డారు.

నేను కింగ్ నే... కింగ్ మేకర్‌ని కాదు: విజయ్



చెన్నై, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేను కింగ్ నే అవుతా... కింగ్ మేకర్‌ని కాదు. ఎన్నికల్లో మా పార్టీ విజయకేతనం ఎగురవేస్తుంది. రాష్ట్రాన్ని పాలిస్తుంది' అని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత, నటుడు విజయ్ ప్రకటించారు. ఓ ఆంగ్ల టీవీ చానెల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గతేడాది కరూర్ రోడ్ షోలో 41 మంది మృతి చెందిన ఘటన మిగిల్చిన విషాదం నన్నింకా వెంబడిస్తూనే ఉంది" అన్నారు. "జననాయగన్' చిత్రం విడుదలకు రాజకీయపరమైన ఆటంకాలు ఎదురవుతాయని నేను ముందే ఊహించా. అయితే వెనుదిరిగే ప్రసక్తే ఉండదు. రాజకీయాల్లో ఎంజీఆర్, జయలలితే నాకు ఆదర్శం' అని విజయ్ అన్నారు.

గనిపై కొండచరియలు పడి కాంగోలో 227 మంది కార్మికుల మృతి

గోమా (కాంగో), జనవరి 31: మధ్య ఆఫ్రికా దేశమైన కాంగోలో పెను విషాదం చోటు చేసుకుంది. తూర్పు కాంగోలోని రుబాయా ప్రాంతంలో ఉన్న కోల్టాన్ గనులపై భారీగా కొండచరియలు విరిగిపడడంతో 227 మందికి పైగా కార్మికులు చనిపోయారు. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఒక్కసారిగా కొండచరియలు గనిలోని సొరంగాల్లో పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. దీంతో వారంతా అక్కడికక్కడే సజీవ సమాధి అయ్యారు.

మార్కెట్ బడ్జెట్?

(మొదటి పేజీ తరువాయి)

చేయడం కోసం రహదారులు, రైల్వే, పట్టణ రవాణా, పారిశ్రామిక కారిడార్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం కేంద్రం భారీగా వెచ్చించవచ్చని అంటున్నారు. భారత్‌పై అమెరికా 50శాతం సుంకాలు విధించిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో.. సుంకాలతో నష్టపోతున్న రంగాలను ఆదుకోవడానికి చర్యలు ప్రకటించవచ్చని అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.



బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన అధికారులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్

కొత్త ఆదాయ పన్నులో మినహాయింపులు!

గత ఏడాది కొత్త ఆదాయ పన్నులో శ్లాబులను గణనీయంగా పెంచినా ప్రయోజనం పూర్తిస్థాయిలో దక్కడం లేదని ఉద్యోగులు, మధ్య తరగతి వారి నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. ఈ క్రమంలో కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.1.25 లక్షలకు పెంచాలని, గృహ రుణాల వడ్డీతోపాటు అసలుకు కూడా మినహాయింపు వర్తింపజేయాలనే డిమాండ్లు ఉన్నాయి. వీటిపై కేంద్రం సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో పింఛన్‌దారులకూ ప్రయోజనం కలిగించే చర్యలు ఉండవచ్చని చెబుతున్నారు. బ్యాంకు డిపాజిట్లను ప్రోత్సహించేదిశగా, క్యాపిటల్ గెయిన్స్ పన్ను విధింపులో రాయితీలు ఉండొచ్చని అంటున్నారు. గిగ్ వర్కర్లు, రోజువారీ వేతన కార్మికులకు ఆరోగ్య బీమా, పింఛన్, ఇతర సామాజిక భద్రత కల్పించాలన్న ప్రతిపాదనలపైనా సానుకూల నిర్ణయాలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

ఈసారి మరింత 'రక్షణ'..

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌ను దీటుగా ఎదుర్కొన్నా... ఈ యుద్ధం భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిందని విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలో ఈసారి రక్షణ బడ్జెట్‌ను మరింతగా పెంచే అవకాశం ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా విదేశాల నుంచి కొనుగోళ్లతోపాటు దేశీయంగా రక్షణ ఉత్పత్తులను ప్రోత్సహించడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక రోడ్డు, రైలు ప్రాజెక్టులు, దేశీయంగా విమానయానాన్ని పెంచే లక్ష్యంతో చేపట్టిన ఉడాన్, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు గణనీయంగా పెంచవచ్చని అంచనా వేస్తున్నారు.

ఆర్థిక రంగంలో మరిన్ని సంస్కరణలు

అమెరికా సుంకాలతో భారత్‌లోని చాలా రంగాలపై ప్రభావం పడటం, అంతర్జాతీయంగా నెలకొన్న గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో కీలక ఆర్థిక సంస్కరణలను ప్రకటించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేలా చర్యలు ఉండొచ్చని.. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉప సంహరణ, ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం ప్రక్రియలను వేగవంతం చేయవచ్చని పేర్కొంటున్నారు. మేకిన్ ఇండియాకు ఊతనిచ్చేందుకు కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం వంటివి చేపట్టవచ్చని అంటున్నారు. అదే సమయంలో పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్ పరిశ్రమలు, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాలకు ప్రోత్సాహకాలను ప్రకటించవచ్చని చెబుతున్నారు. రాష్ట్రాల్లో మూలధన వ్యయం పెంచేందుకు మరిన్ని దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలు ఇచ్చే ప్రతిపాదనలు ఉన్నాయని వివరిస్తున్నారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబు కోరిన విధంగా పూర్వోదయ పథకంలో భాగంగా ఏపీకి నిధులు కేటాయించవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి.

చరిత్రలో తొలిసారిగా ఆదివారం బడ్జెట్!

భారత దేశ చరిత్రలో తొలిసారిగా ఆదివారం రోజున కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇంతకుముందు ఎప్పుడూ కూడా సెలవు రోజుల్లో కాకుండా సాధారణ పని దినాల్లోనే బడ్జెట్లను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1999లో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన ఫిబ్రవరి 28వ తేదీ ఆదివారం వచ్చింది. దానితో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా.. దానికి ఒకరోజు ముందే అంటే ఫిబ్రవరి 27వ తేదీ శనివారం రోజున పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతంలో ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. కొన్నేళ్ల క్రితమే ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం 11 గంటలకే ప్రవేశపెట్టేలా మార్పులు తెచ్చారు. ఈసారి ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం వచ్చినా కూడా.. పార్లమెంటు సమావేశాలు నిర్వహించి, బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ

(మొదటి పేజీ తరువాయి)

కలుసుకున్నారు. ఇది పనిచేసింది' అని ఎప్‌స్టీన్ మెయిల్‌లో ఉంది. ఎప్‌స్టీన్ మెయిల్‌పై భారత విదేశాంగశాఖ స్పందించింది. 2017లో ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించిన విషయం తప్ప ఆ మెయిల్‌లో ఉన్న ఇతర వివరాలన్నీ పచ్చి అబద్ధమని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌దీర్ జైశ్వాల్ శనివారం కొట్టిపారేశారు. తీవ్రమైన లైంగిక కుంభకోణంలో దోషి అయిన వ్యక్తి చెప్పిన మాటలు అర్థంలేనివని పేర్కొన్నారు. 2017 జూన్ 4 నుంచి 6వ తేదీ వరకు ఇజ్రాయెల్‌లో మోదీ పర్యటించారు.

మోదీ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు ఉండటంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ అంశంపై మూడు ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా శనివారం డిమాండ్ చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ నుంచి ప్రధాని ఏం సలహా తీసుకున్నారు? అమెరికా అధ్యక్షుడి కోసం ఇజ్రాయెల్‌లో మోదీ డ్యాన్స్ చేశారు.. పాట పాడారు అనేదానికి అర్థం ఏమిటి? మెయిల్‌లో 'ఇది పనిచేసింది' అనే పదం ఉంది. అంటే ఏం పనిచేసింది? ఏ పని విజయవంతమైంది? అని పవన్ ఖేరా ప్రశ్నించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీ పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించింది.

బిల్‌గేట్స్‌కు సుఖ వ్యాధులు!


- ఆయనకు రష్యన్ బాలికలతో లైంగిక సంబంధాలు
- ఎప్‌స్టీన్ మెయిల్స్‌లో వివరాలు
- పత్రాల్లో మస్క్, మీరా నాయర్, మెలానియా ట్రంప్ పేర్లు



ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్‌కు సంబంధించిన ఓ చిత్రం

న్యూయార్క్, జనవరి 31: అమెరికాను ఓ కుదుపు కుదిపేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన వివరాలు సంచలనంగా మారాయి. ఈ కుంభకోణానికి సంబంధించిన మరో 30 లక్షలకు పైగా పత్రాలను, 2వేల వీడియోలను, 1.80లక్షల చిత్రాలను అమెరికా న్యాయశాఖ తాజాగా బయటపెట్టింది. వీటిలో బిల్‌గేట్స్ సైన్స్ అడ్వైజర్ బోరిస్ నికోలిక్ పేరుతో ఎప్‌స్టీన్ తనకు తాను రాసుకున్న మెయిల్స్‌లో సంచలన విషయాలు ఉన్నాయి. రష్యన్ బాలికలతో లైంగిక సంబంధాల వల్ల బిల్‌గేట్స్ సుఖ వ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ రాశాడు. ఆ వ్యాధులు నాటి తన సతీమణి మిలిండా గేట్స్‌కు సోకకుండా ఉండేందుకు ఆమెకు రహస్యంగా ఇచ్చేందు కోసం యాంటీబయాటిక్ ఔషధాలు కావాలని గేట్స్ తనను అడిగారని తెలిపాడు. అయితే, ఈ ఆరోపణలను గేట్స్ కార్యాలయం శనివారం ఖండించింది. కాగా, తాజా పత్రాల్లో ట్రంప్ సతీమణి మెలానియా, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటన్, భారత సంతతి అమెరికా సినీ దర్శకురాలు మీరా నాయర్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పేర్లు ప్రముఖంగా బయటకు వచ్చాయి. ఎప్‌స్టీన్ నివాసంలో 2009 అక్టోబర్ 21న ఏర్పాటుచేసిన విందు అనంతర సమావేశానికి భారత సంతతి సినీ దర్శకురాలు, న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ తల్లి మీరా నాయర్ కూడా హాజరైనట్లు తాజా పత్రాల్లో ఉంది. 2009లో వచ్చిన తన సినిమా 'అమెలియా' గురించి ప్రచారం చేసేందుకే ఆమె ఆ సమావేశానికి వెళ్లినట్లు ఆ పత్రాలను బట్టి తెలుస్తోంది. ఈ సమావేశంలో క్లింటన్, బెజోస్ కూడా ఉన్నారు.

లోకం తీరు



ఎల్‌నినోతో ఈ ఏడాది కరువు ముప్పు

- నైరుతిపై ప్రతికూల ప్రభావం: స్కైమెట్


న్యూఢిల్లీ, జనవరి 31: ఈ ఏడాది దేశంలో అనావృష్టి పరిస్థితులకు అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి ఎల్‌నినో కారణమని వారు చెబుతున్నారు. భూమధ్య రేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడే ఛాయలు కనపడుతున్నాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడవచ్చని కొన్ని వాతావరణ మోడళ్ల లెక్కగట్టాయి. సరిగ్గా ఇది నైరుతీ రుతుపవనాలు ఊపందుకునే సమయం. అలాగే ఉత్తరార్థ గోళంలో శీతాకాలం గరిష్ఠస్థాయికి చేరుకుంటుంది. ఈ సమయంలో ఎల్‌నినో ప్రపంచ వాతావరణంపై ప్రభావం చూపనుంది. దీని ముప్పు ఎక్కువగా దక్షిణాసియా దేశాలపై ఉంటుంది. భారత్‌లో రుతుపవన వర్షాలు తగ్గిపోయే అవకాశం ఉంది. అలాగే ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా, భారతఉపఖండంలోని దేశాల్లో వర్షపాతంపై తీవ్ర ప్రభావం పడనుంది అని స్కైమెట్ సంస్థ తొలిసారిగా అంచనా వేసింది. జూలై నెలలో ఎల్‌నినో ఏర్పడ వచ్చని, దీనితో కరువు పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆసియా, పసిఫిక్ క్లైమెట్ సెంటర్ (ఏపీసీసీ) కూడా స్పష్టం చేసింది. ఏపీసీసీ అంచనా ప్రకారం ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో గత నెల నుంచి లానినా బలహీనపడుతూ వస్తోంది. వచ్చే నెలకు పూర్తిగా బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఏప్రిల్ నెలలో తటస్థ పరిస్థితుల ప్రభావం బలహీనపడి ఎల్‌నినో మొదలవుతుంది.

సీజే రాయ్ ఆత్మహత్యపై సిట్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాన్ఫిడెంట్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ సీజే రాయ్ ఆత్మహత్య కేసు దర్యాప్తు కోసం కర్ణాటక ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై హోం మంత్రి పరమేశ్వర్ బెంగళూరులో శనివారం మీడియాతో మాట్లాడారు. ఐటీ అధికారులు గతంలోనూ రాయ్ కంపెనీలపై దాడులు జరిపారని, 2025 డిసెంబరులో ఐటీ దాడి జరిగిందని, 60 రోజుల్లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉందని తెలిపారు. ఐటీ అధికారులను విచారించాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రాష్ట్ర ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే అన్నారు.

ప్రపంచమంతా తిరిగి అడుక్కుంటున్నాం

- సిగ్గుతో తల దించుకోవాల్సి వస్తోంది
- అప్పులపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



ఇస్లామాబాద్, జనవరి 31: అప్పుల కోసం తాను, ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కలిసి దేశాలు తిరుగుతున్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. 'మేమిద్దరం ప్రపంచమంతా తిరిగి డబ్బు అడుక్కోవడం సిగ్గుగా ఉంది. అప్పులు తీసుకోవడం మన ఆత్మగౌరవంపై పెద్ద భారం. సిగ్గుతో మేం తల వంచుకోవాల్సి వస్తోంది. ప్రతిగా వాళ్లు ఏం అడిగినా మనం కాదనలేం' అన్నారు. అయితే, దేశ ఆర్థిక స్థితి దృష్ట్యా అలా చేయాల్సి వస్తోందని వాపోయారు. శుక్రవారం రాత్రి ఇస్లామాబాద్‌లో దేశానికి చెందిన ప్రముఖ ఎగుమతిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం మన విదేశీ మారక ద్రవ్యం దాదాపు రెట్టింపు అయ్యింది. అయితే, ఇందులో మిత్రదేశాలు ఇచ్చిన రుణాలు కలిసి ఉన్నాయి' అని తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థతో పాకిస్థాన్ క్రియాశీలకంగా చర్చలు జరుపుతున్న తరుణంలో షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పాకిస్థాన్ ఇటీవలే ఐఎంఎఫ్ నుంచి 1.2 బిలియన్ డాలర్ల అప్పు పొందింది.

బలూచ్‌లో భారీ హింస..88 మందికి పైగా మృతి

ఇస్లామాబాద్/కరాచీ, జనవరి 31: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ రాష్ట్రం తీవ్రస్థాయి హింసాత్మక ఘటనలతో మరోసారి నెత్తురోడింది. రాష్ట్రంలో పెద్దఎత్తున చెలరేగిన ఘర్షణల్లో కనీసం 67 మంది ఉగ్రవాదులు, 10 మంది భద్రతా సిబ్బంది, 11 మంది పౌరులు మృతిచెందారు. మరణించిన ఉగ్రవాదుల్లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ)కి చెందిన కొంతమంది వేర్పాటు వాదులు కూడా ఉన్నట్లు అధికారులు, సంబంధిత మంత్రులు శనివారం వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అతిపెద్ద రాష్ట్రమైన బలూచిస్థాన్ అనేక దశాబ్దాలుగా వేర్పాటువాదంతో అట్టుడుకుతోంది. నిరుడు దేశవ్యాప్తంగా 699 ఉగ్రదాడులు జరిగాయని, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 34% అధికమని పాక్ తెలిపింది.

రెండేళ్ల కేంద్ర డిప్యూటేషన్ తప్పనిసరి!

- కేంద్రంలో ఐజీ స్థాయి పోస్టులకు ఎంప్యానెల్‌మెంట్ మార్గదర్శకాల సవరణ.. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, జనవరి 31: కేంద్రంలో ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) లేదా సమాన హోదా పోస్టుల్లో ఐపీఎస్ అధికారుల ఎంప్యానెల్‌మెంట్‌కు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 2011, ఆ తర్వాత బ్యాచ్‌ల అధికారులకు కొత్త అర్హతా నిబంధనలు ప్రవేశపెట్టింది. కేంద్రంలో ఐజీ స్థాయి పోస్టులకు ఎంప్యానెల్‌మెంట్ (ఎంపిక) సాధించాలంటే కనీసంగా రెండేళ్లు సెంట్రల్ డిప్యూటేషన్‌పై ఎస్పీ/డీఐజీ లేదా సమాన హోదా స్థాయిల్లో తప్పనిసరిగా పనిచేయాల్సి ఉంటుందని కేంద్ర హోం శాఖ తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతకుముందు ఎంప్యానెల్‌మెంట్ గైడ్‌లైన్స్‌లో ఇలా 'తప్పనిసరి కేంద్ర అనుభవం' అనే రూల్ ఉండేది కాదు. సవరించిన నిబంధన ప్రస్తుతం తమ క్యాడర్‌లో డీఐజీ లేదా సమాన స్థాయిల్లో పనిచేస్తూ, రానున్న సంవత్సరాల్లో ఐజీగా పరిగణనలోకి తీసుకొనే 2011, ఆ తర్వాత బ్యాచ్‌ల ఐపీఎస్ అధికారులకు వర్తిస్తుంది. ప్రస్తుతం ఐపీఎస్ అధికారులు ఈ స్థాయిల్లో చేరేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి.



విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తున్న పట్నాల ఉమాదేవి, ఆమె కుటుంబ సభ్యులు

కేజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయా!

- డిప్యూటీ సీఎంకు మహిళ ఫిర్యాదు
- బాధితురాలిని కుటుంబంతో సహా సచివాలయానికి తీసుకురావలసిందిగా అధికారులకు పవన్‌కల్యాణ్ ఆదేశం

విశాఖపట్నం/మహారాణిపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గర్భంలోనే తన శిశువు మృతి చెందిందని విశాఖపట్నానికి చెందిన పట్నాల ఉమాదేవి శుక్రవారం రాత్రి విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. కాన్పు నిమిత్తం గతేడాది డిసెంబరు తొలి వారంలో ఆస్పత్రిలో చేరానని, వైద్యులు, సిబ్బంది తన పట్ల, తన కుటుంబ సభ్యుల పట్ల దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు. తనలాంటి దుస్థితి మరో మహిళకు రాకుండా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె వేడుకున్నారు. ఆమె వేదన విని చలించిన పవన్ కల్యాణ్.. బాధితురాలిని కుటుంబంతో సహా సోమవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి సత్యకుమార్ ఆరా

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేజీహెచ్‌లో బిడ్డ మృతి చెందిన సంఘటనపై మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. కేజీహెచ్ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన రెండు కమిటీలు ఆయనకు నివేదిక అందించాయని, ఈ నివేదికలో కాన్పు సమయంలో వైద్యులు సాధారణంగా పాటించిన నియమాలనే పాటించినట్టు వెల్లడైందని వివరించారు.

కార్పొరేట్ల కోసమే పనిచేస్తున్న ప్రభుత్వాలు

- వ్యవసాయ కూలీల జీవనోపాధిపై దెబ్బ
- పోరాటాలతోనే వీటిని అడ్డుకోగలం: ఏఐకేఎస్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ దావలే, పక్కన ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ, ప్రజల ఆస్తులను దోచి పెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అఖిల భారత రైతు సంఘం(ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు అశోక్ దావలే ఆక్షేపించారు. కార్పొరేట్ అనుకూల విధానాల వలన వ్యవసాయ కూలీలు ఆర్థికంగా చితికిపోతున్నారని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు భారీ ఎత్తున పోరాటాలు జరిగితేనే వీటికి అడ్డుకట్ట వేయగలమని స్పష్టం చేశారు. ఏఐకేఎస్ జాతీయ సభల్లో పాల్గొనేందుకు శనివారం గుంటూరు వచ్చిన అశోక్ దావలే పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాసిక్, ముంబై, పాలగడ్‌లో చేపట్టిన మూడు భారీ ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలతో సీఎం, మంత్రులు దిగి వచ్చి మూడు గంటల పాటు చర్చించారన్నారు. ఇలాంటి పోరాటాలు అన్ని చోట్ల జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏఐకేఎస్‌లో 1.53 కోట్ల మంది సభ్యులున్నారని, ప్రపంచంలోనే ఇంతమంది సభ్యులున్న రైతు సంఘం మరొకటి లేదన్నారు. అయితే ఇంకా ఎక్కువమంది రైతులు, వ్యవసాయ కూలీలు భాగస్వామ్యం కావాల్సి ఉందని తెలిపారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ 2014 నుంచి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి చేరిందన్నారు. త్వరలో తీసుకురానున్న విత్తన చట్టంలో నకిలీ విత్తనాల వలన నష్టం జరిగితే రైతుకు న్యాయం చేసే నిబంధన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ 12న అఖిల భారత స్థాయిలో సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ నిర్వహించబోయే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

బకాయిల చెల్లింపులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పేరుకుపోయిన వేల కోట్ల బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇప్పటికే మంజూరైన వివిధ రకాల ఆర్థిక ప్రయోజనాలు దాదాపు రూ.35 వేల కోట్లకు చేరాయని శనివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా మంజూరు కావాల్సిన వేతన సవరణ, 4 విడతల డీఏ, సరెండర్ లీవ్‌లు తదితర ప్రయోజనాల అంచనా మరికొన్ని వేల కోట్లు అని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇన్ని వేల కోట్ల రూపాయల చెల్లింపు ప్రభుత్వానికి అసాధ్యంగా మారిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గంగా తమ సంఘం బాకీకి భూమి అనే ప్రతిపాదనను ప్రభుత్వానికి నివేదించిందని వెల్లడించారు. వేతన సవరణ కమిషన్ నియామకాన్ని వెంటనే ప్రకటించాలని, మధ్యంతర భృతి ప్రకటిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అన్ని అంశాలపై స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు.

సీపీఎస్ బకాయిల చెల్లింపుల్లో అసమానతలు తొలగించాలి

- ఆర్థిక మంత్రి, సీఎస్‌కు సీపీఎస్ఈఏ నేతల వినతులు
- నేడు విజయవాడలో ఏపీసీపీఎస్ఈఏ సమావేశం

అమరావతి/విజయవాడ (గాంధీనగర్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ బకాయిల చెల్లింపులో అసమానతలు తొలగించాలని ఏపీ సీపీఎస్ఈఏ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ నేతృత్వంలో సంఘం నేతలు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్‌ను శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన పాత కేసులను ఎత్తివేస్తూ ఒకే 'కామన్ జీవో' జారీ చేయాలని కోరారు. కాగా.. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలోని ఏపీఎన్‌జీజీవో హోమ్‌లో జరగనున్నట్టు ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, సీఎం దాస్ తెలిపారు.

రాతపరీక్షతో సమానంగా ఇంటర్వ్యూకు మార్కులా?

- సమీక్షించాలని ఆదేశించాక కూడా పాత విధానాన్నే అనుసరించారు
- ఎంపిక ప్రక్రియను సమర్థించలేం
- ఇంటర్వ్యూకు సముచిత మార్కులు
- రేషన్ డీలర్ ఎంపిక ప్రక్రియపై హైకోర్టు
- ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని ఆదేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల ఎంపికలో రాతపరీక్షతో సమానంగా ఇంటర్వ్యూకు మార్కులు కేటాయించడాన్ని హైకోర్టు ధర్మాసనం తప్పుబట్టింది. ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించడాన్ని సమీక్షించి.. కొత్త మార్గదర్శకాలు రూపొందించాలని గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేసింది. అలాగే ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయిస్తూ 2011లో ప్రభుత్వం జారీ చేసిన జీవో4ను సైతం కోర్టు కొట్టివేసిందని తెలిపింది. ఆ తర్వాత కూడా కొత్త మార్గదర్శకాలు రూపొందించకుండానే అధికారులు పాత విధానంలో ఎంపిక ప్రక్రియను పూర్తి చేయడాన్ని ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా జరిగిన ఎంపిక ప్రక్రియను సమర్థించలేమని పేర్కొంది. గతంలో పిటిషనర్ నాగమణి వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను పక్కనపెట్టింది. 2013, ఏప్రిల్ 4న కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఇంటర్వ్యూ మార్కులు నిర్ణయించి సాలూరు పట్టణంలోని రేషన్ షాపు 15కి కొత్తగా ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. విజయనగరంజిల్లా, సాలూరు పట్టణంలోని రేషన్ షాపు నెంబరు 15కు సంబంధించి డీలర్ నియామకానికి 2012లో నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిలో రాతపరీక్షకు 50 మార్కులు, ఇంటర్వ్యూకు 50 మార్కులుగా పేర్కొన్నారు. కోట నాగమణి అనే మహిళ రాతపరీక్షలో 50కి 50 మార్కులు సాధించారు. అయితే, ఇంటర్వ్యూలో అర్హత సాధించలేదు. దీంతో ఇంటర్వ్యూకు 50 మార్కులు నిర్ణయించడాన్ని సవాల్ చేస్తూ నాగమణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎంపిక ప్రక్రియలో పాల్గొని విఫలమైన తరువాత దానిని సవాల్ చేసే హక్కు పిటిషనర్‌కు లేదంటూ వ్యాజ్యాన్ని కొట్టివేశారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ కోట నాగమణి ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది తడ్డి నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. "ఇంటర్వ్యూకి 50 మార్కులు కేటాయించడాన్ని సింగిల్ జడ్జి తప్పుబట్టారు. దానికి సంబంధించిన జీవోను సైతం రద్దు చేశారు. పాలసీని సమీక్షించి కొత్త మార్గదర్శకాలు రూపొందించిన తర్వాత నియామకాలు జరపాలని ఆదేశాలు ఇచ్చారు. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా రేషన్ డీలర్లను నియమించారు". అని వాదించారు. ధర్మాసనం స్పందిస్తూ.. నాగమణి రాతపరీక్ష రాసి, ఇంటర్వ్యూలో విఫలమైన నేపథ్యంలో సహజంగా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు పట్టించుకోకుండా అధికారులు నియామకాలు జరిపినందునే జోక్యం చేసుకుంటున్నామని తెలిపింది. సాలూరు పట్టణంలోని రేషన్ షాపు నెంబరు 15కి కొత్తగా ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించింది.



బాలమహోత్సవ్‌లో మాట్లాడుతున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి

విజ్ఞాన్‌లో అట్టహాసంగా బాల మహోత్సవ్ ప్రారంభం

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు వెలికితీయడానికి బాల మహోత్సవాలు ఉపయోగపడతాయని వాల్తేరు (విశాఖ) డివిజన్ ఆఫ్ ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి సూచించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం విజ్ఞాన్ బాలమహోత్సవ్ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన భవ్య మాట్లాడుతూ, కొత్త విషయాల కోసం ప్రయత్నించినప్పుడే నైపుణ్యాలు, సామర్థ్యాలు బయటపడతాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిషోర్ పాల్గొన్నారు. విద్యార్థులకు జూనియర్స్ విభాగం (అండర్-14 : 5 నుంచి 7వ తరగతి వరకు), సీనియర్స్ విభాగం (అండర్-17: 8 నుంచి 10వ తరగతి వరకు)లో మొత్తం 50కి పైగా పోటీలు నిర్వహించారు.

అరకు రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే 58501, 58502 నంబరు గల పాసింజర్ రైళ్ల (అరకు ట్రైన్స్)కు ఫిబ్రవరి 3, 5, 7, 9 తేదీల్లో అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్ (అద్దాల బోగీ)ను జత చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

5న ఏపీజేఏసీ అమరావతి మహాసభకు వచ్చే ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభకు విజయవాడ వచ్చే ఉద్యోగులకు రెండు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. సమావేశానికి వచ్చే ఉద్యోగులందరికీ స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడంపై సీఎం చంద్రబాబుకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

దుండగుల దాడిలో గాయపడిన ఎంఆర్‌పీఎస్ఎస్ నేత మృతి

- ట్రాక్టర్‌తో ఢీకొట్టి.. రాళ్లతో దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- చికిత్స పొందుతూ మరణించిన రమేశ్



తుగ్గలి/కర్నూలు న్యూసిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు రమేశ్ చికిత్స పొందుతూ మృతి చెందారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగులకు చెందిన రమేశ్ శుక్రవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లారు. గ్రామం వెలుపల గుర్తు తెలియని వ్యక్తులు ఆయన్ను ట్రాక్టర్‌తో ఢీకొట్టి రాళ్లతో దాడి చేశారు. కొన ఊపిరితో ఉన్న రమేశ్‌ను కుటుంబసభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతి చెందారు. రమేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పత్తికొండ సీఐ పులిశేఖర్ తెలిపారు. నిందితులను శిక్షించాలని కర్నూలు కలెక్టరేట్ ఎదుట రమేశ్ మృతదేహంతో ఆయన కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

చేసింది మహాపచారం!



ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిప్పుతో చెలగాటం ఆడుతున్నారా? తమ రాజకీయ ప్రత్యర్థులను సెంటిమెంటుతో కూడిన అంశాలపై టచ్ చేస్తూ తుచ్ఛమైన రాజకీయ ప్రయోజనాల కోసం ధర్మానికి, న్యాయానికి ప్రతీకలమని చెప్పుకొంటున్న మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డిలపై నిందలు వేస్తున్నారా? నీతి నిజాయతీలకు తాము నిలువెత్తు నిదర్శనమని భావించుకునే ఈ ఇరువురితో పెట్టుకొని సమస్యలు కొనితెచ్చుకుంటున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం అంత ఈజీగా లభించదు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి– మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య ముదురుతున్న జగడం విషయానికి వద్దాం. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. కేసీఆర్‌ను విచారణకు పిలవడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని భారత రాష్ట్ర సమితి నాయకులు మండిపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఏమి చేసినా అది లోక కల్యాణం కోసమేనని బీఆర్ఎస్ నాయకులు బలంగా నమ్మారు.

> ప్రజల నమ్మకాన్ని తిరిగి చూరగొనే ప్రయత్నం చేయాల్సిన వాళ్లు కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వాలను అస్థిరపరిచే ప్రయత్నం చేయడం నేటి రాజకీయాలలో సరికొత్త ట్రెండ్. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కృత్రిమ అసమ్మతిని రాజేసే ప్రయత్నాలను కేసీఆర్ అండ్ కో చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నాలను జగన్ అండ్ కో చేస్తున్నారు. ఈ క్రమంలో జగన్ అండ్ కో హనీ ట్రాప్ వంటి కుయుక్తులకు కూడా పాల్పడుతోంది. రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో జరిగింది ఇదే.

ప్రజలను నమ్మింపజూశారు. ఎందుకంటే కేసీఆర్, జగన్‌రెడ్డిల రాజకీయ ఎత్తుగడలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. తమ సమస్యలను ప్రజల సమస్యలుగా చిత్రీకరిస్తారు. శిఖర సమానులుగా తాము భావించే కేసీఆర్‌కు విచారణల పేరిట నోటీసులు ఇచ్చే సాహసాన్ని అంగుష్ఠ మాత్రుడైన రేవంత్‌రెడ్డి చేయడం ఏమిటి? అని వారు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్ అనే వాస్తవాన్ని విస్మరించి ఆయననే విచారిస్తారా? ఎంత ధైర్యం అంటూ మండిపడుతున్నారు. ఆత్మగౌరవం కేసీఆర్ అండ్ కోకు మాత్రమే ఉంటుందా? తెలంగాణ కోసం గతంలో కొట్లాడిన వారికి ఉండదా? అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులపై విచారణ చేయకూడదా? కేసీఆర్ అండ్ కోకు కష్టం నష్టం జరిగితే తెలంగాణ సమాజం మొత్తానికి కష్టం వచ్చినట్టేనా? ఇదెక్కడి వింత వాదన అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడం ఇదే మొదటిసారి కాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గతంలో ఆయనను విచారణకు పిలిచింది. అప్పుడు తెలంగాణ సమాజం ఉలిక్కిపడలేదు. కేసీఆర్‌కు సంఘీభావంగా రోడ్డు మీదకు రాలేదు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు ఈ కష్టం ఏమిటని ఆత్మ బలిదానాలకు సిద్ధపడలేదు. ఆ తర్వాత జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అనంతరం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. దీంతో తెలంగాణ సెంటిమెంటును మళ్లీ రగిలించాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ నాయకులు గుర్తించారు. ఏ చిన్న అవకాశం లభించినా ఆ దిశగా ఎత్తులు వేశారు. ఇప్పుడు టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావలసిందిగా కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావును ఇదే కేసు విషయమై ఇదివరకే విచారించారు. ఇప్పుడు కేసీఆర్ వంతు వచ్చింది. ఇప్పుడు కూడా తెలంగాణ సెంటిమెంటును రగిలించకపోతే మునిగిపోతామని భావిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే ననే పల్లవిని అందుకున్నారు. కేసీఆర్ అంటే ఏమనుకుంటున్నారు? శిఖర సమానుడైన ఆయనను విచారణకు పిలవడం ఏమిటి? అని బీఆర్ఎస్ నాయకులు విమర్శలు సంధిస్తున్నారు. అయితే చట్టానికి ఎవరూ అతీతులు కారనుకోండి! అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ అండ్ కో కూడా ఈ మాటలు వాడేవారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టెలిఫోన్ ట్యాపింగ్ జరిగిందా? లేదా? అంటే జరిగిందన్న విషయం బహిరంగ రహస్యం. కర్ణాటకలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందని తప్పుబడుతూ కేసీఆర్ సొంత

> జంతువుల కొవ్వు కలిపి ఉంటే ఆ దేవదేవుడికి అపచారం చేసినవాళ్లు మాత్రమే అయ్యేవారు. ఇప్పుడు అంతకంటే మహా దారుణానికి ఒడిగట్టారని స్పష్టమైంది. రసాయనాల మిశ్రమం వల్ల భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడారు. దీన్ని ఏమనాలి?

పత్రికలో శుక్రవారంనాడు ఒక కథనాన్ని ప్రచురించారు. ఫోన్ ట్యాపింగ్ కేసీఆర్ హయాంలో జరిగినంత మాత్రాన అందుకు కేసీఆర్ ఎలా బాధ్యుడవుతారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిజమే, ఫలానా వారి ఫోన్లు ట్యాప్ చేయాలని ఏ ముఖ్యమంత్రి కూడా ఫైలుపై రాసి సంతకం చేయరు. ఫలానా వారి ఫోన్లు దొంగచాటుగా వినండి అని మౌఖికంగా మాత్రమే చెబుతారు. ఇప్పుడు సిట్ విచారణలో కూడా కేసీఆర్ దోషి అని తేల్చడం సులువు కాదు. కేసీఆర్‌తో పాటు అప్పుడు చక్రం తిప్పినవారు తాము కోరుకున్న ఫోన్ నంబర్లను ఊరూ పేరూ రాయకుండా నక్సలైట్లతో ముడిపెట్టి సంబంధిత కమిటీల నుంచి ఆమోదం పొందారు. ఈ కారణంగా ఫోన్ ట్యాపింగ్‌తో నాకేమి సంబంధం అని కేసీఆర్ అండ్ కో హుంకరిస్తున్నారు. ఈ కేసులో కేసీఆర్‌ను నేరుగా ఇరికించడం దాదాపు అసాధ్యం. ఈ ధీమాతోనే కేసీఆర్‌నే విచారణకు పిలుస్తారా అని బీఆర్ఎస్ నాయకులు హుంకరిస్తున్నారు. పనిలో పనిగా ఆత్మగౌరవం నినాదం అందుకున్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా తట్టుకుంటారు గానీ ఆత్మగౌరవం దెబ్బతింటే తిరగబడతారు. ఈ కారణంగానే నిజాం పాలనలో రజాకార్లను ప్రతిఘటించారు. ఆ తర్వాత దొరల అహంకారాన్ని తట్టుకోలేక తుపాకులు చేతబట్టి నక్సలైట్ ఉద్యమాల్లో పాల్గొన్నారు. నాటి దొరల వారసుడైన కేసీఆర్‌కు ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మొదటిసారిగా కష్టం వచ్చింది. ఆయన ఆత్మగౌరవం దెబ్బతింటోందని గగ్గోలు పెడుతున్నారు. అయితే ఇప్పుడు యాగీ చేస్తున్నవారంతా కేసీఆర్ పాలనలో ఎంతో మంది ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన విషయాన్ని మరచిపోతున్నారు. ముఖ్యమంత్రిని కలవడానికి నాడు ప్రగతిభవన్‌కు వచ్చిన గద్దర్‌ను లోపలికి అనుమతించకుండా ఎండలో నిలబెట్టడం ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం కాదా? తెలంగాణ కోసం ఆయన గజ్జె కట్టి గళం విప్పలేదా? ఉద్యమ సమయంలో జేఏసీ ఛైర్మన్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం వంటి వారికి ఏళ్ల తరబడి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం కాదా? ఇలా ఎంతో మందికి అవమానాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా కేసీఆర్ దొర పోకడల వల్ల తమ ఆత్మగౌరవం దెబ్బతిందని భావించిన తెలంగాణ సమాజం గత ఎన్నికల్లో ఆయనను ఓడించింది. నాటి తమ దొర పోకడలను మరచిపోయి ఇప్పుడు కేసీఆర్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని నిందిస్తున్నారు. అక్కడితో ఆగకుండా కేసీఆర్ అంటేనే తెలంగాణ అని, తెలంగాణపై ఆయనకు మాత్రమే పేటెంట్ ఉందని, ఇతరులకు ఆత్మగౌరవం ఉండదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ కాలం నాటి పరిస్థితులను, వాతావరణాన్ని మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అప్పట్లో తెలంగాణ రాష్ట్ర సమితి తప్పులను, కేసీఆర్ పోకడలను తప్పుబట్టిన వారిని తెలంగాణ ద్రోహులుగా చిత్రించేవారు. ఇప్పుడు రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం కావస్తున్నా ఉద్యమ సమయంలో అమలు చేసిన వ్యూహాలకు మళ్లీ పదునుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రా వాళ్లు, ఆంధ్రా పెత్తనం అని మళ్లీ మొదలెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆంధ్రా తొత్తు అని నిందిస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబును వాడుకుంటున్నారు. తెలంగాణ సెంటిమెంటు మళ్లీ పండుతుందో లేదో తెలియదు గానీ, భారత రాష్ట్ర సమితి యంత్రాంగం అంతా అదే పనిలో నిమగ్నమై ఉంది. ఏ చిన్న అవకాశం లభించినా తెలంగాణ సెంటిమెంటును రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం తాము పెంచి పోషిస్తున్న సోషల్ మీడియా కూలీలను ప్రయోగిస్తున్నారు. దక్షిణ తమిళనాడులో ఒక ఆచారం ఉంది. ఎవరైనా చనిపోతే కూలి కోసం కొంత మంది వారి ఇళ్లకు వెళ్లి తమ ఇంట్లో వాళ్లు చనిపోయినట్టుగా నటిస్తూ శోకాలు పెడతారు. నిజానికి చనిపోయిన వారితో వారికి ఎటువంటి బంధుత్వం గానీ, ఇతరత్రా అనుబంధం గానీ ఉండదు. కాసేపు ఏడ్చినట్టు చేసి కూలి డబ్బులు తీసుకొని వెళ్లిపోతారు. ఇప్పుడు సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వాళ్లు నియమించుకున్న కూలీలు కూడా ఇంచుమించు ఇదే పనిచేస్తున్నారు. కేసీఆర్ అండ్ కోకు ఏ కష్టం వచ్చినా తెలంగాణకు కష్టం వచ్చినట్టుగా ఈ సోషల్ మీడియా కూలీలు ప్రచారం చేస్తున్నారు. ఈ కూలీలు పెట్టే పోస్టులు, వీడియోలు చూసి కేసీఆర్ అండ్ కో మురిసిపోతూ తెలంగాణ సమాజం అంతా అదే భావనతో ఉందన్న భ్రమల్లోకి వెళుతున్నారు.

టార్గెట్ రేవంత్!

టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు జారీ అయినప్పటికీ తెలంగాణలో గాలి స్తంభించలేదు. జనం ఎక్కడా రోడ్ల మీదకు రాలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసీఆర్ అండ్ కోకు ద్వేషం ఉందని చెప్పి ప్రజలంతా రేవంత్‌రెడ్డిని ద్వేషించాలని, ద్వేషిస్తారు అని భావించడం అవివేకం అవుతుంది. అయితే కేసీఆర్ అండ్ కో కేవలం తెలంగాణ సెంటిమెంటును మాత్రమే నమ్ముకోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడానికి ఇతర ప్రయత్నాలను కూడా అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి పొగలు రాజేయడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. రేవంత్‌రెడ్డి పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహంగా ఉందని, నాయకత్వ మార్పు జరుగుతుందని సోషల్ మీడియాలో తమ కూలీలతో ప్రచారం చేయించడం మొదలుపెట్టారు. నైనీ కోల్ బ్లాక్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. కేసీఆర్ సొంత మీడియా భట్టి తరఫున వకాల్తా పుచ్చుకొని అనేక కథనాలు వండి వార్చింది. భట్టి నివాసంలో నలుగురు మంత్రులు సమావేశమై ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా జట్టు కట్టారని ప్రచారం చేశారు. గడచిన కొంత కాలంగా బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ సొంత మీడియా పోకడలను గమనిస్తే రేవంత్‌రెడ్డిని గద్దె దించడమే వారి అభిమతంగా కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు పెరిగి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి అయిపోవాలని బలంగా కోరుకుంటున్నారు. అందుకే సందు దొరికితే చాలు ఎక్కడ పడితే అక్కడ చొరబడుతూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా గ్రూపులను ప్రోత్సహించే పనిని ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఒరిజినల్ కాంగ్రెస్‌కు చెందినవాళ్లంతా రేవంత్‌రెడ్డిపై అసంతృప్తితో రగిలిపోతున్నారని ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరినవారే అనడంలో సందేహం లేదు. అయితే వివిధ కారణాల వల్ల తెలంగాణ కాంగ్రెస్‌లో బలమైన నాయకులు లేకుండా పోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు ఎదగకుండా అడ్డుకున్నారు. జైపాల్‌రెడ్డి వంటి వారు కూడా అప్పట్లో నిస్సహాయులుగా మిగిలిపోయి ఢిల్లీకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరిన రేవంత్‌రెడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కాలం కలసి వచ్చి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. రేవంత్ ముఖ్యమంత్రి అవడానికి కేసీఆర్ మాత్రమే కారణం. దొరతనాన్ని విడిచిపెట్టి, కాస్తంత ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని కొంచెం చేరదీసినా గత ఎన్నికల్లో కేసీఆర్ మళ్లీ గెలిచి ఉండేవారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా– ఓటుకు నోటు కేసులో తాను జైలుకు పంపిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఏమిటి? అని కేసీఆర్ ఇప్పటికీ జీర్ణించుకోలేకపోవడం వల్లనే తంటా అంతా. కేసీఆర్ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి అంతటితో సంతృప్తి చెందకుండా విచారణల పేరిట కేసీఆర్ అండ్ కోను ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో ఉభయ పక్షాల మధ్య వైరం పతాక స్థాయికి చేరింది. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కేసీఆర్ అండ్ కో ముప్పేట దాడి మొదలెట్టింది. రేవంత్‌రెడ్డిని కూడా తక్కువ అంచనా వేయడానికి లేదు. కేసీఆర్ అండ్ కో తమ వద్ద ఉన్న అస్త్రశస్త్రాలు అన్నింటినీ వినియోగిస్తున్నందున మునిసిపల్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి తన వ్యూహాన్ని అమలు చేసే అవకాశం ఉంది. మునిసిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులపై జరుగుతాయి. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోగలిగితే రేవంత్‌రెడ్డి మరింత బలపడతారు. అప్పుడు కేసీఆర్ అండ్ కోను మరింత ఉక్కిరి బిక్కిరికి గురిచేస్తారు. ఈ విషయం తెలుసు కనుకే మున్సిపల్ ఎన్నికల్లోనే తెలంగాణ సెంటిమెంటును రగిలించే ప్రయత్నాలను బీఆర్ఎస్ ముమ్మరం చేసింది. కేసీఆర్ అంతటివాడు.. ఇంతటివాడు అని బీఆర్ఎస్ నాయకులు మురిసిపోతూ ఉండవచ్చు గానీ చట్టం ముందు అందరూ సమానులే. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ సిట్ విచారణను ఎదుర్కోవలసిందే. విచారణకు పిలిచినంత మాత్రాన ఆత్మగౌరవానికి భంగం వాటిల్లదు. ప్రజల్లో సానుభూతి కూడా ఏర్పడదు. కేసీఆర్‌ను జైలుకు పంపితే మాత్రం సానుభూతి ఏర్పడవచ్చు. బహుశా అందుకే కాబోలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

కేసీఆర్.. జగన్ సేమ్ టు సేమ్!

'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే విధానం అన్ని వేళలా పనిచేయదు. కేసీఆర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా ఇదే విధానాన్ని నమ్ముకున్నారు. చంద్రబాబు–రేవంత్‌రెడ్డి మధ్య గురుశిష్యుల బంధం ఉందో లేదో తెలియదు గానీ కేసీఆర్–జగన్‌రెడ్డి ఒకే మాట–ఒకే బాటగా సాగుతున్నారు. ఇరువురి ఎత్తుగడల మధ్య ఎన్నో సామీప్యతలు ఉంటున్నాయి. ప్రభుత్వాలపై ఎదురుదాడి చేయడంలో కూడా ఇరువురూ పోటీపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను మరచిపోయి బుకాయిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు అపురూపంగా భావించే లడ్డూలో వాడిన నెయ్యి కల్తీ కావడంపై సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సిట్ నిగ్గు తేల్చింది ఏమిటి? జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారం ఏమిటి? లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన అబద్ధమని సిట్ తేల్చిందని జగన్ అండ్ కో ఊదరగొడుతున్నారు. నిజానికి సిట్ దర్యాప్తు నివేదిక

> జరిగిన పాపంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి నేరుగా సంబంధం ఉందని చెప్పడం సహేతుకం కాదు. అయితే జరగరాని ఘోరం జరిగింది. నేరుగా సుప్రీంకోర్టుకే బాధ్యత వహించాల్సిన సిట్ అప్పట్లో ఏం జరిగిందో స్పష్టంగా చెబుతున్నందున ఇందులో శషభిషలకు తావులేదు. సిట్‌కు దురుద్దేశాలు ఆపాదించే అవకాశం కూడా లేదు.

అధికారికంగా విడుదల కాలేదు. జగన్‌రెడ్డి హయాంలో లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కొవ్వు అవశేషాలు కనిపించాయని ఎన్డీడీబీ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ప్రకటన చేశారు. అయితే ఇప్పుడు సిట్ విచారణ నివేదికలో అంతకంటే దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో తిరుమలకు సరఫరా అయింది అసలు నెయ్యే కాదని తేలింది. ఆవులు లేవు.. నెయ్యి ఉత్పత్తి కాలేదు. పామాయిల్లో కొన్ని కెమికల్స్ కలిపి నెయ్యి పేరుతో సరఫరా చేశారని సిట్ విచారణలో నిర్ధారణ అయింది. దీన్ని సాంకేతికంగా కెమికల్ కాక్టెయిల్ అంటారు. జంతువుల కొవ్వు కలిపి ఉంటే ఆ దేవదేవుడికి అపచారం చేసినవాళ్లు మాత్రమే అయ్యేవారు. ఇప్పుడు అంతకంటే మహా దారుణానికి ఒడిగట్టారని స్పష్టమైంది. రసాయనాల మిశ్రమం వల్ల భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడారు. దీన్ని ఏమనాలి? ఈ పరిస్థితికి కారకులెవరు? జంతువుల కొవ్వు కలవలేదని తెలిసిపోయిందని జబ్బలు చరుచుకుంటున్న జగన్ అండ్ కో కెమికల్స్ వాడటాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ పాపానికి ఒడిగట్టిన భోలే బాబా వంటి దిక్కుమాలిన సంస్థలు నెయ్యి సరఫరా కాంట్రాక్టు పొందడానికి వీలుగా నిబంధనలు సవరించింది ఎవరు? వారిపై తీసుకోబోయే చర్యలు ఏమిటన్నది ఇప్పుడు ముఖ్యం. ఢిల్లీ లిక్కర్ పాలసీని సవరించడం ద్వారా అవినీతికి ఆస్కారం కల్పించారన్న కారణంగా అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ప్రాతిపదికన తిరుమలలో నెయ్యి సరఫరా విధానాన్ని సడలించి నెయ్యి కాని నెయ్యిని సరఫరా చేసే అవకాశం కల్పించిన నాటి టీటీడీ పాలక మండలి ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి. తెలిసి జరిగినా తెలియక జరిగినా జరిగిన పాపానికి బాధ్యులందరూ శిక్ష అనుభవించాలి. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలి. సిట్ అధికారులు తమకు క్లీన్‌చిట్ ఇచ్చారని ఊరూ వాడా ప్రచారం చేసుకుంటున్న జగన్ అండ్ కోకు నివేదికలోని పూర్తి వివరాలు వెల్లడవుతున్న కొద్దీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డ పరిస్థితి. జరిగిన పాపంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి నేరుగా సంబంధం ఉందని చెప్పడం సహేతుకం కాదు. అయితే జరగరాని ఘోరం జరిగింది. నేరుగా సుప్రీంకోర్టుకే బాధ్యత వహించాల్సిన సిట్ అప్పట్లో ఏం జరిగిందో స్పష్టంగా చెబుతున్నందున ఇందులో శషభిషలకు తావులేదు. సిట్‌కు దురుద్దేశాలు ఆపాదించే అవకాశం కూడా లేదు. నాటి పాలక మండలి, అప్పటి అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించారనడంలో సందేహం లేదు. నెయ్యి టెండర్ల నిబంధనలను మార్చుతున్నప్పటికీ ఒక్కరంటే ఒక్కరు కూడా వారించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. అప్పుడూ ఇప్పుడూ ఈవోగా ఉన్న సింఘాల్ అన్నింటికీ తలూపడం ఏమిటి? జగన్ అండ్ కో చేసుకుంటున్న ప్రచారం

> డిల్లీ లిక్కర్ పాలసీని సవరించడం ద్వారా అవినీతికి ఆస్కారం కల్పించారన్న కారణంగా అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ప్రాతిపదికన తిరుమలలో నెయ్యి సరఫరా విధానాన్ని సడలించి నెయ్యి కాని నెయ్యిని సరఫరా చేసే అవకాశం కల్పించిన నాటి టీటీడీ పాలక మండలి ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి. తెలిసి జరిగినా తెలియక జరిగినా జరిగిన పాపానికి బాధ్యులందరూ శిక్ష అనుభవించాలి. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలి. ఈ వ్యవహారం భగవంతునికి, భక్తులకు మధ్య ఉన్న విశ్వాసానికి సంబంధించినది. ఆ దేవదేవుని సన్నిధిలోనే అవినీతి, అరాచకాలు జరుగుతున్నప్పటికీ ఉపేక్షించడం అంటే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అపచారం చేసినట్టుగానే భావించాలి.

> ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షాల కుయుక్తుల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న వారిపైనే ఉంటుంది. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోలేని రీతిలో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయించడంలో ప్రతిపక్షాలు ఆరితేరినందున ప్రభుత్వాలే జాగ్రత్తలు తీసుకోవాలి. మామూలుగా అయితే ప్రభుత్వం వల్ల ప్రతిపక్షాలకు ఇబ్బందులు వస్తాయి. ఇప్పుడు తెలుగునాట సీన్ రివర్స్ అయింది. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ అధినేతలకు ఈ విషయం అర్థమవుతోందా?

కాసేపు పక్కన పెడదాం. సిట్ పూర్తి నివేదికను, దాంతోపాటు సిట్ అధికారులు ప్రభుత్వానికి రాసిన లేఖను బహిర్గతం చేయాలి. ఈ పాపానికి ఒడిగట్టినవారు ఎవరు? వారు ఏ మేరకు అవినీతికి పాల్పడ్డారు? అన్నది న్యాయస్థానం నిర్ణయిస్తుంది. ఈలోగా అకారణంగా నిబంధనలను సడలించిన వారిని గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొనే ప్రయత్నం ప్రభుత్వం చేయాలి. ఈ వ్యవహారం భగవంతునికి, భక్తులకు మధ్య ఉన్న విశ్వాసానికి సంబంధించినది. ఆ దేవదేవుని సన్నిధిలోనే అవినీతి, అరాచకాలు జరుగుతున్నప్పటికీ ఉపేక్షించడం అంటే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి అపచారం చేసినట్టుగానే భావించాలి.

తప్పు చేసి ఎదురుదాడి..

తెలంగాణలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం ద్వారా వ్యక్తిగత గోప్యతను హరించడమే కాకుండా కేసీఆర్ అండ్ కో ఎదురుదాడి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడి కూడా జగన్ అండ్ కో ఎదురుదాడి చేస్తోంది. మేం అంతటివాళ్లం, ఇంతటివాళ్లం, మమ్మల్నే తప్పుపడతారా? అంటే కుదరదు. మమ్మల్ని ఏమైనా అంటే మా సోషల్ మీడియా కూలీలతో ఎదురుదాడి చేయిస్తామని దబాయించినా లాభం లేదు. ప్రజలు అమాయకులు కారు.. అన్నీ గమనిస్తుంటారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి తమ ఏలుబడిలో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదు. ఎదురుదాడితో ఎంతో కాలం నిజాలను దాచిపెట్టలేరు. రెండు రాష్ట్రాలలోనూ గత ఎన్నికల్లో ఈ విషయం రుజువైంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి చూరగొనే ప్రయత్నం చేయాల్సిన వాళ్లు కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వాలను అస్థిరపరిచే ప్రయత్నం చేయడం నేటి రాజకీయాలలో సరికొత్త ట్రెండ్. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కృత్రిమ అసమ్మతిని రాజేసే ప్రయత్నాలను కేసీఆర్ అండ్ కో చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నాలను జగన్ అండ్ కో చేస్తున్నారు. ఈ క్రమంలో జగన్ అండ్ కో హనీ ట్రాప్ వంటి కుయుక్తులకు కూడా పాల్పడుతోంది. రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో జరిగింది ఇదే. ఆ ఇరువురి మధ్య అనైతిక సంబంధం ఉండటం నిజం. ఎక్కడో తేడా వచ్చి బజారున పడ్డారు. కూటమి అధినేతలకు వెరపు ఉన్నందున ఇలాంటి సందర్భాలలో వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. అదే జగన్‌రెడ్డి హయాంలో చర్యల ఊసే ఉండేది కాదు. పైగా ఎదురుదాడి చేసేవారు. అనైతిక చర్యలకు పాల్పడిన వారికి ప్రోత్సాహకాలు ఉండేవి. ఏది ఏమైనా ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షాల కుయుక్తుల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న వారిపైనే ఉంటుంది. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోలేని రీతిలో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయించడంలో ప్రతిపక్షాలు ఆరితేరినందున ప్రభుత్వాలే జాగ్రత్తలు తీసుకోవాలి. మామూలుగా అయితే ప్రభుత్వం వల్ల ప్రతిపక్షాలకు ఇబ్బందులు వస్తాయి. ఇప్పుడు తెలుగునాట సీన్ రివర్స్ అయింది. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ అధినేతలకు ఈ విషయం అర్థమవుతోందా?

సర్వే చెప్పిన బడ్జెట్ బాణీ!

నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2026–27 వార్షిక బడ్జెట్ ఎలా ఉండబోతోంది? ప్రస్తుతం ప్రజల ముందు ప్రధాన సమస్యలు– ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి ఇత్యాదులు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఇవి ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో... ముఖ్యంగా 2013లో రూపాయి విలువ పతనం... ధరల పెరుగుదల ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కల్పించాయి. ఈ సమస్యల నేపథ్యంలోనే, 2014 పార్లమెంట్ ఎన్నికలలో – బీజేపీ పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ప్రజానీకంలో వున్న అసంతృప్తిని ఆసరాగా చేసుకొని అధికారంలోకి రాగలిగింది. అయితే బీజేపీ పాలనలో కూడా, గత కొద్ది సంవత్సరాలుగా... ధరల పెరుగుదల ప్రజలకు అతి పెద్ద సమస్యగా మారింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ప్రభుత్వంలోని వారు చెప్పుకుంటున్నప్పటికీ – నేటికి కూడా ధరల అంశం ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంది. దీనికి అదనంగా... డాలర్‌తో పోలిస్తే రూపాయి రికార్డు స్థాయి పతనం – ప్రజలను కలవరపెడుతోంది. అలాగే, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు అధికంగానే ఉండడం మరొక కీలకాంశం. డీజిల్ ధర అధికంగా ఉండడం వలన – సరుకు రవాణా చార్జీలు పెరిగిపోయి – ఫలితంగా సరుకుల ధరలు మరో 5శాతం మేరకు అదనంగా పెరుగుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

గత గురువారం నాడు ఆర్థికమంత్రి నివేదించిన ఆర్థిక సర్వేలో ధరల పెరుగుదల అంశానికి సంబంధించి పెద్దగా ప్రస్తావనలూ... పరిష్కారాల సూచనలూ ఏమీ లేవు. నేటి బడ్జెట్‌లో కూడా – ఈ అంశానికి సంబంధించి – ప్రత్యేక చర్యలు ఉండే అవకాశం లేదు. ఎందుకంటే, 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత – అన్ని ప్రభుత్వాల తీరూ – తమ ఆదాయాలను పెంచుకుని, ఖర్చులను తగ్గించుకునే విధానం పరిధి లోనే ఉంటోంది. అంటే, ప్రజల మీద సాధ్యమైనంత పన్నుల భారాన్ని మోపడం... మరో ప్రక్కన ప్రజలకు ఇచ్చే రాయితీలైన – ఎరువులు, ఆహారం, ఇంధనంపై సబ్సిడీలను క్రమేణా తగ్గిస్తూ పోవడంగానే ఈ విధానాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత బడ్జెట్ కూడా కచ్చితంగా దీనికి మినహాయింపుగా ఏమీ ఉండదు..!

నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తోందని చెప్పనవసరం లేదు. యువజనుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. ఈ ప్రధాన అంశానికి సంబంధించి – ఆర్థిక సర్వేలో చెప్పుకోదగ్గ ప్రస్తావన లేదు. ఈ నిరుద్యోగ సమస్యకు ఒక కీలక కారణంగా ఉంటోన్న – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించి – ఆర్థిక సర్వేలో ప్రత్యేక ప్రస్తావన ఉన్నప్పటికీ, ఈ సాంకేతిక పరిజ్ఞానం తెచ్చిపెట్టే నిరుద్యోగానికి సంబంధించి ఏం చేయాలో అదేమీ చెప్పలేదు. ప్రస్తుతం నడుస్తోన్న ఆర్థిక సంవత్సర కాలపు (2025–26) బడ్జెట్‌లో వున్న అనేక పథకాలు ఇప్పటికీ కాగితం మీదే మిగిలిపోయాయి.




2008 ఆర్థిక సంక్షోభ కాలంలో, మన దేశంపై ఆ ప్రభావం పడకుండా నిలువరించిన ప్రధాన అంశమైన – జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యపరుస్తోంది. కోట్లాది గ్రామీణ పేదలకు, ఉపాధి... ఆదాయ సమస్యల నుంచి ఉపశమనం కలిగించిన ఈ పథకం భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకమయింది. ఈ నేపథ్యంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఎలా ఉంటాయి?

ప్రజల కొనుగోలు శక్తి పతనం కావడం మరో ప్రధాన సమస్య. ప్రభుత్వాలు మాత్రం ఈ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేసే బదులు... కార్పొరేట్లకు మరింతగా రాయితీలను కల్పిస్తే... దానంతట అదే దేశంలో పెట్టుబడులు పెరిగి... ప్రజలకు ఉపాధి కల్పన జరుగుతుందనే తలకిందుల ఆలోచనలో కాలం గడుపుతున్నాయి. గత 30–35 సంవత్సరాల ఆర్థిక సంస్కరణల కాలంలో జరిగిందంతా ఇదే. బీజేపీ హయాంలో ఈ తరహా ఆలోచనలు మరింత బలంగా అమలు జరుగుతున్నాయి. ఇక, బ్యాంకులకు, కార్పొరేట్లు బకాయిపడ్డ లక్షల కోట్ల రూపాయల మొత్తాలను రైట్ ఆఫ్‌లు చేయడం వంటి అనేక కార్పొరేట్, ధనవంతుల అనుకూల విధానాలు అమలు జరుగుతున్నాయి. మరో ప్రక్కన, దేశంలోని సామాన్య జనం, మధ్యతరగతికి అందించే – సబ్సిడీలు, రాయితీలపై – రేవడి (ఉచితాలు) కల్చర్ పేరుతో చర్చలు పెట్టి – కోతలు విధిస్తున్నారు. నిజానికి, ఈ సొమ్ము కోటానుకోట్ల సామాన్య జనం చేతిలో ఉండాల్సినదే. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను కల్పించగలదు. ప్రస్తుతం ఈ డిమాండ్ కొరతే దేశ ఆర్థిక రంగంలోని అనేక సమస్యలకు కారణం.

ఒక ప్రక్కన మన ఆర్థిక వ్యవస్థ తాలూకు లక్ష్యాలు – నేడు పలు తీవ్రమైన అంతర్జాతీయ ఎదురుగాలులను ఎదుర్కొంటున్నాయని చెబుతూనే – మరో ప్రక్కన 2026–27 ఆర్థిక సంవత్సరంలో కూడా మన వృద్ధి రేటు 6.8 – 7.2 శాతంగా ఉండగలదంటూ, ఆర్థిక సర్వే రూపకర్తలు తమ భుజాలను తామే చరుచుకున్నారు. మన స్థూల ఆర్థిక వ్యవస్థ సూచీలన్నీ బాగానే ఉన్నాయంటూ బాకా ఊదుకోవడం. మరో ఆత్మాశ్రయ ధోరణి – అంటే, వృద్ధి రేటు బాగుండడం... ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం... బ్యాంకింగ్ రంగం పరిస్థితి ఆరోగ్యకరంగా ఉండడం వంటివి. ఇక్కడ ఈ ఆర్థిక సర్వే – గణాంకాల బలుపు మాటున దాగి వున్న వాస్తవ బలహీనతలను విస్మరించింది.

ఈ బడ్జెట్‌లోనూ కూడా ప్రజలపై పన్నుల భారాలను తగ్గించే అవకాశం పెద్దగా ఉండదు. ప్రజలకు లభించే సబ్సిడీలు, రాయితీలపై కోతలు మాత్రం కొనసాగే అవకాశమే అధికం. ఆర్థిక సర్వేలోని ఆత్మాశ్రయ పాండిత్య ధోరణులూ... నేల వదిలి సాము చేయడం అనేవి బడ్జెట్‌లో కూడా కొనసాగవచ్చు..!

• డి. పాపారావు





8

బెలూన్స్ ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న భవ్య వట్టికూటి, ఎంపీ కృష్ణదేవరాయలు

● ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి ● అట్టహాసంగా విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కే26 ప్రారంభం

సృజనాత్మకతే అసలైన సంపద



అంబటి రాంబాబు ఇంటి వద్ద టీడీపీ శ్రేణుల నిరసన



అంబటి.. బూతుపురాణం

గుంటూరులో రాంబాబు వ్యాఖ్యలపై ఆగ్రహం

- ఇంటి వద్ద నిరసనకు వెళ్లిన మహిళపై దాడికి యత్నం
- ప్రతిఘటించి అంబటి ఇల్లు, కార్యాలయాన్ని ధ్వంసం చేసిన టీడీపీ వర్గీయులు
- జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్డెక్కి తమ్ముళ్ల నిరసన
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన టీడీపీ శ్రేణులు

గుంటూరు న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బూతుల రాంబాబుగా పేరు పొందిన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి బూతు పురాణం లంఘించుకున్నారు. పోలీసులు, టీడీపీ కార్యకర్తల సాక్షిగా గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుపై బూతులతో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించి గుంటూరు గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం పరిశీలించిన అంబటి దానిని 24 గంటల్లో తొలగించాలని లేదంటే తానే తొలగిస్తానని ప్రకటించారు. చెప్పినట్లుగానే శనివారం మరోసారి ఆ ఫ్లెక్సీ వద్దకు వచ్చి తొలగించాలని చెప్పి, గోరంట్ల వెంకటేశ్వర స్వామి గుడిలో పూజకి వెళ్లారు. అయితే అంబటి ఫ్లెక్సీ వద్దకు వచ్చాడని తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దీంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అంబటి కారులో మళ్లీ ఫ్లెక్సీ ప్రాంతానికి వచ్చి అక్కడ ఉన్న టీడీపీ మహిళ పట్ల అనుచితంగా మాట్లాడారు. దీంతో మహిళలు ఎదురు తిరిగారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబుపై అసభ్యకరమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. అక్కడ ఉన్న తెలుగుతమ్ముళ్లు, పోలీసులు అడ్డుకోవడంతో రాంబాబు కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబును ఉద్దేశించి జుగుప్సాకరంగా, పరుషమైన పదజాలంతో దూషించిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో తెలుగు మహిళలు గుంటూరులోని అంబటి ఇంటి వద్దకు వెళ్లి నిరసనకు యత్నించారు. అప్పటికే అక్కడ ఉన్న వైసీపీ శ్రేణులతో పాటు రౌడీషీటర్లు తెలుగు మహిళల వెంటపడి తరిమికొట్టారు. దీంతో పోలీసులు ఆయన ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. నడిరోడ్డుపై మరోసారి రెచ్చిపోయిన అంబటి సీఎంను దూషిస్తూ ఇష్టానుసారంగా మాట్లాడడంతో అంబటి ఇంటి వద్ద ఉద్రికత పరిస్థితులు నెలకున్నాయి. ఈ క్రమంలో తెలుగు యువత నేతలు శివ నాగ మల్లేశ్వరరావు(మల్లి), కనపర్తి శీనివాసరావు, ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త రామచంద్రరావు, రాయపాటి అమృతరావు ఆధ్వర్యంలో అంబటి ఇల్లు, కార్యాలయంపైకి దూసుకెళ్లిన టీడీపీ కార్యకర్తలు ఫర్నిచర్, ఫొటోలు, అద్దాలు, పూల కుండీలను ధ్వంసం చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు అంబటి ఉన్న గది వద్ద మోహరించి టీడీపీ శ్రేణులను అడ్డుకున్నారు. చీపుర్లతో మహిళలు, హిజ్రాలు, దివ్యాంగుల నిరసన తెలిపారు. చివరకు శనివారం రాత్రి అంబటిని అరెస్టు చేసిన పోలీసులు నల్లపాడు స్టేషన్‌కు తరలించారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు, టీడీపీ నాయకులు

దిష్టిబొమ్మ దహనాలు.. ఫిర్యాదులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వివిధ రూపాల్లో (మిగతా 8వ పేజీలో)



గుంటూరులో అంబటి ఇంటికి నిప్పు



చిలకలూరిపేటలో అంబటి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నేతలు



ఆడిట్‌లో అవినీతి

లెక్కా పత్రం లేకుండా రూ.3.47 కోట్లు ఖర్చు

- తప్పుడు పత్రాలతో ఎన్జీ రంగా వర్సిటీలో నిధులు డ్రా
- సీనియర్ ఆడిటర్ అక్రమాల గుర్తింపు.. ఎత్తివేసిన మరో అధికారి

వివరణ కోరకుండా తొలగింపు..

సీనియర్ ఆడిటర్ పలు అక్రమాలను గుర్తించి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత సొమ్మును తిరిగి రాబట్టాల్సిన మరో సీనియర్ ఆడిట్ అధికారి అభ్యంతరాలను తుంగలో తొక్కారు. నివేదికలోని అభ్యంతరకరమైన పేరాలను సొంతంగా తొలగించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. గుర్తించిన అక్రమాల ఆధారంగా స్పెషల్ లెటర్ తయారు చేసి బాధ్యులైన వారి వివరణ కోరి సొమ్ము రికవరీకి చర్యలు చేపట్టాలి. నిధులు వినియోగంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి నుంచి రూ.5 వేలు వసూలు చేసి వినియోగ సర్టిఫికెట్లు(యూసీ) ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వినియోగ సర్టిఫికెట్లకే అంత వసూలు చేస్తే రూ.కోట్ల అక్రమాలకు సంబంధించిన అభ్యంతరకర పేరాలు తొలగించినందుకు ఎంత వసూలు చేసి ఉంటారన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో ఆడిట్‌లోని అవినీతి కోణం వెలుగులోకి వచ్చింది.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు క్షేమాన్ని కాంక్షించి విడుదల చేస్తున్న రూ.కోట్ల నిధులను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధికారులు పప్పు బెల్లాల్లా పంచుకుంటున్నట్లు స్పష్టం అవుతుంది. 2023-2024 సంవత్సరానికి తాజాగా ఆడిట్ రిపోర్ట్ వెలుగులోకి రాగా సుమారు రూ.3.47 కోట్లకు సంబంధించి సరైన లెక్కాపత్రం లేవని తేల్చారు. వర్సిటీకి కేటాయించే నిధులు దారి మళ్లకుండా సక్రమంగా ఖర్చు అవుతున్నాయా లేదా తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడిట్ బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీ చేయిస్తూ ఉంటుంది. 2023-24 మధ్యలో వర్సిటీకి చెందిన నిధుల వినియోగంపై 2025 చివరికి ఆడిట్ పూర్తి చేశారు. వర్సిటీకి చెందిన అనుబంధ సంస్థల్లో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చారు.

అక్రమాలు కోకొల్లలు..

2023-24 మధ్యలో విశ్వ విద్యాలయానికి చెందిన సొమ్మును నాటి వైసీపీ అధికారులు పప్పు బెల్లాల ఆరగించారు. ఉదాహరణకు తిరుపతి ఆర్ఏఆర్ఎస్‌లో కేంద్ర ప్రభుత్వ పేరివిజన్ నిబంధనలు ప్రకారం 2017 జూలై నుంచి ఆర్థిక ప్రయోజనాలు పొందాలి. కానీ అక్కడ ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు 2016 జనవరి నుంచి ఇంటి అద్దె పేరుతో రూ.32,48,386 నిధులను డ్రా చేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం బాధ్యులైన వారికి స్పెషల్ లెటర్ ఇచ్చి ఆ సొమ్మును తిరిగి రికవరీ చేయాలి. గుంటూరు లాం ఫాంలోని లైవ్ స్టాక్ రీసెర్చ్ (మిగతా 8వ పేజీలో)

దేశంలోనే ఆదర్శంగా పెన్షన్ల పంపిణీ

తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పించన్ల పంపిణీ విదానం దేశంలోనే ఆదర్శంగా జరుగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పట్టణంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమాన్ని వారి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీసి ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచడం కూటమి ప్రభుత్వం ఘనతన్నారు. ప్రతినెలా 1వ తేదీన 63 లక్షల మంది లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నామని, ఆ రోజు సెలవు అయితే ముందురోజు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి నాయకులు విశేష కృషి చేస్తున్నారన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 422 మందికి రూ.4.60 కోట్లు సీఎం సహాయ నిధి అందించామన్నారు. కార్యాలయంలో శనివారం 92 మందికి వైద్య చికిత్స కోసం రూ.85 లక్షల చెక్కులు, లెటర్ ఆఫ్ క్రెడిట్‌లను అందజేశారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలను అన్ని సౌకర్యాలతో మెరుగుపరుస్తున్నామన్నారు. రూ.26 కోట్లతో ఆయుష్ ఆసుపత్రి, కళాశాల నిర్మించి మళ్లీ ఆయుర్వేద వైద్యాన్ని ఈ ప్రాంత ప్రజలకు అందేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తదితరులు పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్లకు ఏర్పాట్లు చేయాలి

సమీక్షలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెనాలి-గుంటూరు మార్గంలో వడ్లమూడి వద్ద క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. తొలుత శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం క్వారీ తిరునాళ్లపై అధికారులతో సమీక్షించారు. ఫిబ్రవరి 15న జరగనున్న మహాశివరాత్రి పురస్కరించుకుని వచ్చే యాత్రికులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రోడ్ల బాధ్యత మాది..డ్రైవింగ్ మీది
● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ● ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు
8
నిర్మలమ్మ.. వరాలిచ్చేనా!
అమరావతికి చట్టబద్ధతపై ఆశలు

వైసీపీ హయాంలో అవినీతి రాజ్యం

కొప్పర్రు పునః ప్రారంభోత్సవంలో పెమ్మసాని

పెదనందిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో దొంగలు, దోపిడీదారులతో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని కొప్పర్రు వద్ద డీఎంఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన కొప్పర్రు ఎత్తిపోతల పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగకపోగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించుకెళ్లేవారన్నారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గుర్రైనట్లు డీసీ చైర్మన్ కల్లూరి కుసుమ శ్రీనివాస్‌లు విన్నవించగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఆలస్యమైనప్పటికీ చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గడిచిన ఏడాదిన్నరలో రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు వెనుకడుగు వేయలేదన్నారు. ప్రజాసంక్షేమం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాన్ని కూడా పక్కన పెట్టి రాష్ట్రం కోసం హర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు నోటికొచ్చిన దుర్భాషలు మాట్లాడడం సరికాదన్నారు. అంబటి రాంబాబు నోటి దురుసు తగ్గించుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ 4820 ఎకరాలకు నీరు ఇచ్చే ప్రాజెక్టుకు రూ.15 లక్షలు కూడా నిధులు ఇవ్వలేని స్థితిలో జగన్ పాలన సాగిందన్నారు. త్వరలో గుంటూరు ఛానెల్ పొడిగింపు పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జిల్లా గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ వందనాదేవి, మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, డీసీ చైర్మన్ కల్లూరి కుసుమ, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అమరేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు రాంబాబు, తెలుగు రైతు అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు కొల్లా సురేష్, రావి శివరామకృష్ణయ్య, పెద్దన్న, మండల శ్రీనివాసరావు, ఆముదాలపల్లి నరేంద్ర పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

సేద్యం విభాగంలో వేటపాలెం ఎడ్లకు ప్రథమ స్థానం

● ఆరు పళ్ళ విభాగంలో నంద్యాల జిల్లా ఎడ్లు ప్రథమం ● మోర్జంపాడులో హోరాహోరీగా ఎడ్ల పోటీలు

మాచవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 70వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన సేద్యం విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అశ్రిత శిరీష చౌదరి, శివరామకృష్ణ చౌదరి ఎడ్ల జంట 5,001.5 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండవరిపాలెం గ్రామానికి చెందిన గుడపల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లు జంట 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లు 44.89 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, పల్నాడు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన విడుసుపల్లి శ్రీనివాసరావు, శాఖమూరి విజయ పవన్ కుమార్ కంబైన్డ్ ఎడ్లు 4241 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు, దోవలపూడి వీర ప్రతాప్ చౌదరి కంబైన్డ్ 4007.5 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి మాధవరెడ్డి, గుదిబండి శ్రీనివాసరావు కంబైన్డ్ ఎడ్లు,



గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతి అందజేసి సన్మానం చేస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లు నాలుగు వేల అడుగుల దూరాన్ని బండను లాగి 6, 7వ స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు బహుమతులుగా అందజేశారు.

● ఆరు పళ్ళ విభాగంలో...

ఆరు పళ్ళ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్కే రెడ్డి ఎడ్లు 4879 అడుగుల దూరాన్ని బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 4840.7 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామ కోటయ్య ఎడ్లు 4832.3 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బీఎన్ఎస్ రెడ్డి, బీఆర్కే రెడ్డి కంబైన్డ్ జత 4600 అడుగుల దూరాన్ని నాలుగో స్థానంలో, బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన దేవరపల్లి రుత్విక్‌రెడ్డి, అన్విత్‌రెడ్డి, అక్షినేని సౌమ్యా చౌదరి ఎడ్లు 4419.3 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో, గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 4244 అడుగుల దూరాన్ని లాగి 6వ స్థానంలో, గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామానికి చెందిన రాజేష్ యాదవ్ మేస్త్రీ ఖాదర్ మస్తాన్ కంబైన్డ్ జత 4200 అడుగుల దూరాన్ని లాగి 7వ స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు నగదుతో పాటు షీల్డ్ బహుకరించారు. ఎడ్ల పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి గ్రామానికి చెందిన దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. ఎడ్ల యజమానులకు కమిటీ వారు అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నారు.

కేజేఎస్ఎస్ సేవలు ప్రశంసనీయం

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

● నూతన భవనానికి రూ. 23.50 లక్షల విరాళం



కేజేఎస్ఎస్ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతురావు

గుంటూరు (తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ కలిగిన గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న కమ్మ జన సేవ సమితి (కేజేఎస్ఎస్) సేవలు ప్రశంసనీయమని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గుంటూరు జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి రూ. 23 లక్షల 50 వేల భారీ విరాళాన్ని శనివారం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావుతో కలిసి సమితి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ, సమితి ద్వారా ఎందరో పేద విద్యార్థినులు ఆకాశాలు అందుకొని దేశ విదేశాల్లో స్థిరపడటం గొప్ప విషయమన్నారు. గత 23 ఏళ్లుగా ఈ సంస్థతో తనకు అనుబంధం ఉందని, పాలకవర్గం వారు ఒకే మాటపై సంస్థను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ, భాష్యం రామకృష్ణ ఇప్పుడు అందజేసిన విరాళంతో మొత్తం రూ.50 లక్షలు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న భవనానికి దాతలు ఇచ్చిన సహకారం మరువలేనిదన్నారు. అనంతరం జింకాన మాతా, శిశు కేంద్రానికి విరాళాన్ని అందజేసిన డాక్టర్ పిన్నమనేని లెనిన్‌ను, భాష్యం రామకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య, కోశాధికారి కాపూరి రవిచంద్ర, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, కరణం పట్టాభి సీతారామారావు, గౌరవ అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు, సలహాదారు వంకాయలపాటి బలరామ కృష్ణయ్య, ప్రత్యేక ఆహ్వానితులు గోరంట్ల పున్నయ్య చౌదరి, పెద్ది సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూ కల్తీ నిజమే

● చీఫ్ విప్ జీవీ



విలేకరులతో మాట్లాడుతున్న జీవీ

వినుకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకాన్ని సిట్ నిగ్గు తేల్చి నివేదిక ఇస్తే, సమాధానం చెప్పలేని వైసీపీ నాయకులు గుళ్లలోకి వెళ్లి తప్పుడు ప్రచారం చేయడం దారుణమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. శనివారం పట్టణంలో ఆయన లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని సిట్ నివేదిక ఇస్తే కోర్టు క్లీన్ చీట్ ఇచ్చిందని వైసీపీ తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. వైవీ సుబ్బారెడ్డి అకౌంట్లోకి రూ.కోట్ల డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీకి పాల్పడి రూ.2,510 కోట్లు దోపిడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన పాపం వైసీపీదే

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం దాచేపలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, హత్యలతో పాటు శ్రీనివాసుని లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించిన నెయ్యిలో కూడా అక్రమాలకు పాల్పడిందని అన్నారు. జంతువుల కొవ్వు నుంచి వచ్చిన నూనెను రసాయనాతో కృత్రిమంగా నెయ్యిని తయారు చేయించి వినియోగించటం దారుణమన్నారు. స్వామి ఆగ్రహానికి గురి కావడంతోనే వైసీపీ 11 సీట్లకు పడి పోయిందన్నారు.

దేశంలో అతిపెద్ద సంక్షేమ రాష్ట్రంగా ఏపీ

● మంత్రి అనగాని సత్యప్రసాద్



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగానిసత్యప్రసాద్

రేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను క్రమం తప్పకుండా అందిస్తూ ఏపీని దేశంలోనే అతి పెద్ద సంక్షేమ రాష్ట్రంగా నిలిపిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకవైపు రాష్ట్రభివృద్ధికి కృషి చేస్తూనే, మరోవైపు ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం భారీ ఎత్తున ఖర్చు చేస్తోందన్నారు. మాజీ సీఎం పింఛన్లు పెంచుతామని మోసం చేశారని, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.4వేలకు పెంచిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ లక్ష్మీ, చైర్‌పర్సన్ కట్టామంగా, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, టీడీపీ నాయకులు గుర్రం మురహరిరావు, గోగినేని పట్టాభి రామారావు, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, కుంభా తిరుపతయ్య, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, సజ్జాప్రసాద్, పంతాని సాయి కుమార్, తాతా ఏడుకొండలు, కేసన రామ కృష్ణ, డొక్కుబుజ్జి, షేక్ ముబీన్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సమాచారం రైతు చేతిలోనే

● వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలాని



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ డైరెక్టర్ మంజీర్ జిలాని సమూన్

గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యావత్తు వ్యవసాయ సమాచారం ఇకపై రైతు చేతిలోనే వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలాని సమూన్ అన్నారు. శనివారం పెదకాకాని మండలంలోని పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ పర్యటనలో రైతులకు ఉపయోగపడే ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్, మేనేజ్మెంట్ సిస్టం (ఏపీ ఏఐఎంఎస్ 2.౦) యాప్‌ను రైతుల మొబైల్ ఫోన్లలో రిజిస్ట్రేషన్ చేయించి, యాప్ పనితీరును వివరించారు. యాప్‌ను మరింత ఉపయోగకరంగా మార్చేందుకు ఇంకా ఏ అంశాలు జోడించాలనే విషయంపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులతోనే పంటను నమోదు చేయించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో పండిస్తున్న పంటలను పరిశీలించి, మొక్కజొన్న పంటలో కలుపు నియంత్రణపై రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వెనిగండ్ల గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా మట్టి నమూనాలసేకరణ, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అయితా నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, గుంటూరు వ్యవసాయ సహాయ సంచాలకులు నాగభైరు మోహన్ రావు, స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాధార వైద్య సేవలకు ఏసీఎల్ఎస్ అంబులెన్స్

● తమిళనాడు మాజీ గవర్నర్ రామమోహన్‌రావు

గుంటూరు మెడికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కాటూరి జనరల్ ఆసుపత్రి అత్యాధునిక అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమని తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామమోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కళాశాల ప్రాంగణంలో జరిగిన అత్యాధునిక 'అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) ఆంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ, ఈ అంబులెన్స్‌లో అత్యాధునిక ప్రాణాధార వైద్య పరికరాలలతో పాటు అత్యవసర ఔషధాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కాటూరి జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ అంబులెన్సుతో గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర ప్రాణాధార వైద్యం అందించాలనే కాటూరి ఆసుపత్రి యాజమాన్య లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకుగోల్డెన్ అవర్‌లో అత్యవసర సేవలు లభిస్తాయన్నారు.

మెయిల్ ఎక్స్‌ప్రెస్‌గా సిల్చార్ వీక్లీ రైలు

● మార్చి 18 నుంచి అమల్లోకి

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వారంలో ఒక రోజు గుంటూరు మీదుగా రాకపోకలు సాగిస్తోన్న చర్లపల్లి-సిల్చార్-చర్లపల్లి సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే శాఖ డిమోషన్ చేసింది. ఈ రైలును మెయిల్/ఎక్స్‌ప్రెస్ కేటిగిరీకి మార్చింది. రైలు నంబరు 12513 సిల్చార్-చర్లపల్లి సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ మార్చి 18వ తేదీ నుంచి నంబరు 15646 మెయిల్/ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. నంబరు 12513 చర్లపల్లి-సిల్చార్ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ మార్చి 21వ తేదీ నుంచి నంబరు 15645 మెయిల్/ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. దీని వల్ల టిక్కెట్ చార్జీలు తగ్గుతాయి.

అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య



దొడ్డెంపూడి శివశంకర్ (ఫైల్‌ఫోటో)

పెదనందిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుసులూరుకు చెందిన కౌలు రైతు దొడ్డెంపూడి శివశంకర్ (42) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, శివశంకర్ పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో, తెచ్చిన అప్పులు తీర్చలేకపోయాడు. అప్పులిచ్చినవారు ఒత్తిడి చేయడంతో తన ఇంటిని రూ.20లక్షలు తీర్చాడు. ఇంకా బాకీలు పేరుకుపోయి ఉండటంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి మృతి చెందాడు.

19న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న జరగనుంది. గత సమావేశంమొంథా తుఫాన్ ప్రభావంతో కోరం లేక వాయిదా పడింది. ఆ తర్వాత వెంటనే సమావేశం నిర్వహిస్తారనిభావించినప్పటికీ నిర్వహించలేదు. అనంతరం జనవరి 8న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అదే రోజున సరస్ కార్యక్రమం ప్రారంభించేందుకు సీఎం జిల్లా పర్యటనకు రావడంతో సమావేశం వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 19న నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నిర్ణయించినట్లు సీఈవో వీర్ల జ్యోతి బసు తెలిపారు.

జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

● విద్యా కంపెనీల అనుసంధాల సీఈఓ సుకన్య వేలూరి



సుకన్య వేలూరికి జ్ఞాపికను అందిస్తున్న రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యా, పరిశోధన, టీచింగ్, నర్సింగ్, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉద్యోగావకాశాలను జర్మనీ దేశం కల్పిస్తుందని అంతర్జాతీయ విద్యా కంపెనీల అనుసంధాల సీఈవో సుకన్య వేలూరి తెలిపారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలంను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జర్మని భారత యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా జర్మనీ భాషను నేర్చుకోవడానికి విశ్వవిద్యాలయాల్లో కొన్ని నెలలపాటు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) యాక్ట్ కేసులలో బాధితులకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సత్వరమే సహాయం, న్యాయం అందించేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ (పీఓఏ) యాక్ట్, మాన్యువల్ స్కావెంజర్ రీహాబిలిటేషన్ యాక్ట్, దేవదాసి (ప్రొహిబిషన్ ఆఫ్ డెడికేషన్ యాక్ట్ 1988) కమిటీ సమావేశం శనివారం జరిగింది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ (పీఓఏ) యాక్ట్ కింద నమోదైన కేసుల పురోగతి, ఇతర అంశాలపై అధికారులతో తెలుత జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ(పీఓఏ) యాక్ట్ కేసులలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసు శాఖ నిందితులపై చట్ట ప్రకారం కేసులు నమోదు, నకాలంలో ఛార్జిషీట్లు వేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణ మూర్తి, నాన్-అఫిషియల్ సభ్యులు ముడావత్ శ్రీను నాయక్, సిహెచ్ విజయ్ కుమార్, పౌరి ఏసురత్నం, కంతేటి బ్రహ్మయ్య, టి.మోహన్‌గాంధీ, జి.శశిధర్ కుమార్, కె.సునీల్ కుమార్, రెడ్డి రమణమ్మ, మాతంగి హేమలత, ఎన్.ప్రశాంతి, ఎస్టీఏ సంస్థ సభ్యులు ఎం.అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు చెన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్రముని, సీపీఓ/సీపీఎల్ గుంటూరు సర్కిల్ ఈఈ నాగేశ్వరరావు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్ బాబు, వివిధ ప్రభుత్వ శాఖల ఇన్‌ఛార్జి డీఈఓ దుర్గాబాయి, డీపీఓ సాయి కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఎస్ఈ హజరత్తయ్య, డీఈవో నబీ బాషా, డీఎస్పీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

రహదారి భద్రత నిబంధనలపై అవగాహన అవసరం

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రజలకు రహదారి భద్రత నిబంధనలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శనివారం జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు సర్వీస్ రోడ్లపై మాత్రమే ప్రయాణించేలా రవాణా పోలీస్ శాఖ అధికారులు నిరంతరం తనిఖీ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ ఖాజావలి, డిటీసీ, డీఈవో సలీం బాషా పాల్గొన్నారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలను అధిగమించాలి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి అయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవిలతో కలిసి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలు, గుంటూరు ఛానల్ అభివృద్ధి, విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై 1.0లో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సమా వేశంలో డీఆర్‌ఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, జిల్లా రిజిస్ట్రార్ కైలాష్, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షిస్తోన్న సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

బొంగరాలబీడులో ప్రభుత్వాస్పత్రి-2 నిర్మిస్తాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రికి రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా బొంగరాలబీడులోని ఆరు ఎకరాల స్థలంలో జీజీహెచ్‌కు అనుబంధంగా మరొక ప్రభుత్వాస్పత్రిని (జీజీహెచ్ వింగ్) నిర్మిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శుశృతుడి విగ్రహాన్ని శనివారం కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలోని డెర్మటాలజీ, డెంటల్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ వంటి పలు రకాల నాన్ ఎమర్జెన్సీ వైద్య విభాగాలను బొంగరాలబీడులో నిర్మించే ప్రభుత్వాస్పత్రి-2కు తరలిస్తామని వివరించారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ పుట్టిన గడ్డపై ప్రేమతో అమెరికాలో స్థిరపడిన గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు వందల కోట్లు విరాళంగా అందజేసి జీజీహెచ్, జీఎంసీ అభివృద్ధికి సహకరించడం గొప్ప విషయమన్నారు. డాక్టర్ రాజాకరణం మాట్లాడుతూ శస్త్రచికిత్సలకు ఆద్యుడైన శుశృతు మహర్షికి దేశంలోనే రెండో విగ్రహం గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ పోదిల ప్రసాద్, కార్పొరేటర్‌పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గాంధీజీ జీవితం ఆదర్శం కావాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర వహించిన మహాత్మాగాంధీ నేర్పిన సత్యం, అహింస మార్గాన్ని విద్యార్థులు అధ్యయనం చేయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ది గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, కిరాణా, జనరల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక కాసు సాయమ్మ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన ప్రథమ ద్వితీయ తృతీయ విజేతలకు నగదు పురస్కారం, 20 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు, స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమత, టీడీపీ రాష్ట్ర నాయకుడు చిట్టాబత్తిని చిట్టిబాబు, కొనగళ్ళ సత్యం, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ, కోశాధికారి అచ్యుత నిరంజన్, పొట్లూరి శ్రీనివాస్, బచ్చు భరద్వాజ్, చుండూరు దామోదరరావు పాల్గొన్నారు.

4న ఆరోగ్య శాఖ మంత్రిచే సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

గుంటూరు మెడికల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో వినూత్నంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన మెడ్‌ఫ్యూజన్ 2026ను ఫిబ్రవరి నాల్గవ తేదీ ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. శనివారం మెడ్‌ఫ్యూజన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాశాల నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సుందరాచారీ ర్యాలీలో వైద్య విద్యార్థులతో పాటు పాల్గొన్నారు. అనంతరం బైక్ ర్యాలీ మెడికల్ కాలేజీ నుంచి ప్రారంభమై లక్ష్మీపురం, ఇన్నర్ రింగ్‌రోడ్, బస్టాండ్ సెంటర్, రమేష్ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ శ్రీధర్, డాక్టర్ డీ మాధవి, డాక్టర్ మారుతీ దేవి, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

అరండల్‌పేట శివాలయాన్ని సందర్శించిన హంపి పీఠాధీశ్వరుడు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ గంగా మీనాక్షి సోమ సుందరేశ్వరస్వామి ఆలయ(అరండల్ పేట 4/4 శివాలయం) 124వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు శ్రీ హంపి విరూపాక్ష పీఠాధీశ్వరుడు విద్యారణ్య భారతీ స్వామి వచ్చారు. శనివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం స్వామి వార్ల నందివాహన సేవ, మధ్యాహ్నం 5 వేల మందికి అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. యాగబ్రహ్మ గుంటూరు కాశీ విశ్వనాథ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే మాధవి తదితరులు



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్న కూటమి ప్రభుత్వం

● పంపిణీ చేసిన కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 34వ డివిజన్‌లో శనివారం ఆమె కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో వితంతు, వృద్ధాప్య పింఛన్లను నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 అందిస్తున్నామని, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో నెలకు సుమారు రూ.25 కోట్లను పింఛను రూపంలో ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కక్షపూరితంగా కొందరి పింఛన్లు నిలిపివేశారని, అలాంటి వారికి కూడా కూటమి ప్రభుత్వం బాధ్యతగా పింఛన్లు పునరుద్ధరించి అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒకరోజు ముందుగానే పింఛన్లు: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందుగానే రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సీతానగర్, రామిరెడ్డితోటలో లబ్ధిదారులకు శనివారం ఉదయం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కుటుంబంలో పింఛన్ తీసుకుంటూ ఎవరైనా మరణిస్తే స్పౌజ్ పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఐదేళ్ల కాలంలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్లు పెంచిన జగన్ ఎక్కడ? అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పింఛన్ పెంచిన సీఎం చంద్రబాబు ఎక్కడ అని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి లడ్డూల తయారీలో కల్తీ జరిగిన విషయాన్ని సుప్రీం కోర్టు నిర్ధారించినప్పటికీ వైసీసీ నీచ రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

● ఇంటర్ బోర్డు ఆర్ఐఒ సునీత

గుంటూరు(విద్య),జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రెండు విడతల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇంటర్ బోర్డు ఆర్ఐఒ గర్నెపూడి సునీత తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు 27,960 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉంటాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేశామని ఆర్ఐఒ సునీత తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి మొత్తం 48 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 771 మంది ఎగ్జామినర్లు ఉంటారని వెల్లడించారు. ప్రయోగ పరీక్షల ప్రశ్నాపత్రాల కోసం మొత్తం 21 స్టోరేజి కేంద్రాలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లు వాట్సప్ మిత్ర లేదా ఇంటర్ బోర్డు (బిఐఇ.ఎపి.జివోవి) ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చునని ఆర్ఐఒ తెలిపారు.

ఆర్వీఆర్ అండ్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 'స్మార్ట్ వాయిస్ కంట్రోల్డ్ వీల్ చైర్ జాతీయ స్థాయిలో విజ్ఞానంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వైజ్ఞానిక పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువు తున్న ఎం.భార్గవ్ నాగ తేజ, కె.సాయి చైతన్య, తృతీయ సంవత్సరం చదువుతున్న పి.శేఖర్, ఐ.ఓ.టి విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్.అఖిల్ శివ చౌదరి తదితరులు వీల్ చైర్ రూపొందించారని తెలిపారు. విద్యార్థులను అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస రావు, ఐఒ టి విభాగాధిపతి డాక్టర్ నాగ మల్లేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డీవీవీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో విజేతలుగా లయోలా, ఏసీఎంఈ పాఠశాలలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీఎంఈ పాఠశాల డైరక్టర్ నందమూరి సౌంగధ్ కృష్ణ

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ పరిధి, పొత్తూరు గ్రామంలోని ఏసీఎంఈ పాఠశాలలో శనివారం అంతర పాఠశాలల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో లయోలా పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సెయింట్ జోసఫ్ (సీబీఎస్ఈ) పెదకాకాని, సెయింట్ జోసఫ్ (ఐసీఎస్ఈ) నంబూరు, ఎస్ఎస్‌వి ఇంటర్నేషనల్ పాఠశాల, ఏసీఎమ్ఈ పాఠశాల జట్లు తలపడ్డాయి. హోరాహోరీ పోరులో సీనియర్ విభాగంలో లయోలా పబ్లిక్ స్కూల్ విజేతగా నిలువగా, ద్వితీయ, తృతీయ స్థానాలను సెయింట్ జోసఫ్ (సీబీఎస్ఈ) పెదకాకాని, ఎస్ఎస్‌వి ఇంటర్నేషనల్ పాఠశాల కైవసం చేసుకున్నారు. అండర్-10 విభాగంలో ఏసీఎమ్ఈ పాఠశాల(పొత్తూరు) టైటిల్ సాధించగా, ద్వితీయ స్థానాన్ని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దక్కించుకుంది. ముగింపు కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నందమూరి సౌగంధ్ కృష్ణ, నందమూరి దీప్తి హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : కృష్ణ దేవరాయ పేద, బలహీన వర్గాల సహాయ నిధి నుంచి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆదివారం సంపత్‌నగర్ శ్రీరామ నామ క్షేత్రంలోని శ్రీ విద్యా భారతి సదనంలో ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నారు. కృష్ణ దేవరాయ పేద, బలహీనవర్గాల సహాయ నిధి మేనేజింగ్ ట్రస్టీ, తులసీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరగాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నిర్దేశిత నిబంధనల ప్రకారమే నిర్మాణాలు జరగాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఆర్టీసీ కాలనీలో డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్)లో దరఖాస్తుదారు భవన నిర్మాణాన్ని శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తదుపరి చర్యలపై పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డీపీఎంఎస్ ద్వారా అందే 500 స్క్వేర్ మీటర్ల పైబడిన భవనాలతో పాటు, ర్యాండమ్‌గా ఇతర దరఖాస్తులను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. నిర్దేశిత ప్రభుత్వ అనుమతులను నిర్మాణ దశలోనే పాటించేలా పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ చేయాలని, కేవలం నోటీసులు ఇవ్వడం కాకుండా నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో సీపీ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం, శ్రీ రమ సత్యనారాయణ స్వామి దేవస్థాన 49వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం బలిహరణ, కుంకుమార్చన, ఎదురుకోల నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ అర్చకులు స్వామి వారి కల్యాణం వేడుకగా జరిగింది. కార్యక్రమాల్ని చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

● నరెడ్కో నాయకుల విజ్ఞప్తి



కమిషనర్ మయూర్ అశోక్ సత్కరిస్తున్న నరెడ్కో నాయకులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నరెడ్కో నాయకులు కమిషనర్ కే.మయూర్ అశోక్‌కి విజ్ఞప్తి చేశారు. శనివారం నరెడ్కో నాయకులు కమిషనర్ ను కలిసి బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నగరాన్ని క్రమబద్ధమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వ విభాగాలు, నిర్మాణ రంగం మధ్య సమన్వయం ఎంతో అవసరమని తెలియజేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, చట్టబద్ధమైన అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరెడ్కో కాపిటల్ జోన్ అధ్యక్షులు కేసీహెచ్ అంకారావు, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి మాదాల శ్రీనివాస్, ట్రెజరర్ తిరుపతయ్య, సలహా కమిటీ సభ్యులు ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీచ నికృష్టుడు.. అంబటి రాంబాబు : మన్నవ



లైబ్రరీని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అంబటి రాంబాబు ఒక నీచ నికృష్టుడని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పని చేసిన వ్యక్తి ఇలాంటి బూతు పురాణం అందుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, అంబటి రాంబాబు వాడిన పదజాలం కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాదు, అది వ్యక్తిగత దూషణ, అసభ్యతతో, సంస్కారహీనమైన భాషతో కూడుకున్నదని విమర్శించారు. తిరుమల కల్తీ నెయ్యి విషయాన్ని సైడ్ ట్రాక్ చేయాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకుడు జగన్ ఆడిస్తున్న గేమ్‌లో భాగంగానే అంబటి రాంబాబు నీచ నికృష్టుడు రాష్ట్ర ముఖ్యమంత్రిపై బూతుపురాణంతో రెచ్చిపోయాడని ఆయన ఆరోపించారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని, అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు సుమోటోగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

కుప్పంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు

ఏపీటీఎస్ ఆర్థిక సహకారంతో సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ లైబ్రరీని ముఖ్యమంత్రి శుక్రవారం ప్రారంభించగా, ఏపీటీఎస్ ఛైర్మన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబాబు వ్యాఖ్యలను ఖండించిన మేయర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖలను ఖండిస్తున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగరంలోని చిల్లీ దాబా సెంటర్ వద్ద అంబటి రాంబాబు శనివారం ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను మేయర్ ఖండించారు. మేయర్ మాట్లాడుతూ అంబటి రాంబాబు సభ్య సమాజం తలదించుకొనేలా అసభ్య పదజాలంతో ముఖ్యమంత్రిని దూషించడం పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ విమర్శలు చేయదలచుకుంటే పదునైన మాటలతో రాజకీయం చేయవచ్చు కాని, ఇటువంటి అప్రజాస్వామికమైన, అసభ్య పదజాలం వాడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం తప్పన్నారు.

అంబటి వ్యాఖ్యలు అత్యంత హేయం

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు అత్యంత హేయమని మిర్చి యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు అన్నారు. అది ఆయన నీచ ప్రవర్తనకు నిదర్శనమని, "రాష్ట్రానికి సీఎం గా ఉన్న వ్యక్తిపై అసభ్య పదజాలం వాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై టీడీపీ శాంతియుతంగా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంటే, దానిపై అంబటి రాంబాబు అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. అంబటి రాంబాబు బయటికి వచ్చి మోకరిల్లి రాష్ట్ర ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అంబటి బూతులు ఆ పార్టీ నీచ సంస్కృతికి నిదర్శనం : శివశంకర్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు బూతు పదజాలంతో దూషించటం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనమని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన సీఎం పదవిలో ఉన్న నేతను అంబటి బూతులతో తిట్టటం ఆయన హీన సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. సీఎం చంద్రబాబుపై అంబటి వ్యాఖ్యలు ఆమోద యోగ్యం కాదని , బేషరతుగా అంబటి క్షమాపణ చెప్పాలన్నారు.

అంబటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : వైసీపీ నేతలు

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పై, ఇంటిపై దాడి చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తికి వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో శనివారం రాత్రి వైసీపీ నేతలు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, హోం శాఖ మాజీ మంత్రి మేకతోటి సుచరిత, వనమా బాలవజ్రబాబు, బలసాని కిరణ్‌కుమార్, దొంతిరెడ్డి వేమారెడ్డి పలువురు నాయకులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసేందుకు కార్యాలయానికి వెళ్ళారు. అదే సమయంలో ఎస్పీ అందుబాటులో లేకపోవటంతో అడిషనల్ ఎస్పీ రమణమూర్తిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి అంబటిపై, ఇంటిపై దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు రక్షణ కల్పించటంలో విఫలమయ్యారని విమర్శించారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఘటనపై పోలీసులు నిష్పాక్షంగా వ్యవహరించాలన్నారు.

ప్రజ్ఞ చక్రనాగ్‌కు టైమ్స్ ఆఫ్ ఇండియా పురస్కారం

గుంటూరు(విద్య), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యా సంస్థ కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ విద్యారంగంలో విశేష కృషి చేసినందుకు ప్రతిష్ఠాత్మక టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డు పంజాబ్ గవర్నర్ గులాబ్చాంద్ కటారియా చేతుల మీదుగా అందుకున్నారు. చక్ర నాగ్‌కు జిల్లా అప్పుస్మ నాయకులు నాయుడు కోటేశ్వరరావు, కెనడి శ్రీకాంత్, కన్నా మాస్టర్, మస్తాన్‌రావు, మహమ్మద్ మున్ను, కాటూరి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, సంతన్ కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



సీతమ్మ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో రోడ్డుపై చెత్తాచెదారం

ప్రధాన రహదారులు, ఖాళీ స్థలాలలో చెత్తాచెదారం

● మున్సిపల్ సిబ్బంది తీరుపై ఖాళీ స్థలాల యజమానుల ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై చెత్తాచెదారాన్ని వేస్తున్నారు... నగరంలోని శ్యామల నగర్ ఎక్స్‌టెన్షన్‌లో గల సీతమ్మ కాలనీ శివార్లలో ప్రధాన రహదారులను మున్సిపల్ సిబ్బంది అపరిశుభ్రం చేస్తున్నారు..... ప్రజలు నడిచేందుకు వీలు లేకుండా రోడ్డుపైనే నగరంలో తొలగించిన పాత భవనాల మెటీరియల్స్, వ్యర్థాలను తీసుకొచ్చి అక్కడ డంపింగ్ చేస్తున్నారు. నల్లపాడు రైల్వే స్టేషన్‌కి వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ప్రధానమైనది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారిలో ప్రతిరోజు అనేక కాలనీల ప్రజలు నల్లపాడు రైల్వే స్టేషన్‌కి వెళ్తున్నారు. స్థానిక ప్లాట్ల యజమానులు అనేక పర్యాయాలు ఆ వ్యర్థాలను అక్కడికి తొలగించారు. అయినా కూడా మరల తీసుకొచ్చి ఇక్కడే పడేస్తూ ఉన్నారు.... దీంతో గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్లాట్ల యజమానులు కోరుతున్నారు.

బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డుకు ఆధునిక రూపం

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవరంలో మౌలిక వసతుల అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. పశ్చిమ నియోజకవర్గం 37, 38 డివిజన్ల పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లో మొత్తం రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆర్‌సీసీ డ్రెయిన్, ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. బృందావన్ గార్డెన్స్ 2వ లైన్ నుంచి 6వ లైన్ వరకు ప్రధాన రహదారి ఇరువైపులా రూ.142.00 లక్షలతో 740 మీటర్ల మేర డ్రెయిన్, కల్వర్టుల నిర్మాణం, రాజేంద్ర నగర్ 2వ లైన్ నుంచి హనుమయ్య కంపెనీ వరకు బృందావన్ గార్డెన్స్ ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.119.00 లక్షలతో 620 మీటర్ల మేర డ్రెయిన్ కల్వర్టులను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరించాలన్నది స్థానిక ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అని, ఆ మేరకు 40 అడుగుల రహదారిని సుమారు 70 అడుగుల వెడల్పుతో ఆధునీకరించే ప్రతిపాదనకు మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్ల బాధ్యత మాది..డ్రైవింగ్ మీది

- రోడ్డు ప్రమాద మరణాలు ఆందోళనకరం
- ర్యాష్, డ్రంకెన్ డ్రైవ్‌కు యువత దూరంగా ఉండాలి
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు


వ్యాసరచన విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి డాక్టర్ పెమ్మసాని, జేసీ, డీఆర్వో, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో యుద్ధం, ప్రకృతి వైపరీత్య సమయాల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది చనిపోవడం ఆందోళన కలిగించే విషయమని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. దేశంలో ఏటా 1.60 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, అందులో సగానికి పైగా యువతే ఉండటం బాధకరమన్నారు. యువతలో మెదడు పరిపక్వత చెందక తొందరపాటుగా వాహనాన్ని నడుపుతున్నారన్నారు. శిరస్త్రాణం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి కారణాలతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. శిరస్త్రాణం ధరిస్తే జుట్టు రాలిపోతుందనేది కేవలం అపోహ మాత్రమేనని, జన్యు సంబంధిత, ఇతర కారణాలతోనే జుట్టు రాలిపోతుందే తప్ప హెల్మెట్ కారణం కాదన్నారు. ఎంతోమంది రేసర్లు నిత్యం హెల్మెట్ పెట్టుకుంటున్నా.... ఏ ఒక్కరికి జుట్టు రాలడం లేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, తీసుకునే మద్యం అతి తక్కువ మోతాదులోనే అయినప్పటికి, ఆ ప్రభావం మెదడుపై ఎక్కువగా పనిచేస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలలో వెన్నుపూస కాలి, చేతి ఎముకలు తదితర ప్రమాదాలు జరిగి జీవితాంతం మంచానికి పరిమితమైతే ఆ ప్రభావం ఆ కుటుంబంపై పడుతుందన్నారు. రోడ్లను బాగు చేసే బాధ్యత తమదని, వాహనాలను జాగ్రత్తగా నడిపే బాధ్యత వాహనదారులదన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ విద్యా సంస్థల్లో రోడ్డు ప్రమాదాలు, రహదారి భద్రత నియమాలపై అవగాహన తరగతులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ వాహనదారుల జరిమానాల విధింపులో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. నగరంలో కొన్ని చోట్ల రోడ్డు ఎడమ వైపు పూర్తిగా మూసివేస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గతేడాది గణాంకాల ప్రకారం 348 మరణాలు నమోదు అయ్యాయని, వచ్చే ఏడాదిలో వాటిని జీరో శాతానికి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నెలరోజులుగా రవాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పెమ్మసాని, ఎమ్మెల్యేలు బహూమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. జిల్లా ఉపరవాణ కమిషనర్ సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏఎస్పీ రమణమూర్తి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, ఆర్టీవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమ్మ.. వరాలిచ్చేనా!

- అమరావతికి చట్టబద్ధత, నిధులపై ప్రజల ఆశలు
- రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు నిధులపై ఉత్కంఠ
- నేడు కేంద్ర ఆర్థిక బడ్జెట్

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 2026 - 27 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ ఆదివారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో అమరావతి రాజధానికి ఏ మేరకు నిధులు కేటాయించారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. అలానే రాజధానికి చట్టబద్ధత కల్పిస్తామని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. ఆ విషయాన్ని బడ్జెట్ ప్రసంగంలో చేరుస్తారా, లేదానన్న చర్చ జరుగుతోంది. గతేడాది వివిధ ఆర్థిక సంస్థల ద్వారా రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించడంతో నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. కేవలం ఏడాదిన్నర కాలంలోనే స్పష్టమైన మార్పు అమరావతిలో కనిపిస్తోంది. అమరావతి అవుటర్ రింగు రోడ్డు, నూతన రైలు మార్గం వంటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ప్రజలు ఆశలు పెట్టుకొన్నారు. రైల్వే, హైవే ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయడానికి నిధులు కేటాయిస్తారని ఆశిస్తు న్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంటూరు జిల్లాలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ఏడాదిన్నరలోనే శంకర్ విలాస్, నందివెలుగు, ఇన్నర్ రింగురోడ్డు, పలకలూరు తదితర ఆర్‌వోబీలను కేంద్రం మంజూరు చేసింది. వీటిల్లో శంకర్ విలాస్, నంది వెలుగు ఆర్‌వోబీల పనులు వేగంగా జరుగుతున్నాయి. గుంటూరు - బీబీ నగర్ రైల్వే డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు కూడా జోరందుకున్నాయి. సెక్షన్ల వారీగా ఈ ప్రాజెక్టులను రైల్వే శాఖ పూర్తి చేస్తోంది. ఈ రెండు ప్రాజెక్టుల్లో వేగం పెంచడానికి కనీసం రూ.300 కోట్లు అయినా బడ్జెట్‌లో కేటాయిం చాల్సి ఉంటుంది. అమరావతి అవుటర్ రింగు రోడ్డుని ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించబోతోంది. దీనికి సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ని ఇటీవలే విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు భూసేకరణకు భారీ మొత్తంలో నిధుల అవసరమవుతాయి. అలానే అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం(ఎర్రుపాలెం - నంబూరు) ప్రాజెక్టు భూసేకరణకు కూడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి. జాతీయ రహదారులు కొన్ని ప్రతిపాదిత దశలో ఉండగా, మరికొన్ని నిర్మాణం జరుగుతున్నాయి. నిజాంపట్నం పోర్టుని కనెక్టు చేసేందుకు ఒక రహదారిని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. అలానే పేరేచర్ల - కొండమోడు సెక్షన్‌ని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తున్నారు. పీపీపీ విధానంలో అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీని ప్రతిపాదించారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలపాల్సి ఉంది. అలానే గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌ని రూ.60 కోట్లతో అభివృద్ధి చేసేందుకు పీపీపీ విధానంలో పొందుపరిచారు. వీటన్నింటికి కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే ప్రాజెక్టులు రూపుదిద్దుకొంటాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజానీకం నిర్మల సీతారామన్ ఏమేమీ వరాలు ప్రకటిస్తారోనని ఎదురు చూస్తోంది.

సృజనాత్మకతే అసలైన సంపద

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి
- అట్టహాసంగా విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కె26 ప్రారంభం


విద్యార్థుల నుంచి క్రీడా జ్యోతి అందుకుంటున్న భవ్య వట్టికూటి


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు


విద్యార్థిని నృత్య ప్రదర్శన

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): పోటీల్లో మెడల్ గెలిచామా, ఓడిపోయామా అన్నది ముఖ్యం కాదని, పోటీల్లో పాల్గొనడం ద్వారా నేర్చుకునే అనుభవం, పొందే సృజనాత్మక నైపుణ్యాలే అసలైన సంపదని వాల్తేరు డివిజన్ ఆఫ్ ఈస్ట్ కోస్ట్ రైల్వే ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి (ఐఆర్‌ఎంఎస్) అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భవ్య మట్లాడుతూ తాను విజ్ఞాన్‌లో చదువుతున్న రోజుల్లోనే సివిల్స్ సాధించాలనే కల మొదలైందని, దానికి అనుగుణంగా నిరంతరం శ్రమించి పదేళ్ల తర్వాత ఆ లక్ష్యాన్ని చేరుకున్నా నని తెలిపారు. విద్యార్థులు కలలు కని, వాటిని కష్టపడి, పట్టుదలతో సాధించాలని సూచించారు. ఈ బాల మహోత్సవ్ విద్యార్థులు కొత్త విష యాలు ప్రయత్నించడానికి మంచి అవకాశంగా మలచుకోవాలని సూచించారు. క్రీడల కోసం వచ్చారంటే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్య క్రమాల కోసం వచ్చా రంటే వ్యాస రచన, క్విజ్, లేఖా రచన వంటి సాహిత్య విభా గాల్లో కూడా ప్రతిభను పరీక్షించుకోవాలన్నారు. కొత్త విషయాలు ప్రయ త్నించినప్పుడే నైపు ణ్యాలు, సామ ర్థ్యాలు బయట పడతా యన్నారు. కొత్త విషయాలు ప్రయత్నించడం ద్వారా అనేక పాఠాలు నేర్చుకుంటారని, అదే సమయంలో మంచి అనుభవం కూడా దక్కుతుందని వివరించారు. ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమన్వయం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఆట ఒక పాఠమేనని, గెలుపును ఆనందంగా స్వీకరించాలని, ఓటమినీ ఒక విలువైన పాఠంగా భావించాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు పేర్కొన్నారు. విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ బాల మహోత్సవ్ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి, స్నేహ భావం కూడా పెంపొందాలనేది తమ ఉద్దేశమని తెలిపారు. జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ అన్నారు. మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు జూనియర్స్ విభాగం (అండర్-14 : 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు), సీనియర్స్ విభాగం (అండర్-17 : 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు)లో మొత్తం 50కు పైగా పోటీలు ప్రారంభించారు. రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

అమరేశ్వరుని సన్నిధిలో జస్టిస్ గీతా మిట్టల్


అమరేశ్వరాలయంలో జస్టిస్ గీతా మిట్టల్

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): డిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతామిట్టల్ శనివారం సాయం త్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాల చాముండికా సమేత అమరేశ్వ రస్వామి ఆలయాన్ని సందర్శిం చారు. ఆలయ మర్యాదలతో అర్చ కులు జస్టిస్ గీతా మిట్టల్‌కు స్వాగతం పలికి, ఆమె పేరుమీద స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆడిట్‌లో అవినీతి

(5వ పేజీ తరువాయి)

స్టేషన్‌లో పశువుల దాణా కొన్నట్లు చూపించి నిధులు డ్రా చేశారు. అయితే అక్కడ అసలు పశువుల దాణా ఆనవాళ్లు లేవు. తప్పుడు బిల్లులు సృష్టించి 2023 జూలై 17న రూ.8.41 లక్షలు, అక్టోబరు 11న రూ.6.87 లక్షలు, డిసెంబరు 29న రూ.7 లక్షలు (మొత్తం రూ.22.33లక్షలు) డ్రా చేశారు. గుంటూరు లాం ఫాంలోని రీజనల్ రీసెర్చ్ సెంటర్‌లో విత్తనాల అమ్మా కాల పేరుతో 2023-24లో రూ.85.34 లక్షలు అక్రమాలు జరిగినట్లు ఆడిట్‌లో తేల్చారు. అసలు రైతులతో మీటింగ్ లు పెట్టకుండా, శిక్షణ ఇవ్వకుండానే ఇచ్చినట్లు చూపించి 2024 ఫిబ్రవరి 15న రూ.3 లక్షలు డ్రా చేసినట్లు గుర్తించారు. ఇటువంటి అక్రమాలు కోకొల్లలు జరగ్గా ఆడిట్‌లో బహిర్గతమయ్యాయి.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత


బాధితుడితో సీఐ ప్రభాకర్ రావు, ఎస్ఐలు

నరసరావుపేట లీగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పొరపాటున ఆటోలో మర్చిపోయిన సుమారు రూ. పది లక్షల విలువైన బంగారాన్ని నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు శనివారం బాధితుడికి అప్పగించారు. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన నాగభూషణం బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టుకునేందుకు చీమలమర్రి నుంచి ఆటోలో పట్టణానికి వచ్చాడు. పట్టణంలో ఆటో దిగుతుండగా ఫోన్ రావడంతో బంగారాన్ని ఉంచిన కవరును ఆటోలోనే మర్చిపోయాడు. ఆటో దిగి కొంత దూరం వచ్చి చూసుకునేసరికి చేతిలో కవర్ లేదు. దీంతో వెంటనే రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తక్షణమే స్పందించిన పోలీసులు పట్టణంలోని ఆటోలను జల్లెడపట్టి తుదకు మల్లమ్మ సెంటర్లో బంగారం ఉన్న ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్ ఆటోను ఆపి స్వచ్ఛందంగా బంగారాన్ని పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఆ బంగారాన్ని బాధితుడికి అప్పజెప్పారు.

గాంధీ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి: ఎంపీ అమ్రా రామ్

- కొత్త పథకంతో ఉపాధికి గ్యారెంటీ లేదు
- 3వ రోజు ఏఐకేఎస్ జాతీయ సమావేశాలు


సభలో ప్రసంగిస్తున్న అమ్రా రామ్


అలరించిన నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఉపాధి చట్టాన్ని రద్దు చేసి, గతంలో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని రాజస్థాన్‌కు చెందిన ఎంపీ, ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు అమ్రారామ్ డిమాండ్ చేశారు. గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అఖిల భారత కిసాన్ మహ సభలు (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశంలో 3వ రోజు శనివారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన రైతులు 2025 ఉపాధి హామీ చట్టం - పర్యవసానాలు అంశంపై నిర్వహించిన సదస్సులో అమ్రా రామ్ ప్రసంగించారు. కొన్నేళ్లుగా ఈ పథకానికి బడ్జెట్‌లో 50 శాతం నిధులను కోత పెడుతోందన్నారు. డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ విధానం అమలు చేయడంతో నిరక్షరాసులుకు ఈ పథకం పూర్తి దూరమైందన్నారు. నూతన చట్టంతో కేంద్రం కేవలం 60 శాతమే నిధులు ఇస్తుందని, 40 శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని తెలిపారు. కొత్త పథకం ఉపాధికి గ్యారెంటీ లేదని తెలిపారు. ఇప్పటికీ ఐదు కేజీల రేషన్ బియ్యంతో జీవితం గడుపుతున్న ప్రజలు దేశంలో ఉన్నప్పుడు వికసిత్ భారత్ ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. నూతన చట్టాని రద్దు చేసేందుకు దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. సభలో విత్తన చట్టంపై నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, వ్యవసాయ బీమా రంగంపై ఎస్కేఎం రాష్ట్ర నాయకుడు చుండూరు రంగారావు, డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు- ప్రాధాన్యతపై ఎపి రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు బి.బలరామ్, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ కౌలు రైతు చట్టం ప్రాధాన్యత అనే అంశంపై తదితరులు పాల్గొని ప్రసంగించారు.

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏఐకేఎస్ జాతీయ సమావేశాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జేకేసీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన తీన్‌మార్, జానపద, డప్పు వాయిద్యాలు ప్రేక్షకుల్లో జోష్ నింపింది. కార్యక్రమ ఆరంభంలో ప్రజా నాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి.అప్పన్న గాయకుల బృందం ఆలపించిన రైతు, అభ్యుదయ దేశభక్తి గీతాలు రైతుల్లో విశ్వాసాన్ని నింపాయి. అనంతరం జేకేసీ కళాశాల విద్యార్థిని తాళ్ళూరి ధరణి ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకుల మనస్సులు దోచుకుంది. అనంతరం కత్రపాడు ఉషోదయా కళా పరిషత్ ఆధ్వర్యంలో దర్శకులు చెరుకూరి సాంబశివరావు దర్శకత్వం వహించిన యాది నాటకం ఆకట్టుకుంది.

అంబటి ఇంటి వద్ద పలు కార్లు ధ్వంసం

- ఒక కారుకు నిప్పు


ధ్వంసమైన కార్లు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును దూషించడమే గాక పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటి వద్ద శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబటి వ్యాఖ్యాలను నిరసిస్తూ శనివారం టీడీపీ శ్రేణులు ఆయన ఇంటి వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా అంబటి రోడ్డుపై మీడియాతో మాట్లాడుతూ, సీఎంను, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దాంతో ఆగ్రహంతో వున్న తెలుగుదేశం కార్యకర్తలు వైసీపీ కార్యాలయం వద్ద వున్న ఆ పార్టీ నేతల కార్లను ధ్వంసం చేశారు. ఒక కారుకు నిప్పు పెట్టారు. దాంతో అగ్రిమాపక సిబ్బంది ఆ మంటలను అదుపు చేశారు. రౌడీ షీటర్ హరికృష్ణ, ప్రేమకుమార్, మాజీ రౌడీ షీటర్ నందిపాటి రాజేష్, ఎర్రబాషా, పూనూరు నాగేశ్వరరావుతోపాటు పలువురు తెలుగుదేశం శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యవహరించారు. అదే సమయంలో 150 మంది వరకు వైసీపీ శ్రేణులు అంబటికి మద్దతుగా అక్కడకు చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకుని టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని వైసీపి కార్యకర్తలను వెంటబడి తరిమి వేశారు.

అంబటి కార్యాలయానికీ...

అంబటి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. అంబటి వ్యాఖ్యలతో ఆగ్రహంతో ఉన్న శ్రేణులు నాయకులతో ప్రమేయం లేకుండానే పెద్ద సంఖ్యలో అంబటి ఇంటి వద్దకు చేరుకున్నారు. అంబటిని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లిన తర్వాత కూడా వారిలో ఆగ్రహం చల్లారలేదు. ఆయన కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఆ తర్వాత నిప్పు పెట్టారు. గమనించిన పోలీసులు వెంటనే మంటలను ఆర్పి వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. అంబటిని అరెస్టు చేస్తున్నామని పోలీసులు ప్రకటించినా రాత్రి వరకు తరలించకపోవడంతో కార్యకర్తలు ఆవేశం చెందారు. ఈ క్రమంలో ఆయన కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులకు రాళ్లు తగిలాయి. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, అలాగే అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఓ కానిస్టేబుల్ కాలు విరిగింది. అలాగే ఒకరిద్దరూ పోలీసులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు టీవీ ప్రతినిధులకు దెబ్బలు తగిలాయి. వారిని అడ్డుకునేందుకు ఎక్కించిన మరో ఛానల్ కెమెరామెన్, రిపోర్టర్ పై కూడా దాడి చేశారు. సాక్షి సిబ్బంది కోసం వెతికిన వారు కనిపించకపోవడంతో శాంతించారు.


అంబటి ఇంటి వద్ద ఆందోళన


రాంబాబు నివాసం వద్ద పోలీసు బందోబస్తు


ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

అంబటి బూతు పురాణం

(5వ పేజీ తరువాయి)

నిరసనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. కొందరు పోలీస్‌స్టేషన్ల వరకు ర్యాలీలు నిర్వహించి అంబటిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మరికొందరు ఆయన ఫొటోలను దహనం చేసి నిరసన తెలిపారు. రాంబాబూ నోరు అదుపులో పెట్టుకో లేకపోతే సహించం అంటూ హెచ్చరికలు జారీ చేశారు. సభ్య సమాజం తల దించుకునేలా మహిళలు సైతం అసహ్యించుకునేలా అంబటి మాట్లాడటం నీచ రాజకీయాలకు నిదర్శనమని పలువురు నేతలు విమర్శించారు. చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు తీవ్ర నిరసన తెలిపాయి. స్థానిక నరసరావుపేట సెంటర్‌లో అంబటి దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. అనంతరం చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని అంబటిపై ఫిర్యాదు చేశారు. నకరికల్లు పోలీసుస్టేషన్‌లో టీడీపీ నేత బాజీ చౌదరి, సాగి శ్రీను, జనసేన మండల అధ్యక్షులు బత్తిన శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు మున్వర్ బాజీ స్థానిక టీడీపీ నేతలతో కలసి అంబటిపై ఫిర్యాదు చేశారు. యడ్లపాడు గ్రామానికి చెందిన నాగభైరు శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులతో కలసి అంబటిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు, జోగి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత ఆధ్వర్యంలో రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాచర్లలో అంబటి రాంబాబు ఫ్లెక్సీని కూటమి నేతలు దహనం చేశారు. అనంతరం రాంబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ కూటమి నేతలతో కలిసి కారంపూడి పోలీస్‌స్టేషన్లో అంబటిపై ఫిర్యాదు చేశారు.

- పెదకాకాని మెయిన్ సెంటర్లో అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన ఫొటోలను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెదనందిపాడులో పాత బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. తాడికొండ అడ్డరోడ్డులో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో అంబటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. తెనాలిలో టీడీపీ కార్యాలయం నుంచి మార్కెట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన టీడీపీ శ్రేణులు అంబటి దిష్టిబొమ్మను కర్రలతో కొట్టి దహనం చేశారు. పొన్నూరులో రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత కూరగాయల మార్కెట్ నుంచి ఐలాండ్ సెంటర్ వరకు అంబటి దిష్టిబొమ్మను శవయాత్రగా నిర్వహించారు. అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

సురక్షితంగా వైసీపీ నాయకుల తరలింపు..

పోలీసు బందోబస్తు మధ్య అంబటి కార్యాలయం నుంచి వైసీపీ నాయకులను తరలించడం పోలీసులకు సవాలుగా మారింది. తొలుత అంబటి రాంబాబును ప్రత్యేక పోలీసు వాహనంలో అరెస్ట్ చేసి, నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంబటి అరెసు తర్వాత టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇంటి వద్ద నిరసన కొనసాగించారు. అంబటి ఇంట్లో ఉన్న రౌడీ షీటర్ హరికృష్ణ, ప్రేమ్ కుమార్ తదితరులను బయటకు పంపాలని లేదంటే తాము లోనికి వెళ్లి వారి సంగతి తేలుస్తామంటూ హెచ్చరించారు. దీంతో పోలీసులు మరో వాహనాన్ని పంపి కార్యాలయంలో తలదాచుకున్న గుంటూరు ఈస్ట్ వైసీపీ ఇన్‌చార్జి నూరి ఫాతిమాతో పాటు రౌడీషీటర్ హరికృష్ణ, ప్రేమ కుమార్ మరికొందరిని రక్షణగా పోలీస్ వాహనం ఎక్కించి, అక్కడి నుంచి తరలించారు.

ట్రెండ్

పాత మెరుపులకు సెలవు!



మారుతున్న కాలంతోపాటు మగువల మనసు, వారి అలంకరణాభిరుచులు వేగంగా మారుతున్నాయి. నిన్నటి వరకు సింప్లిసిటీ మంత్రంగా సాగిన జువెలరీ ఫ్యాషన్ ఇప్పుడు స్టేట్‌మెంట్ వైపు మళ్లింది. ఈ ఏడాది ఏ ఆభరణాలు కనుమరుగవుతున్నాయి? ఏ కొత్త డిజైన్లు మన నగల్లో చేరబోతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

ఫ్యాషన్ నుంచి తప్పుకుంటున్నవి

మైక్రో మినిమలిజం: చూడగానే కనిపించనంత సన్నని చైన్లు, చిన్నపాటి రింగుల హవా ఇప్పుడు తగ్గుముఖం పట్టింది. 'తక్కువలో ఎక్కువ అందం' సూత్రం కంటే 'కనిపించేలా ఉండటం' అనే ధోరణి పెరుగుతోంది.



లేయర్డ్ చైన్లు: ఐదు, పది పేటలుగా సన్నని చైన్లు వేసుకునే పద్ధతి పాతబడిపోయింది. దీనివల్ల మెడభాగం గజిబిజిగా కనిపిస్తుండటంతో ఫ్యాషన్ ప్రియులు దీనికి స్వస్తి పలుకుతున్నారు.

ఒకే రకమైన సెట్లు: నెక్లెస్, చెవి రింగులు, గాజులు అన్నీ ఒకే డిజైన్‌లో ఉండటాన్ని ఇప్పుడు బోరింగ్ ఫ్యాషన్‌గా పరిగణిస్తున్నారు. ఇప్పుడు అంతా మిక్స్ అండ్ మ్యాచ్ కాలం.

ఫ్యాషన్ ప్రపంచంలోకి వస్తున్నవి

శిల్పకలా సౌందర్యం: ప్రస్తుతం ఆభరణాలు ఒక శిల్పంలా కనిపిస్తున్నాయి. ఒక పద్ధతి ప్రకారం కాకుండా సహజమైన వంపులు, ఆకృతులతో కూడిన బంగారు ఆభరణాలు ట్రెండింగ్‌లో ఉన్నాయి. చూసేవారికి ఇవి ఒక కళాఖండంలా అనిపిస్తాయి.





పవర్ కఫ్స్ అండ్ బోల్డ్ బ్యాంగిల్స్: చేతికి ధరించే చిన్న గాజుల స్థానంలో మణికట్టును కప్పేసేంత పెద్దవైన 'పవర్ కఫ్స్' వస్తున్నాయి. ఒక్కటి ధరిస్తే చాలు చేతికి మరే ఇతర అలంకారం అవసరం లేదు.

ముత్యాలు: పూర్తిగా గుండ్రంగా ఉండే ముత్యాల కంటే సహజంగా పెరిగేటప్పుడు వచ్చే వింత ఆకృతులతో కూడిన 'బారోక్ పెర్ల్స్' ఇప్పుడు హాట్ కేక్. ఇవి ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకమైన లుక్‌ను ఇస్తాయి.



ఎత్నిక్ విత్ మోడ్రన్ టచ్: మన పురాతన ఆలయ నగలకు ఆధునిక స్పర్శను జోడించి డిజైన్ చేస్తున్నారు. పెద్దపెద్ద హారాలకు బదులుగా ఒకే ఒక భారీ లాకెట్ ఉన్న చైన్లు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి.

పోలీస్ పవరేంటో చిన్నప్పుడే తెలిసింది

ఒకప్పుడు కేవలం పురుషులకు మాత్రమే పరిమితమయిన పోలీస్ ఫోర్స్‌లో ప్రస్తుతం మహిళలు కూడా తమ సత్తా చాటుతున్నారు. అత్యున్నత స్థానాలకు చేరుకొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. అలాంటి వారిలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) తొలి మహిళా చీఫ్ బడుగుల సుమతి ఒకరు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ ప్రకటించిన పురస్కారాల్లో ప్రతిష్ఠాత్మకమైన మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) సాధించిన ఐజీ సుమతి 'నవ్య'తో తన అనుభవాల్ని పంచుకున్నారు.



"మాది జోగులాంబ గద్వాల జిల్లా కలుగోట్ల గ్రామం. కృష్ణ, తుంగభద్ర ఉండే ప్రాంతం కావడంతో అందరూ దానిని నడిగడ్డ అంటారు. తెలంగాణ, రాయలసీమ సంస్కృతులు అక్కడ కనిపిస్తాయి. చిన్నప్పటి నుంచి నాపై మా నానమ్మ ప్రభావం ఎక్కువగా ఉండేది. "అమ్మాయిలు శక్తిమంతంగా ఉండాలి.. పది మందికి పనికొచ్చే పనులు చేయాలి. బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం చేయాలి" అని ఆమె చెబుతూ ఉండేవారు. దాంతో పది మందికి మేలు చేసే ఉద్యోగం చేయాలనే ఆలోచన చిన్నప్పటి నుంచి నాలో నాటుకుపోయింది. చిన్నప్పుడు గ్రామంలో జరిగిన కొన్ని సంఘటనలు చూసినప్పుడు పోలీస్ పవరేమిటో అర్థమైంది. వంద మందిని కంట్రోల్ చేసే పవర్ పోలీస్ దుస్తువులకు ఉందని తెలిసింది. ఎంత పెద్ద గొడవ జరుగుతున్నా... ఒక్క పోలీస్ వస్తే అంతా సద్దుమనిగిపోయేది. అంతేకాదు... చిన్న వయస్సులోనే తాత చనిపోవడంతో నానమ్మ ఇంటికి పెద్ద అయింది. మా ఊర్లో కూడా ఆమె మాటకు ఎవరు ఎదురుచెప్పేవారు కాదు. పోలీసు ఉద్యోగం చేస్తే అందరికీ మేలు చేయవచ్చనే ఆలోచనకు నాలో బీజం వేసింది మా నానమ్మే! 2000 సంవత్సరంలో నా డిగ్రీ పూర్తి అయింది. వెంటనే గ్రూప్-1 సాధించా. వేరే ఆలోచన లేకుండా పోలీసు సర్వీసును ఎంచుకున్నా.



> పోలీస్‌వైపు వెళ్లేందుకు డీఎస్పీ ఎంచుకున్నా. శిక్షణ తర్వాత వివిధ దశల్లో పోస్టింగ్‌లు, విధినిర్వహణలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. మరెన్నో కేసులు పరిష్కరించా. కన్‌ఫార్డ్ ఐపీఎస్‌గా పదోన్నతి పొంది ఐజీ హోదాలో పనిచేస్తున్నా.

మార్పులు ఎన్నో...

నేను విధుల్లో చేరినప్పటితో పోలిస్తే ఇప్పుడు పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు పోలీసింగ్‌లో మగ, ఆడ అనే తేడా లేదు. మహిళా ప్రాతినిధ్యం బాగా పెరిగింది. 25 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్‌లో పోలీస్ శాఖలో శాంతి భద్రతలు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, సీఐడీ, ఎస్ఐబీ ఇలా కీలక విభాగాల్లో పనిచేసా. డీఎస్పీ నుంచి ఐజీ వరకు ప్రతి దశలో సవాళ్లను ఎదుర్కొని లక్ష్యాల్ని చేరుకుంటున్నా. తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐబీ చీఫ్‌గా తొలి మహిళా అధికారిగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. అయితే ఈ బాధ్యతను నిర్వహించడం కూడా సవాలనే చెప్పాలి. 1991 తర్వాత ఎస్ఐబీలో మహిళా అధికారిగా వచ్చింది నేనే! ఇక పోలీసు ఫోర్స్‌లో పని చేస్తున్నప్పుడు నిర్దిష్టమైన పనివేళలు ఉండవు. తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. దానిని వ్యక్తిగత జీవితం దాకా తీసుకువస్తే- అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే నా వ్యక్తిగత జీవితంలోకి ఎటువంటి ఒత్తిడిని చేరనివ్వను. ఒత్తిడి అంతా ఆఫీస్ వరకే. ఒక సారి ఇంటికెళ్తే పూర్తి స్థాయి గృహిణిగా ఉండటమే ఇష్టం. నా భర్త, ఇతర కుటుంబ సభ్యులు కూడా నాకు ఎంతో సహకరిస్తారు. పిల్లలతో కాసేపు సరదాగా మాట్లాడితే ఒత్తిడి మొత్తం పోతుంది. నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. అందరూ సంస్కృతి సంప్రదాయాలు పాటించాలనేది నా ఉద్దేశం. అందుకే మా అమ్మాయిలకు ప్రకృతి, సంస్కృతి అని పెట్టుకున్నా! వారితో ప్రతి పండగను చేసుకుంటా! ఆ పండగల వెనకున్న అర్థాన్ని వాళ్లకు చెబుతూ ఉంటా!

● యస్. సోమేశ్వర్

స్టార్ స్టోరీ

నాన్న కన్నీళ్లే అసలైన అవార్డు



ఆమె కళ్లు మాట్లాడతాయి. ఆమె చిరునవ్వు కోటి భావాలను పలికిస్తుంది. పుష్కర కాలం క్రితం విక్రమ్ 'నాన్న' సినిమాలో చిట్టి పాపగా మనందరి హృదయాలను కొల్లగొట్టిన ఆ చిన్నారి ఇప్పుడు గ్లోబల్ బాక్సాఫీసును షేక్ చేస్తోంది. రణ్‌వీర్‌సింగ్ సరసన 'ధురంధర్'లో యలినాగా మెప్పించి.. ఇప్పుడు తెలుగులో 'యూఫోరియా'తో పలకరించబోతున్న సారా అర్జున్ సినీ ప్రస్థానం ఒక అద్భుత కావ్యం.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ధురంధర్ సృష్టిస్తున్న ప్రభంజనం అంతా ఇంతా కాదు. రూ.1,300 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన ఈ స్పై థ్రిల్లర్‌లో సారా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. "జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక యూఫోరిక్ (అత్యంత ఆనందకరమైన) క్షణం ఒకటి ఉంటుంది. నాకు మాత్రం ధురంధర్ సినిమా చూసి అమ్మానాన్నలు కన్నీరు పెట్టుకున్న రోజే అది. నేను చదువులో టాపర్‌గా వచ్చినప్పుడు కూడా వారు అంతలా ఎమోషనల్ కాలేదు. నావల్ల వారు గర్వంగా ఫీలవడం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ అచీవ్‌మెంట్" అని చెప్పుకొచ్చింది సారా.

వారసత్వం ఉన్నా తప్పని ఆడిషన్

సారా తండ్రి రాజ్ అర్జున్ విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నా, ఆమెకు అవకాశాలు వెతుక్కుంటూ రాలేదు. రణ్‌వీర్‌సింగ్ వంటి స్టార్ సరసన నటించే అవకాశం కోసం ఆరు రౌండ్ల కఠినమైన ఆడిషన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. క్యాస్టింగ్ డైరెక్టర్ ముకేశ్ ఛాబ్రా వద్ద తాను ఏ సినిమాకు ఆడిషన్ ఇస్తుందో కూడా తెలియకుండానే పెర్ఫార్మ్ చేసి ఈ పాత్రను దక్కించుకుంది. స్టార్ కిడ్ అయినప్పటికీ ప్రతిభను నిరూపించుకుంటేనే అవకాశాలు వస్తాయని సారా నమ్ముతుంది.

బహుభాషా నైపుణ్యం

ఇతర భాషల్లో నటించే మహిళా నటులు చాలా మంది తమ పాత్రకు డబ్బింగ్ చెప్పుకోవడానికి ఇబ్బంది పడతారు. కానీ సారా... చిన్నప్పటి నుంచే హిందీ, తమిళం, తెలుగు భాషలపై పట్టు సాధించింది. ముంబైలో పుట్టి పెరిగినప్పటికీ దక్షిణాది సినిమాల్లో నటించేటప్పుడు ఆయా భాషల్లోని యాసను పట్టుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. 'పొన్నియన్ సెల్వన్' షూటింగ్ సమయంలో ప్రాచీన తమిళ పదాలను ఉచ్చరించేందుకు ఆమె చేసిన కృషిని చూసి మణిరత్నం సైతం ఆశ్చర్యపోయారు.

దిగ్గజాల నీడలో శిక్షణ

ఐదేళ్ల వయసులోనే మణిరత్నం, విక్రమ్ వంటి దిగ్గజాలతో పని చేసిన అనుభవం సారాకు ఉంది. "నాకు విక్రమ్ ఇప్పటికీ 'విక్రమ్ అప్పా'నే. మణిరత్నం సెట్‌లో క్రమశిక్షణ, ఐశ్వర్యరాయ్ ఆత్మీయత నన్ను నటిగా తీర్చిదిద్దాయి. పొన్నియన్ సెల్వన్‌లో ఐశ్వర్యరాయ్ (నందిని) చిన్నప్పటి పాత్ర చేయడం నా కెరీర్‌ను మలుపుతిప్పింది. ఆ వయసులోనే ఎటువంటి భయం లేకుండా భావాలను పలికించడం వల్ల ఇప్పుడు కెమెరా ముందు నటిస్తున్నప్పుడు నాకు ఎటువంటి జంకు ఉండదు" అని సారా తన చిన్నప్పటి అనుభవాలను గుర్తుచేసుకుంది.

తెలుగులో మరిన్ని సాహసాలు

సారా దృష్టి ప్రస్తుతం టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ గుణశేఖర్ తెరకెక్కిస్తున్న 'యూఫోరియా'పైనే ఉంది. "పొన్నియన్ సెల్వన్ తర్వాత విదేశాలకు వెళ్లి సినిమా కోర్సు చేయాలనుకున్నాను. కానీ, యూఫోరియా స్క్రిప్ట్ నా ఆలోచనను మార్చేసింది. ఒక నటిగా నాలోని తపనను ఈ కథ గుర్తించింది. ఇది కేవలం గ్లామర్ సినిమా కాదు, ఒక బలమైన కథ" అని సారా చెప్పుకొచ్చింది. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

వివాదాలపై స్పష్టత

ధురంధర్ సినిమాలో తనకంటే పెద్దవాడైన రణ్‌వీర్ సింగ్‌తో రొమాంటిక్ కెమిస్ట్రీపై జరుగుతున్న చర్చలపై సారా చాలా పరిణితితో సమాధానమిచ్చింది. "కథలో పాత్రల మధ్య వయసు అంతరం ఏంటనేది స్పష్టంగా ఉంది. అది ఆ స్టోరీ డిమాండ్. స్క్రిప్ట్ ప్రకారం ఆ బంధం జస్టిఫైడ్ అని నేను భావిస్తున్నాను. నటిగా పాత్ర ప్రాధాన్యతనే నేను చూస్తాను" అని స్పష్టం చేసింది. 'ధురంధర్ 2'లో తన పాత్ర మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, యాక్షన్ సీక్వెన్స్‌లో కూడా కనిపిస్తానని సారా హింట్ ఇచ్చింది.

చదువు.. కెరీర్ బ్యాలెన్స్

చాలామంది చైల్డ్ ఆర్టిస్టులు చదువును మధ్యలోనే ఆపేస్తుంటారు. కానీ సారా విషయంలో అది పూర్తిగా భిన్నం. షూటింగ్ స్పాట్‌లో కూడా ఆమె పుస్తకాలతోనే కనిపిస్తుంది. ఆమెకు ఫిలాసఫీ, వరల్డ్ సినిమాపై మంచి అవగాహన ఉంది. అందుకే ఆమె విదేశాలకు వెళ్లి సినిమా కోర్సు చేయాలని భావించింది. అయితే, గుణశేఖర్ వంటి దర్శకులు ఆమెలోని టాలెంట్‌ను గుర్తించి 'యూఫోరియా' వంటి బలమైన కథలతో ఆమెను ఇక్కడే ఆపగలిగారు.

అవార్డుల పంట


సారా 'నాన్న' సినిమాకే కాదు, 'సైగల్' వంటి చిత్రాలకు కూడా అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకుంది. ఉత్తమ బాలనటిగా విజయ్ అవార్డులు, సైమా అవార్డులు అందుకున్న సారా ఇప్పుడు హీరోయిన్‌గా కూడా అవార్డుల రేసులో నిలవడానికి సిద్ధమవుతోంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
క్యాష్ క్వీన్స్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 04
ది లింకన్ లాయర్ 4	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 05
సాల్వడర్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
అమెజాన్ ప్రైమ్		
నారి నారి నడుమ మురారి	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 04
రిలేషన్‌షిప్ గోల్స్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 04
ఫైండింగ్ హార్మొనీ	ఒరిజినల్ మూవీ	ఫిబ్రవరి 06
ఎల్‌వోఎల్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
జియో హాట్‌స్టార్		
ది ఫిఫ్టీ	రియాలిటీ షో	ఫిబ్రవరి 01
ది రాజాసాబ్	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 06
జీ 5		
షబద్ రీత్ ఔర్ రివాజ్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 06
సోనీ లివ్		
జాజ్ సిటీ	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
ఆహా		
సైక్ సిద్ధార్థ్	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 04





లైఫ్

కునుకు తీద్దాం రండి

నగర జీవనంలో పరుగే పరుగు.. ఉదయం అలారంతో మొదలై రాత్రి మొబైల్ నోటిఫికేషన్ల వరకు నిద్ర అనేది అందని ద్రాక్షలా మారుతోంది. ఈ నేపథ్యంలో కోల్పోయిన ప్రశాంతతను, గాఢ నిద్రను తిరిగి పొందేందుకు ఆధునిక మానవుడు 'స్లీప్ టూరిజం' బాట పడుతున్నాడు.



సెలవులంటే ఒకప్పుడు విహారయాత్రలు, షాపింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్ గుర్తుకు వచ్చేవి. కానీ మారుతున్న కాలంతోపాటు పర్యాటక నిర్వచనం కూడా మారుతోంది. ఇప్పుడు పర్యాటకులు కొత్త ప్రదేశాలు చూడటం కంటే, కంటి నిండా నిద్రపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. 'స్లీప్ వెకేషన్స్' పేరుతో ప్రాచుర్యం పొందుతున్న ఈ సరికొత్త ట్రెండ్ వెల్‌నెస్ ప్రపంచంలో ఒక విప్లవంగా మారుతోంది. పని ఒత్తిడి, నిరంతర డిజిటల్ పరధ్యానం మధ్య చిక్కుకున్న సామాన్యుడి నుంచి సెలబ్రిటీల వరకు అందరూ ఇప్పుడు నిద్రను వెతుక్కుంటూ ప్రశాంత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

విశ్రాంతికి పట్టాభిషేకం

సాధారణ హోటళ్లలో విలాసవంతమైన గదులు, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. కానీ, స్లీప్ టూరిజం రిసార్టులు దీనికి పూర్తిగా భిన్నం. ఇక్కడ ప్రతి అడుగు మీ నిద్రను ప్రేరేపించేలా ఉంటుంది. శబ్దం లోపలికి రాకుండా గదులను పూర్తిగా సౌండ్‌ప్రూఫ్ చేస్తారు. కిటికీలను అమర్చే బ్లాక్ అవుట్ కర్టెన్లు పగటిపూట కూడా గాఢాంధకారాన్ని సృష్టిస్తాయి. పరుపులు, దిండ్లు సైతం శరీర ఉష్ణోగ్రతకు అనుగుణంగా స్పందించే అధునాతన టెక్నాలజీతో రూపొందిస్తారు. గదిలోకి వెళ్లగానే స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. టీవీలు, వైఫైలు లేని ఈ గదుల్లో మౌనం మాత్రమే రాజ్యమేలుతుంది.

నిద్రకు సైన్స్‌తో ముడి

ఇది నిద్రపోవడం మాత్రమే కాదు, ఒక శాస్త్రీయ ప్రక్రియ. ఈ రిసార్టులలో 'స్లీప్ కోచ్'లు ఉంటారు. వారు పర్యాటకుల నిద్ర తీరును అధ్యయనం చేసి వారి మెదడు ఏ సమయంలో ప్రశాంతంగా ఉంటుందో విశ్లేషిస్తారు. అరోమా థెరపీ, మెడిటేషన్, యోగా, నిద్ర వంటి ప్రక్రియల ద్వారా మనసును కుదుటపరుస్తారు. నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ అధికంగా ఉండే ప్రత్యేకమైన ఆహార పదార్థాలను, మూలికా టీలను అందిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే, మొరాయించిన యంత్రాన్ని సర్వీసింగ్ చేసినట్టుగా అలసిపోయిన శరీరాన్ని ఈ వెకేషన్లు రీచార్జ్ చేస్తాయి.

ఎందుకీ ఆరాటం?

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 శాతం మంది నిద్రలేమి (ఇన్సోమ్నియా) సమస్యతో బాధపడుతున్నట్టు పలు సర్వేలు చెబుతున్నాయి. దీనివల్ల రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, మానసిక కుంగుబాటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మనిషి తన ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడంతో మందుల కంటే సహజ నిద్ర మేలని గుర్తిస్తున్నాడు. వేల రూపాయలు ఖర్చు చేసి మరీ ఈ నిద్ర పర్యటనలకు మొగ్గు చూపుతున్నాడు. లండన్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన ఈ సంస్కృతి ఇప్పుడు భారత మెట్రో నగరాల్లోనూ వేగంగా విస్తరిస్తోంది.

ప్రాథమిక హక్కు

నిద్ర అనేది ప్రకృతి మనకిచ్చిన సహజ సిద్ధమైన వరమే కాదు, అది మన ప్రాథమిక హక్కు కూడా. వేగంగా పరిగెడుతున్న ప్రపంచంలో ఒక్క క్షణం ఆగి కళ్లు మూసుకుని మనల్ని మనం రీసెట్ చేసుకోవడం విలాసం కాదు, అత్యవసరం. స్లీప్ వెకేషన్ అనేది ఒక ట్రెండ్ మాత్రమే కాదు, అది మన శరీరానికి మనమిచ్చే అతిపెద్ద గౌరవం. ఆ హాయిని అనుభవించినప్పుడే మనిషి మళ్లీ సరికొత్త ఉత్సాహంతో తన దైనందిన జీవితంలోకి అడుగుపెట్టగలడు.

పండ్లు తినాలా? జ్యూస్ తాగాలా?

మధుమేహం ఉంటే పండ్లకు దూరంగా ఉండాలని అనుకుంటారు. కానీ పండ్లు మానేయడం కంటే వాటిని ఎలా తీసుకుంటున్నామన్నదే ముఖ్యం. నేరుగా తినాలా? రసం చేసుకుని తాగాలా? నిపుణులు చెబుతున్నది ఇదే..



పీచు పదార్థం: పండును నేరుగా తిన్నప్పుడు అందులోని పీచు పదార్థం రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నిరోధిస్తుంది. జ్యూస్‌లో పీచు ఉండదు, కాబట్టి చక్కెర స్థాయిలు త్వరగా పెరుగుతాయి.

ఆకలి నియంత్రణ: పండును నమిలి తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. జ్యూస్ తాగితే త్వరగా ఆకలి వేస్తుంది.

పోషకాలు: పండును నమలడంవల్ల లభించే పూర్తి స్థాయి ఎంజైములు, విటమిన్లు జ్యూస్‌లో అందవు.

చక్కెరను నియంత్రించే పండ్లు

దానిమ్మ: యాంటీఆక్సిడెంట్లు పుష్కలం

ద్రాక్ష: ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది.

ఆపిల్: తొక్కతో తింటే డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది.

స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ: ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి.

జామ: పీచుపదార్థం ఎక్కువగా ఉండి జీర్ణక్రియకు మేలు చేస్తుంది.

పుచ్చకాయ: కిడ్నీల ఆరోగ్యానికి, నరాల సమస్యలకు మంచిది.

చెర్రీ: ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి.

బొప్పాయి: కణాల నష్టాన్ని నివారిస్తుంది.

నారింజ: చక్కెర గ్రహించే వేగాన్ని తగ్గిస్తుంది.

బిజినెస్ ప్లస్

వికసిత బడ్జెటేనా!

అంతర్జాతీయంగా ఎన్ని సవాళ్లు ఎదురవుతున్నా భారత్ మాత్రం వృద్ధి జోరును కొనసాగిస్తోంది. అమెరికా సుంకాల ప్రభావం పడుతున్నప్పటికీ ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందుకు తగ్గట్టుగానే ఆదివారం నాడు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ఉంటుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. వికసిత భారత్ లక్ష్యాల సాధన దిశగానే చర్యలు ఉండొచ్చని వారు భావిస్తున్నారు. ప్రధానంగా తయారీ, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణకు బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసే అవకాశం కనిపిస్తోంది.



పీఎస్‌బీల విలీనాలకు శ్రీకారం?

వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సమగ్ర పరివర్తనం కోసం రోడ్‌మ్యాప్‌ను బడ్జెట్లో ప్రకటించే అవకాశముంది. బ్యాంకింగ్ రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలు, ఆధునిక సాంకేతికత వినియోగంతో పాటు పీఎస్‌బీలను ప్రపంచ స్థాయి బ్యాంకులుగా తీర్చిదిద్దడంపై ఈ రోడ్‌మ్యాప్ దృష్టి సారించనుంది. 2047 నాటికి కనీసం రెండు పీఎస్‌బీలు ప్రపంచ టాప్-20 బ్యాంకుల జాబితాలో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం బడ్జెట్లో మలివిడత పీఎస్‌బీల విలీనాలను ప్రకటించవచ్చు. చిన్న సైజు పీఎస్‌బీలను ప్రస్తుత టాప్-5 బ్యాంకుల్లో కలిపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ వ్యూహంలో భాగంగానే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ)ను విలీనం చేసే దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ మెర్జర్ ఏడాది చివరికల్లా పూర్తి కావచ్చని అంచనా.

ఈక్విటీ, బ్యాంక్ డిపాజిట్లపై ఏకరీతి పన్ను..

బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీ పెట్టుబడులపై లభించే రాబడులపై పన్ను విధానంలో సమానత్వం అవసరమని ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. ప్రపంచంలో మరెక్కడా ఈ రెండు రకాల రాబడులపై విధించే పన్నులో వ్యత్యాసం లేదని అన్నారు.

జీడీపీ వృద్ధి రేటు

ప్రస్తుతం మన జీడీపీ వృద్ధి రేటు మంచి జోరు మీద ఉంది. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. మార్చితో ముగిసే 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా మన జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పైనే ఉంటుందని అంచనా. ప్రస్తుత అనిశ్చిత ఆర్థిక ప్రపంచంలో మరే పెద్ద దేశమూ ఈ స్థాయిలో జీడీపీ వృద్ధి రేటు నమోదు చేయడం లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇదే జోరును కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అంచనా.

ద్రవ్యోల్బణం

గత సంవత్సరాలతో పోలిస్తే ప్రస్తుతం మన దేశంలో ధరల సెగ తక్కువగానే ఉంది. అయితే తాజాగా పెరుగుతున్న ఆహార ధరల సెగ మాత్రం అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను ఒకింత భయపెడుతోంది. దీంతో ద్రవ్యోల్బణ కట్టడికి ప్రభుత్వం ఏం చేస్తుందనే దానిపై ఒకింత ఆసక్తి నెలకొని ఉంది.

ద్రవ్య లోటు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీలో 4.6 శాతంగా ఉన్న ద్రవ్య లోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 4.4 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరో రెండు నెలల పాటు అదనపు ఖర్చులేమీ లేకపోతే ఇది ఆచరణ సాధ్యమే. దీంతో ఫిబ్రవరి 1న ప్రకటించే 2026-27 బడ్జెట్‌లో ద్రవ్య లోటును 4.2 శాతం వద్ద కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటారని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

మూలధన వ్యయాలు

ఈసారి బడ్జెట్‌లోనూ మూలధన వ్యయ కేటాయింపులు కీలకం కానున్నాయి. మోదీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా మౌలికాభివృద్ధి కోసం మూలధన కేటాయింపులను భారీగా పెంచుకుంటూ వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో మూలధన వ్యయాల కోసం రూ.11.2 లక్షల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఈసారి బడ్జెట్లో మరో 10-15 శాతం మేర పెంచి రూ.12 లక్షల కోట్లు దాటించవచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా రైల్వేలు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ సరఫరా, రక్షణ, పట్టణ రవాణా రంగాలకు ఈసారి ప్రాధాన్యం లభించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

తయారీ- ఉద్యోగాల కల్పన- ఎంఎస్‌ఎంఈలు

దేశంలో తయారీకి ఊతమిచ్చేందుకు ఈ సారి బడ్జెట్లో మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించే అవకాశముంది. అలాగే, ఉద్యోగాల కల్పనకు దోహదపడేలా నైపుణ్య శిక్షణ, అప్రెంటిషిప్ పథకాలను ప్రకటించవచ్చని అంచనా. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు మరిన్ని కేటాయింపులతో పాటు క్రెడిట్ గ్యారెంటీ మద్దతును కూడా పెంచే అవకాశాలున్నాయి. అంతేకాదు, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాలను మరింత ఆకర్షణీయంగా మార్చే ప్రయత్నం చేయవచ్చు.

ఇంధన పరివర్తనం, భద్రతపై దృష్టి

సోలార్, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో ఈ రంగానికి మద్దతుగా మరిన్ని చర్యలు చేపట్టవచ్చు. పునరుత్పాదక ఇంధనంతో పాటు గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, ఎలక్ట్రిక్ వాహనాలకు మరిన్ని తాయిలాలు లభించవచ్చు. అంతేకాదు, శుద్ధ ఇంధన ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, పరికరాల దేశీయ తయారీని ప్రోత్సహించే అవకాశముంది. అలాగే, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన భద్రతపైనా ప్రభుత్వం దృష్టిసారించవచ్చు. ఇందుకోసం దేశీయంగా ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి, వ్యూహాత్మక నిల్వల సామర్థ్యం పెంపు కోసం బడ్జెట్లో కేటాయింపులు జరిపేందుకు అవకాశాలున్నాయి.

పన్నులు

2025-26 బడ్జెట్లోనే వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.12 లక్షలకు పైగా పెంచిన కేంద్ర ప్రభుత్వం ఈసారి పెద్దగా మార్పులు జరపకపోవచ్చు. ఒకవేళ ఏమైనా మార్పులు చేసినా, మధ్యతరగతికి మరింత ఊరటనివ్వడంతో పాటు వస్తు వినియోగం పెంచే దిశగా చర్యలుండే అవకాశం ఉంది. కార్పొరేట్ పన్నుల్లోనూ మార్పులు ఉండకపోవచ్చు. ఎగుమతులు, తయారీ రంగాలకు మరింత మద్దతు, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో స్థిరత్వాన్ని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి. అలాగే ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల అమ్మకాలపై వచ్చే మూలధన లాభాల పన్నుల్లో ప్రతికూల మార్పులు కూడా ఉండకూడదని మదుపరులు కోరుకుంటున్నారు.


ఎఫ్ఎంసీజీ రంగం

ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో వినియోగం గాడిన పడింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వినియోగం ఇంకా కొవిడ్ ముందు స్థాయికి రాలేదు. ఈ ప్రాంతాల ప్రజల ఆదాయం, వినియోగం పెంచేందుకు ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్లో ఏమైనా ప్రత్యేక చర్యలు ప్రకటిస్తారా? అని ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

సీనియర్ సిటిజన్లు

రిటైర్డ్ జీవితం మలి సంధ్యలో ఉన్న అనేక మంది పండుటాకులకు వడ్డీ ఆదాయమే ప్రధాన ఆదాయ వనరు. వీరికి వచ్చే వడ్డీ ఆదాయం రూ.50,000 దాటితే సెక్షన్ 80 టీటీబీ కింద పన్ను పోటు తప్పదు. ఏటికేటికి ధరలు పెరిగిపోతున్న ప్రస్తుత నేపథ్యంలో ఈ మినహాయింపు ఏ మాత్రం చాలదు. ఆర్థిక మంత్రి కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఈ వడ్డీ ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని కనీసం రూ.లక్ష వరకు పెంచాలని సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు. అలాగే ఈ వడ్డీ ఆదాయంపై విధిస్తున్న టీడీఎస్‌ను కూడా రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రెండు డిమాండ్లతో పాటు సీనియర్ సిటిజన్లు ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియానికి సెక్షన్ 80డీ కింద ప్రస్తుతం ఉన్న ప్రస్తుతం ఉన్న రూ.50,000 మినహాయింపును రెట్టింపు చేయాలని కోరుతున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	143
వరంగల్	130	గుంటూరు	143
కరీంనగర్	130	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	126
కర్నూలు	130	నెల్లూరు	131
విశాఖపట్నం	135	అనంతపురం	131
గోదావరి	143		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,60,580 ▼	1,47,200 ▼	3,50,000 ▼
విజయవాడ	1,63,000 ▼	1,52,000 ▼	3,20,000 ▼
విశాఖపట్నం	1,69,200 ▲	1,47,200 ▼	3,20,000 ▼
రాజమండ్రి	1,60,580 ▼	1,47,200 ▼	3,24,000 ▼
ప్రొద్దుటూరు	1,62,800 ▼	1,49,780 ▼	3,00,000 ▼
ముంబై	1,65,795 ▲	1,51,868 ▲	3,39,350 ▲

పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్ను విధానం

ఇదీ GST

ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తులకు సంబంధించి ప్రభుత్వం ఒక కొత్త పన్ను విధానం తీసుకువచ్చింది. గరిష్ఠ చిల్లర ధర ఆధారంగా పన్ను లెక్కించే ఈ కొత్త విధానం.. ఇప్పటి వరకు ఉన్న విధానానికి పూర్తి భిన్నం. ఆ వివరాలు మీ కోసం..

ఇప్పటి వరకు పొగాకు ఉత్పత్తులపై సిగరెట్, జర్దా, పాన్‌మసాలా, గుట్కా, ఖైనీ ఇలాంటి వాటి మీద జీఎస్‌టీ 28 శాతంతో పాటు సెస్ ఉండేది. పన్ను లెక్కింపు మాత్రం ఇన్వాయిస్ ఆధారంగానే లెక్కించే వారు. అంటే ఇన్వాయిస్‌లో ఎంత విలువ ఉందో దాని మీదే సంబంధిత పన్ను కట్టాల్సి ఉండేది. ఇప్పుడు కొత్త విధానం ప్రకారం పన్ను అనేది ఇన్వాయిస్‌లో చూపిన విలువ ఆధారంగా కాకుండా ప్యాకెట్ మీద ముద్రించిన ధర మీద లెక్కిస్తారు. దీనిని ఇంతకు ముందు ఎంఆర్‌పీ (మాగ్జిమమ్ రిటైల్ ప్రైస్)గా వ్యవహరించగా ఇప్పుడు ఆర్ఎస్‌పీ (రిటైల్ సేల్ ప్రైస్)గా వ్యవహరించనున్నారు. ఇప్పటి వరకు జీఎస్‌టీలో ఉత్పత్తితో సంబంధం లేకుండా ట్రాన్సాక్షన్ వాల్యూ అంటే ఇన్వాయిస్‌లో చూపిన విలువ మీదే పన్ను లెక్కిస్తుండగా ఇప్పుడు పైన తెలిపిన పొగాకు ఉత్పత్తులకు మాత్రం కొత్త విధానంలో పన్ను లెక్కిస్తారు. మరి దీన్ని ఎలా లెక్కించాలి?



రాంబాబు గొండాల

ఆర్ఎస్‌పీ అంటే అన్ని పన్నులు అందులో కలిసి ఉన్నాయని భావం. ఒక వస్తువు మీద ఉండే ఆర్ఎస్‌పీలో జీఎస్‌టీ కూడా కలిసి ఉంటుంది. కాబట్టి ఇది తీసివేయగా వచ్చిన నికర విలువను ఆధారంగా చేసుకుని పన్ను లెక్కించాలి. ఈ కొత్త మార్పు ప్రకారం పన్ను లెక్కించే విధానంతో పాటుగా పన్ను రేటులో కూడా మార్పు వచ్చింది. ఇప్పటి వరకు పన్ను 28 శాతంతో పాటు సెస్ ఉండేది. ఈ సెస్ అనేది ఉత్పత్తిని బట్టి మారుతుండేది. కాగా, ఇప్పుడు కొత్త విధానంలో సెస్‌ను పూర్తిగా తొలగించారు. అయితే పన్నును మాత్రం 28 శాతం నుంచి 40 శాతానికి పెంచారు. కాబట్టి ఒక వస్తువు మీద ముద్రించిన ధర రూ.100 అనుకుంటే అందులో 40 శాతం జీఎస్‌టీ కలిపి ఉన్నట్లు భావించాలి. దీన్ని వెనుక నుంచి లెక్కిస్తే రూ.71.43 ఆ వస్తువు విలువ కాగా దాని మీద పన్ను 40 శాతం లెక్కిస్తే రూ.28.57 అవుతుంది. ఈ రెండు కలిపితే రూ.100 అవుతుంది. మరి ఆర్ఎస్‌పీ కంటే తక్కువ ధరకే అంటే రూ.70 లేదా రూ.80కి అమ్మితే.. అప్పుడు కూడా పన్ను మాత్రం రూ.28.57 చెల్లించాలి.

ఇప్పటి వరకు ఉన్న విధానంలో రూ.100 ఆర్ఎస్‌పీ ఉన్న వస్తువును ఉత్పత్తిదారుడు రూ.50కి, హోల్‌సేల్ వ్యక్తి రూ.60కి, రిటైల్ వ్యక్తి రూ.70కి అమ్ముతుంటే పన్ను మాత్రం రూ.50, రూ.60, రూ.70 మీద చెల్లించాల్సి వచ్చేది. కొత్త విధానం ప్రకారం పన్ను అసలు విలువతో సంబంధం లేకుండా చేతులు మారిన ప్రతిసారి రూ.28.57 చెల్లించాలి. కాకపోతే తాను కొనుగోలు చేసిన సమయంలో చెల్లించిన రూ.28.57 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు.

ఈ విధానంలో డీలర్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎందుకంటే వారి దగ్గర ఉన్న స్టాక్ పాత పద్ధతిలో కొనుగోలు చేసి ఉండవచ్చు. కానీ, ఫిబ్రవరి 1 నుంచి అమ్మే స్టాక్‌కు మాత్రం కొత్త పన్ను విధానమే అమలవుతుంది. అయితే, ఇప్పటి వరకు మిగిలి ఉన్న ఐటీసీని కొత్త పన్నుకు కూడా వాడుకోవచ్చు. కానీ సెస్‌ను మాత్రం వాడకూడదు.

ఇకపోతే, పైన చెప్పిన దానికి అదనంగా ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తుల మీద ఎక్సైజ్ డ్యూటీతో పాటు హెల్త్ సెస్ అమలు కానుంది. కాకుంటే ఇది ఉత్పత్తిదారులకు మాత్రమే పరిమితం. ఇంకొక ముఖ్య విషయం 'బీడీ' లకు ఈ కొత్త పన్ను విధానం అమలు కాదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్



రిబ 'క్వీన్'

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత ఎలెనా రిబకినా

ఫైనల్లో సబలెంకకు షాక్

మెల్‌బోర్న్: మూడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ అందుకోవాలన్న టాప్‌సీడ్ అర్యానా సబలెంక కలలు కల్లలయ్యాయి. కజకిస్థాన్‌కు చెందిన ఐదోసీడ్ ఎలెనా రిబకినా వరల్డ్ నెం.1 సబలెంకకు షాకిచ్చి మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో 26 ఏళ్ల రిబకినా 6-4, 4-6, 6-4తో బెలారస్ భామ సబలెంకను ఓడించింది. తద్వారా తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడింది. కెరీర్‌లో రిబకినాకిది రెండో గ్రాండ్‌స్లామ్. 2022లో ఎలెనా వింబుల్డన్ కిరీటాన్ని దక్కించుకుంది. కీలకమైన మూడో సెట్‌లో రిబకినా 0-3తో వెనుకంజలో నిలవడంతో.. సబలెంక విజయం ఖాయమనిపించింది. కానీ ఆత్మవిశ్వాసం కోల్పోని ఎలెనా అద్భుతంగా పుంజుకుంది. వరుసగా ఐదు గేమ్‌లు గెలిచి జయకేతనం ఎగుర వేసింది. రెండు గంటలకు పైగా సాగిన మ్యాచ్‌లో.. విన్నర్లు సంధించడంలో రిబకినా (28)పై సబలెంక (35) ఆధిపత్యం ప్రదర్శించింది. ఏస్‌లలో రిబకినా (6), సంబెలెంక (5) దాదాపు సమంగా నిలిచారు. ఈ గెలుపుతో 2023 మెల్‌బోర్న్ పార్క్ తుదిపోరులో సబలెంక చేతిలో పరాజయానికి రిబకినా బదులు తీర్చుకుంది. మరోవైపు సబలెంక ఇక్కడ ఫైనల్లో ఓడడం వరుసగా ఇది రెండోసారి. గత ఏడాది టైటిల్ ఫైట్‌లో మాడిసన్ కీస్ (అమెరికా) చేతిలో ఆమె ఓడిపోయింది.

> విజయం సాధించగానే గుండె వేగం ఒక్కసారిగా పెరిగిపోయింది. ముఖాన ఆ భావాలు కనిపించలేదు కానీ హృదయంలో ఎన్నో భావోద్వేగాలు చెలరేగాయి. - ఎలెనా రిబకినా

చాంపియన్‌కు రూ. 25.58 కోట్లు
రన్నరప్‌నకు రూ.13.30 కోట్లు



పెద్దోడా.. చిన్నోడా?

జొకోవిచ్ X అల్కారజ్ పురుషుల ఫైనల్ నేడు
మ. 2 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన ఆటగాడిగా సరికొత్త చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. ఆదివారం జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో టాప్‌సీడ్ కార్లోస్ అల్కారజ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్‌లు ఖాతాలో వేసుకున్న నొవాక్.. ఆల్‌టైమ్ గ్రేట్ మార్గరెట్ కోర్ట్‌తో సమంగా ఉన్నాడు. మరో టైటిల్ నెగ్గితే.. 25 గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకొన్న ఏకైక ఆటగాడిగా ప్రపంచ రికార్డు అందుకుంటాడు. అంతేకాదు.. ఈ ట్రోఫీతో ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా 38 ఏళ్ల జొకోవిచ్ నయా చరిత్ర సృష్టిస్తాడు. ఇక.. ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ నెగ్గిన 22 ఏళ్ల అల్కారజ్.. ఇక్కడ గెలిస్తే కెరీర్ స్లామ్ (కెరీర్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గడం) సాధించిన పిన్న వయసు ఆటగాడిగా ఘనత వహిస్తాడు. మరి.. చరిత్రకెక్కేది పెద్దోడా..? చిన్నోడా..? చూడాలి.

'ఆసియా చాంపియన్‌షిప్' నుంచి సింధు అవుట్

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ నుంచి ఏస్ షట్లర్ పీవీ సింధు తప్పుకొంది. దీంతో ఈ ఈవెంట్‌లో భారత పతక ఆశలకు గట్టిదెబ్బ తగిలే అవకాశముంది. సింధు నొప్పితో ఇబ్బందిపడుతున్నట్టు సమాచారం. వచ్చే వారం నుంచి జరిగే టోర్నీలో గ్రూప్-వైలో థాయ్‌లాండ్, మయన్మార్‌తో భారత్ ఆడనుంది. సింధు గైర్హాజరీలో సింగిల్స్ భారం తన్వీ శర్మ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ, మాళవిక భన్సోడ్‌పై పడనుంది. డబుల్స్‌కు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ నేతృత్వం వహించనుంది.

భారత్ X పాకిస్థాన్

అండర్-19 వరల్డ్‌కప్‌లో సూపర్ సిక్స్ పోరు నేడు

మ.1 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

జ్ఞానేశ్వర్ 'డబుల్'



- ఆంధ్ర 536/9 డిక్లేర్
- నాగాలాండ్‌తో రంజీ

దిమాపూర్ (నాగాలాండ్): సీఆర్ జ్ఞానేశ్వర్ అజేయ ద్విశతకం (268 బంతుల్లో 227)తో విజృంభించడంతో.. నాగాలాండ్‌తో రంజీ పోరులో ఆంధ్ర జట్టు పట్టు బిగించింది. మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 267/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర.. 130 ఓవర్లలో 536/9 వద్ద డిక్లేర్ చేసింది. కేవీ శశికాంత్ (60), త్రిపురణ విజయ్ (58) అర్ధ శతకాలతో రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన నాగాలాండ్ మూడో రోజు ఆట ముగిసేసరికి 33 ఓవర్లలో 4 వికెట్లకు 85 పరుగులు చేసింది. ఇంకా ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు నాగాలాండ్ 85 పరుగుల వెనుకంజలో ఉంది. నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 366 రన్స్‌కు ఆలౌటవడం తెలిసిందే.

ఆసీస్‌పై మళ్లీ పాక్‌దే గెలుపు

లాహోర్: పాకిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా కోల్పోయింది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఆసీస్ 90 పరుగులతో ఓడింది. తొలుత పాకిస్థాన్ 20 ఓవర్లలో 198/5 స్కోరు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘ (76), ఉస్మాన్ (53) హాఫ్ సెంచరీలు సాధించారు. ఛేదనలో ఆస్ట్రేలియా 15.4 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. గ్రీన్ (35), షార్ట్ (27) రాణించారు. సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే పాక్ దక్కించుకుంది.

3న జట్టులో చేరనున్న తిలక్

ముంబై: హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) అతడికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. దాంతో తిలక్ ఈనెల 3న ముంబైలో భారత జట్టుతో చేరనున్నాడు. 'పూర్తి స్థాయి మ్యాచ్ ఆడే ఫిట్‌నెస్‌ను తిలక్ వర్మ సంతరించుకున్నాడు' అని బీసీసీఐ వర్గాలు శనివారం వెల్లడించాయి.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ఢిల్లీ X యూపీ (రా. 7.30)

ఇషాన్ తుఫాన్





ఇషాన్ కిషన్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 103)

42 బంతుల్లో శతకం

చెలరేగిన సూర్య, హార్దిక్

అర్ష్‌దీప్ పాంచ్ పటాకా

4-1తో సిరీస్ కైవసం

ఆఖరి టీ20లో కివీస్‌పై భారత్ విజయం

తిరువనంతపురం: టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు టీమిండియా అదిరే ప్రదర్శనతో ఆకట్టుకుంది. మెగా టోర్నీలో ప్రత్యర్థులారా.. ఇక కాచుకోండి అన్నట్టుగా జట్టులోని పవర్ హిట్టర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఇషాన్ కిషన్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 103) తన టీ20 కెరీర్‌లో తొలి శతకంతో జట్టులో స్థానాన్ని ఖాయం చేసుకోగా.. అటు కెప్టెన్ సూర్యకుమార్ (30 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 63) ఫామ్‌ను కొనసాగించాడు. దీంతో శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో టీ20లో భారత్ 46 పరుగుల తేడాతో నెగ్గింది. 4-1తో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 271 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 42), అభిషేక్ శర్మ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) చెలరేగారు. ఫెర్గూసన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫిన్ ఆలెన్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 80), రచిన్ రవీంద్ర (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30), ఇష్ సోధీ (15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 33) మాత్రమే రాణించారు. అర్ష్‌దీప్‌నకు 5, అక్షర్‌కు 3 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఇషాన్.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా సూర్యకుమార్ నిలిచారు.



ఆలెన్ పోరాడినా..: 272 పరుగుల ఛేదనను ఓపెనర్ ఆలెన్ ధాటిగా ఆరంభించాడు. అతడు క్రీజులో ఉన్నంత సేపు కివీస్ పోటీలోనే ఉంది. తొలి ఓవర్‌లో 3 ఫోర్లు.. మూడో ఓవర్‌లో 23 రన్స్ అందించిన ఆలెన్ ధాటికి పవర్‌ప్లేలో కివీస్ 79/1 స్కోరుతో నిలిచింది. ఈ క్రమంలో 22 బంతుల్లోనే ఆలెన్ అర్ధసెంచరీ కూడా పూర్తయింది. తొమ్మిదో ఓవర్‌లో ఆలెన్‌ను అక్షర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు రచిన్‌తో కలిసి అందించిన 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రచిన్ కూడా వేగంగా ఆడడంతో కివీస్ పదో ఓవర్‌లో 131/2 స్కోరుతో భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. కానీ ఆ తర్వాత అక్షర్, అర్ష్‌దీప్‌ల ధాటికి వేగంగా వికెట్లను కోల్పోవడం జట్టును దెబ్బతీసింది. చివర్లో సోధీ జోరుగా ఆడి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.

ఎదురుదాడే లక్ష్యంగా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆకాశమే హద్దుగా సాగింది. సొంత మైదానంలోనూ ఓపెనర్ సంజూ శాంసన్ (6) పేలవ ఫామ్ కొనసాగినా.. మరో ఎండ్‌లో అభిషేక్, ఇషాన్, సూర్యకుమార్, హార్దిక్ ధనాధన్ ఆటతో బౌలర్లను ఆడేసుకున్నారు. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు వెనుదిరగడంతో ఇషాన్-సూర్య జోడీ కాస్త నెమ్మదించింది. కానీ డ్రింక్స్ విరామం తర్వాత ఇషాన్ ధాటికి ఆట స్వరూపమే మారిపోయింది. ఫెర్గూసన్ ఓవర్‌లో 4,6తో బ్యాట్‌కు పనిచెప్పిన అతను 12వ ఓవర్‌లో 4,4,4,6,4,6తో 29 రన్స్ రాబట్టాడు. అటు 14వ ఓవర్‌లో సూర్య 4,6,6,6తో 23 రన్స్ అందించడంతో పాటు 26 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే సూర్య వికెట్‌ను శాంట్నర్ తీయడంతో మూడో వికెట్‌కు అత్యధికంగా 137 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అయినా ఇషాన్ జోరు తగ్గలేదు. 2 వరుస సిక్సర్లతో 42 బంతుల్లోనే తొలి సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే డఫీకి ఇషాన్ చిక్కగా.. డెత్‌ఓవర్లలో హార్దిక్ భారీ షాట్లతో విజృంభించాడు. ఆఖరి ఓవర్‌లో సిక్సర్ బాది హార్దిక్ వెనుదిరగగా, శివమ్ దూబే (7 నాటౌట్) మరో సిక్సర్‌తో భారత్‌కు 21 రన్స్ సమకూరాయి. అటు చివరి 10 ఓవర్లలో జట్టు 169 రన్స్ సాధించడం విశేషం.

1 అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (1,822) మూడు వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా సూర్యకుమార్.

- ద్వైపాక్షిక సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (69) బాదిన జట్టుగా భారత్.
- న్యూజిలాండ్‌పై టీ20ల్లో అత్యధిక స్కోరు (271) చేసిన జట్టుగా భారత్.
- అంతర్జాతీయ టీ20ల్లో ఎక్కువ పరుగులిచ్చి (51) ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా అర్ష్‌దీప్.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (బి) ఫెర్గూసన్ 30, శాంసన్ (సి) జాకబ్స్ (బి) ఫెర్గూసన్ 6, ఇషాన్ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 103, సూర్యకుమార్ (స్టంప్) సీఫర్ట్ (బి) శాంట్నర్ 63, హార్దిక్ (సి) జాకబ్స్ (బి) డఫీ 42, రింకూ (నాటౌట్) 8, దూబే (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 271/5. వికెట్ల పతనం:** 1-31, 2-48, 3-185, 4-233, 5-261. **బౌలింగ్:** డఫీ 4-0-53-1, జేమిసన్ 4-0-59-1, ఫెర్గూసన్ 4-0-41-2, సోధీ 3-0-48-0, ఫిలిప్స్ 1-0-10-0, శాంట్నర్ 4-0-60-1.

న్యూజిలాండ్: సీఫర్ట్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 5, ఆలెన్ (సి) రింకూ (బి) అక్షర్ 80, రచిన్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 30, ఫిలిప్స్ (సి) రింకూ (బి) అక్షర్ 7, మిచెల్ (బి) అర్ష్‌దీప్ 26, శాంట్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 0, జాకబ్స్ (బి) వరుణ్ 7, జేమిసన్ (బి) అర్ష్‌దీప్ 9, సోధీ (సి) అర్ష్‌దీప్ (బి) రింకూ 33, ఫెర్గూసన్ (బి) అక్షర్ 3, డఫీ (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.4 ఓవర్లలో 225 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-17, 2-117, 3-131, 4-137, 5-137, 6-166, 7-179, 8-180, 9-191, 10-225. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-51-5, హార్దిక్ 2-0-15-0, బుమ్రా 4-0-58-0, వరుణ్ 4-0-36-1, అక్షర్ 4-0-33-3, అభిషేక్ 1-0-13-0, రింకూ 0.4-0-7-1.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



94 ఏళ్ల వయసులో దర్శకత్వం

వినూత్న ప్రయోగాలకు చిరునామాగా నిలిచిన లెజండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు చాలా రోజుల తర్వాత మళ్లీ మెగాఫోన్ చేపడుతున్నారు. 2013లో ఆయన 'వెల్‌కమ్ ఒబామా' చిత్రానికి దర్శకత్వం వహించారు. మళ్లీ ఇన్నేళ్లకు 94 ఏళ్ల వయసు కలిగిన ఆయన సరికొత్త ఉత్సాహంతో తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌ను రూపొందించనున్నారు. ప్రభాస్ హీరోగా వైజయంతి మూవీస్ సంస్థ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో నిర్మించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సృజనాత్మక సహకారం అందించిన సింగీతం ఇప్పుడు అదే సంస్థ నిర్మించే సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం శనివారం పూజా కార్యక్రమంతో మొదలైంది. దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మిస్తున్నారు. ఇలా అనుభవం, ఆధునిక భావాల కలయికలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు. భారతీయ సినిమా చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచే ఈ చిత్రం టైటిల్, ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

నోరి దత్తాత్రేయుడుని సన్మానించిన చిరంజీవి



ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడుని చిరంజీవి ఘనంగా సన్మానించారు. కేన్సర్ వైద్యంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే 'పద్మభూషణ్' పురస్కారంతో గౌరవించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చిరంజీవి శనివారం డాక్టర్ దత్తాత్రేయుడిని కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పూలగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలియజేశారు. ఆ ఫోటోలను చిరంజీవి సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. వైద్యరంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన దత్తాత్రేయుడు పద్మ పురస్కారం అందుకోవడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. 'దత్తాత్రేయుడు కేన్సర్ చికిత్స రంగంలో అసాధారణ కృషి చేశారు, ముఖ్యంగా అధునాతన కేన్సర్ వైద్యంలో ఆయన కృషి ఎనలేనిది' అని చిరంజీవి కొనియాడారు. ఈ సందర్భంగా సమాజ సేవ, సామాజిక బాధ్యత వంటి అంశాలపై చిరంజీవి, దత్తాత్రేయుడు చర్చించారు.

గద్దర్ అవార్డుల దరఖాస్తు గడువు పెంపు



సినీ పరిశ్రమలోని ప్రతిభావంతులకు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న గద్దర్ అవార్డుల దరఖాస్తు గడువు తేదీ మరికొన్ని రోజులు పాటు పెరిగింది. 2025 పురస్కారాలకు సంబంధించి దరఖాస్తులు పొందేందుకు.. జనవరి 31 తేదీ వరకూ, పూర్తి చేసిన దరఖాస్తులను అందజేసేందుకు ఫిబ్రవరి 3 వరకూ గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవలే వచ్చిన బ్యాంకు సెలవుల కారణంగా ఈ గడువును తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మరింత పొడిగించింది. ఈ నెల 5 మధ్యాహ్నం వరకూ దరఖాస్తులను ఇవ్వనున్నట్లు పేర్కొంది. అదే రోజు సాయంత్రం వరకూ పూర్తి చేసిన దరఖాస్తులను అందజేసేందుకు అవకాశాన్ని కల్పించింది.

చాలా ఆనందంగా ఉంది



- తరుణ్ భాస్కర్

"ఓం శాంతి శాంతి శాంతిః' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. నేను పోషించిన ఓంకార్ నాయుడు పాత్ర చాలా సంతృప్తినిచ్చింది' అని అన్నారు తరుణ్ భాస్కర్. ఆయన కథానాయకుడిగా ఏ.ఆర్.సజీవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. 'ఓంకార్ నాయుడు నా వ్యక్తిగత జీవితానికి భిన్నమైన పాత్ర. ఈ క్యారెక్టర్ కోసం చాలా హోం వర్క్ చేశాను. నాకు ఒకే జోనర్‌కి ఫిక్స్ అవ్వాలని లేదు. విభిన్న తరహా చిత్రాలు చేయాలనుంది. అలాగే ఒక రొమాంటిక్ కామెడీ కూడా చేయాలనుంది' అని తరుణ్ భాస్కర్ అన్నారు.

మళ్లీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా

- విష్వక్సేన్



విష్వక్సేన్, కయదు లోహర్ జంటగా కె.వి.అనుదీప్ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న సినిమా థియేటర్లలో విడుదల కానుంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం నుంచి రెండో గీతం 'రట్టాటటాప్..'ని చిత్రబృందం ఆవిష్కరించింది. మాస్ బీట్స్‌తో భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాట ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ పాటను దేవ్‌పవార్ రాయగా, గాయకుడు రామ్ మిరియాల అద్భుతంగా ఆలపించారు. ఈ సందర్భంగా విష్వక్సేన్ మాట్లాడుతూ 'నా గత చిత్రాలు ఒకట్రెండు మిమ్మల్ని పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయాయి. 'ఫంకీ' సినిమాతో మళ్లీ ఒకటి నుంచి మొదలుపెడుతున్నాను. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది' అని అన్నారు. దర్శకుడు కె.వి.అనుదీప్ మాట్లాడుతూ 'పాట మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా అందరికీ నచ్చేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.

వైసీపీ నాయకులకు సిగ్గుండాలి

- ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు ఉంది
- చార్జిషీట్ 35వ పేజీలో సిట్ పేర్కొంది: మంత్రి పయ్యావుల





మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

అమరావతి/తెనాలి/కందుకూరు/నిడదవోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన కల్తీ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని, సిట్ క్లీన్ చిట్ ఇచ్చిందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ దాఖలు చేసిన 219 పేజీల చార్జిషీట్‌లోని 35వ పేజీలో లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు(టాలో), ఫిష్ ఆయిల్ ఆనవాళ్లు ఉన్నట్లు స్పష్టంగా పేర్కొందని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "కల్తీ నెయ్యి వాడకానికి జగన్ ప్రభుత్వ హయాంలోనే పునాది పడింది. 2014-19లో లడ్డూ నాణ్యత కోసం చంద్రబాబు విధించిన కఠిన నిబంధనలన్నింటినీ జగన్ అధికారంలోకి వచ్చిన 3 నెలలకే సడలించారు. 2022లోనే నెయ్యి నాణ్యతపై అనుమానం వచ్చి శాంపుల్స్‌ను మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐకి పంపగా అందులో జంతు అవశేషాలు ఉన్నట్లు నివేదిక వచ్చింది. అయినా కూడా అదే కల్తీ నెయ్యిని వాడుతూ వచ్చారు. కల్తీ నెయ్యి సరఫరాలో రూ.240 కోట్ల అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా సిట్ నిర్ధారించింది. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాకు రూ.4 కోట్లు బదిలీ అయ్యాయి. ఆ డబ్బులు వేరే ఖాతాల్లోకి తరలించారని, ఆ ఖాతాలు ఎవరివో తేలాల్సి ఉంది.' అని మంత్రి వివరించారు. దేవదేవుడి విషయంలో మహాపచారం చేసి, ఇప్పుడు క్లీన్‌చిట్ వచ్చిందంటూ సంబరాలు చేసుకోవడానికి వైసీపీ నాయకులకు సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కుప్పం పర్యటన నుంచి వచ్చిన తర్వాత ఉన్నతస్థాయి చర్చలు జరిపి కల్తీ నెయ్యి ఉదంతంపై చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయిస్తారని పయ్యావుల తెలిపారు.

అందరి బాగోతాలు బయటికొస్తాయి: మంత్రి ఆనం

కల్తీ నెయ్యి వ్యవహారంలో అందరి బాగోతాలు బయటికొస్తాయని, తమ ప్రమేయం లేదని సిట్ తేల్చిందంటూ వైసీపీ నేతలు చంకలు గుద్దుకోవటం చోద్యంగా ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. సిట్ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించిందని, అది ప్రభుత్వానికి చేరాకే బయటికొస్తుందని తెలిపారు. ప్రకాశం జిల్లా కందుకూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలు అది నెయ్యే కాదని తేల్చినప్పుడు కల్తీ జరగలేదని సిట్ నివేదిక ఇచ్చిందని, ఈ వ్యవహారంలో వైసీపీ పెద్దల ప్రమేయం లేదని కూడా తెలిపిందంటూ ఆ పార్టీ నేతలు సంబరాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన దిగజారుడు వ్యాఖ్యలపై మంత్రి ఆనం తీవ్రంగా స్పందించారు. గౌరవప్రదమైన నాయకుడిని టీడీపీ కార్యకర్తల పాదధూళికి కూడా సరిపోని నాయకుడు నోటికొచ్చిన పదజాలంతో మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని ఆనం పేర్కొన్నారు.

సిగ్గు అనిపించడం లేదా?: మంత్రి మనోహర్



"టీటీడీకి మీరు సరఫరా చేసిన 60 లక్షల లీటర్లలో ఒక్క చుక్క కూడా నెయ్యి లేదు. వాసన మినహా రసాయనాలతో కూడిన విషాన్ని భక్తులకు పంచారు. పైగా ఇప్పుడు క్లీన్‌చిట్ వచ్చిందంటూ రోడ్డెక్కి హడావుడి చేయడానికి సిగ్గు అనిపించడంలేదా?" అంటూ వైసీపీ నేతలపై మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. చార్జిషీట్ దాఖలు చేస్తేనే క్లీన్‌చిట్ వచ్చేసిందంటూ అసత్య ప్రచారంతో ఇంకా ప్రజలను దారుణ మోసానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేత అంబటి రాంబాబు తన బూతు పాండిత్యాన్ని ప్రదర్శించారని, ఏకంగా సీఎం చంద్రబాబునే బూతులు తిట్టడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు.

కల్తీ నెయ్యి వాడకం ముమ్మాటికీ పాపమే: మంత్రి దుర్గేశ్



లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై వైసీపీ నేతలు చేస్తున్న వాదనలను మంత్రి కందుల దుర్గేశ్ తీవ్రంగా ఖండించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం ముమ్మాటికీ పాపమేనని అన్నారు. దీనిపై వైసీపీ కల్తీ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దొంగతనం బయటపడిన తర్వాత వైసీపీ నేతలు దొంగనాటకాలు ఆడటం సిగ్గుచేటని విమర్శించారు. కమిషన్ల కోసమే నిబంధనలు సడలించి 'భోలే బాబా' సంస్థకు అప్పటి ప్రభుత్వం టెండర్లు ఇచ్చిందని, దీనిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.

అవినీతి నుంచి పుట్టిన పార్టీ వైసీపీ: గొట్టిపాటి



భీమవరం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'అవినీతి నుంచి పుట్టిన పార్టీ వైసీపీ. తిరుమల కల్తీ నెయ్యి అంశంలో ఆ పార్టీ తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోంది' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'తిరుమలకు ఉన్న అపార గౌరవాన్ని భ్రష్టుపట్టించిన ఘనత వైసీపీదే. టీటీడీకి డిక్లరేషన్ సమర్పించే సంప్రదాయాన్ని జగన్ తుంగలో తొక్కారు. 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును నాశనం చేసిన వ్యక్తి ఆయనే. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన దుర్మార్గుడూ జగన్‌రెడ్డే' అంటూ మండిపడ్డారు.

మత్స్య రైతులకు అందని కేసీసీ రుణాలు

» 2025-26లో లక్ష్యం 40 వేల మంది

» ఇచ్చింది దానిలో సగం మందికే.. 6 వేల దరఖాస్తుల తిరస్కరణ

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మత్స్య రైతులకు ఆర్థిక చేయూత కోసం కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)ల లక్ష్యం నీరుగారుతోంది. కేసీసీపై రుణాలిచ్చే బ్యాంకులు కొర్రీలేస్తే నెలల తరబడి దరఖాస్తులను పెండింగ్ పెడుతున్నాయి. కేసీసీ రుణాలపై పర్యవేక్షణ లేక రాష్ట్రంలో ఈ పరిస్థితి తలెత్తింది. పూచీకత్తు లేకుండా రూ.2లక్షల వరకు కేసీసీపై రుణాలు ఇవ్వాల్సి ఉంది. చేపల చెరువులు ఉన్న రైతులు, సముద్రంలో వేట సాగించే వారు, పడవలు ఉన్న మత్స్యకారులు.. కేసీసీపై రుణాలకు అర్హులని ఆర్బీఐ స్పష్టం చేసింది. వేటకు అవసరమైన సామాగ్రి ఖర్చులకు ఈ రుణాలు తీసుకోవచ్చు. 2025-26లో ఏపీలో 40,400మంది మత్స్యరైతులు, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు రుణాలివ్వాలని బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత నవంబరు నాటికి కేవలం 28,218 మందికి రుణాలు మంజూరయ్యాయి. మరో 6వేల దరఖాస్తులను తిరస్కరించారు. తమిళనాడులో మత్స్యరైతులు, మత్స్యకారుల పథకాల అమలుకు సమస్యల కమిటీలు ఉన్నాయి. అలాగే ఏపీలోనూ లక్ష్యం మేరకు రుణాలివ్వాలని, రైతులకు అవగాహన కల్పించే కమిటీలు ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

హైకోర్టు 'ఉత్తర్వుల'తో ఊరట

» ఏపీ లారీ యజమానుల సంఘం కార్యదర్శి ఈశ్వరరావు

విజయవాడ సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పాత గూడ్స్, ప్యాసింజర్ వాహనాలపై కేంద్రం అమాంతం పెంచిన ఫిట్‌నెస్ చార్జీలపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం లారీ యజమానులకు ఎంతో ఊరటనిచ్చిందని ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు అన్నారు. కోర్టు ఉత్తర్వుల పట్ల శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. 'న్యాయస్థానం తాజా ఉత్తర్వుల ప్రకారం పాత వాహనాలపై పెంచిన ఫిట్‌నెస్ ఫీజుల అదనపు ఆర్థిక భారం లారీ యజమానులపై ప్రస్తుతానికి ఉండదు' అని ఈశ్వరరావు తెలిపారు. కేంద్రం జారీ చేసిన ఆదేశాల అమలును నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

పేర్ని నానిపై కేసు వివరాలు సమర్పించండి!

» ఇనగుదురుపేట పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అవమానకరంగా దూషించారనే ఆరోపణలతో తనపై మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత పేర్ని నాని వేసిన క్వాష్ పిటిషన్ శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఆదేశించారు. తదుపరి విచారణను వారం రోజులు వాయిదా వేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ప్రచారం చేశారంటూ సీఎం, డిప్యూటీ సీఎంలను దూషించారంటూ అవమానకరంగా మాట్లాడారని టీడీపీ నాయకుడు పిప్పళ్ల కాంతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా 27న మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీసులు పేర్ని వెంకటరామయ్య(నాని)పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ పేర్ని నాని శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఉమీద్‌లో రెండు కొత్త మాడ్యూళ్లు

» వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కేంద్రం మరో కీలక ముందడుగు

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పరిరక్షణకు కేంద్రం మరో కీలక ముందడుగు వేసింది. పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తూ ఉమీద్ పోర్టల్‌లో మరో రెండు కొత్త మాడ్యూళ్లను ప్రవేశపెట్టింది. 'సర్వే మాడ్యూల్' , 'వక్ఫ్ ప్రాపర్టీ లీజ్ మాడ్యూల్' అనే రెండు అదనపు విభాగాలను శనివారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. వక్ఫ్ ఆస్తుల సర్వేకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి, నిర్వహించడానికి, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడానికి సర్వే మాడ్యూల్ ఒక సమగ్ర డిజిటల్ వేదికగా పనిచేస్తుంది. అలాగే, వక్ఫ్ ఆస్తుల లీజు ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు డిజిటల్ పద్ధతిలో నిర్వహించేందుకు వక్ఫ్ ప్రాపర్టీ లీజ్ మాడ్యూల్‌ను రూపొందించారు. లీజు కాలపరిమితి, లీజు మొత్తం, ఇతర ముఖ్యమైన వివరాలను పారదర్శకంగా పర్యవేక్షించడానికి ఇది సహాయపడుతుంది.

కోస్తాలో దట్టంగా పొగమంచు

» 100 మీటర్లకు పడిపోయిన విజిబిలిటీ

విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కోస్తాలోని అనేక ప్రాంతాలు, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో శనివారం దట్టంగా పొగమంచు కురిసింది. ప్రధానంగా మధ్య కోస్తా జిల్లాల్లో విజిబిలిటీ 100 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో విజిబిలిటీ 500 మీటర్లుగా నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా, గాలులు నిశ్చలంగా ఉండటంతో పొగమంచు కురిసింది. మరో వారం రోజులు పొగమంచు కురుస్తుందని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. పగటిపూట ఎండ స్వల్పంగా పెరుగుతుందని, రాత్రి సమయంలో చలి తీవ్రత కొనసాగుతుందని వివరించారు. శనివారం రాయలసీమలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయన్నారు. ఆరోగ్యవరంలో 13.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

దర్శి మున్సిపల్ కమిషనర్‌పై ఏసీబీ దాడులు

» ఆదాయానికి మించి అక్రమాస్తుల గుర్తింపు

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు ఆస్తులపై ఏసీబీ అధికారులు శనివారం దాడులు చేశారు. ఏకకాలంలో దర్శి, నరసరావుపేట, సత్తెనపల్లి పట్టణాల్లోని ఆయనకు చెందిన ఇళ్లలో సోదాలు జరిగాయి. ఏసీబీ డీఎస్పీ పి.రామకృష్ణుడు ఆధ్వర్యంలో కడప ఏసీబీ సీఐ పి.శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఏసీబీ ఎస్ఐ షరీఫ్‌లు దర్శిలోని ఆయన నివాసానికి తెల్లవారుజామున 4 గంటలకే చేరుకున్నారు. అదే సమయంలో నరసరావుపేట, సత్తెనపల్లిలో కూడా మరికొంత మంది ఏసీబీ అధికారులు ఆయన ఇళ్లలో తనిఖీలు ప్రారంభించారు. 11గంటల వరకు దర్శిలోని కమిషనర్ ఇంట్లో సోదాల అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు తనిఖీలు జరిగాయి. డీఎస్పీ రామకృష్ణుడు మాట్లాడుతూ వై.మహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి సమాచారం వివరిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు పూర్తయిన తర్వాత మహేశ్వరరావును నెల్లూరు తీసుకెళ్లారు.

నా భర్త హత్యపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి


» హైకోర్టును ఆశ్రయించిన మంద సాల్మన్ భార్య

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామానికి చెందిన మంద సాల్మన్ హత్య ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ మృతుడి భార్య మంద కుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తులో పోలీసులు ఏకపక్షంగా, పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. జనవరి 11 నుంచి 13 వరకు మాచవరం పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'నా భర్త మంద సాల్మన్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున పనిచేశారు. ఈ ఏడాది జనవరి 10వ తేదీన ఇంటి బయట ఉన్న నా భర్తపై మోటమర్రి పేతూరు, అతడి తమ్ముడు కాంతారావు ఇనుపరాడ్లతో దాడి చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ జనవరి 15న నా భర్త సాల్మన్ మృతి చెందారు. అధికారపార్టీ నేతల సూచనలకు అనుగుణంగా, ఆధారాలు లేకుండా చేసి కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు అసాధారణంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో నా భర్త హత్యపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపేలా కేసును సీబీఐకి అప్పగించండి' అని మంద కుమారి పిటిషన్‌లో కోరారు.

రూ.2.10 కోట్లతో కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం

» ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' ఫలితం

» పనులకు శ్రీకారం చుట్టిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



కొత్తచెరువు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో రూ.2.10కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే కొత్తచెరువుకు తలమానికంగా ఉంటుందన్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని సత్యసాయిబాబా జూనియర్ కళాశాల ప్రాంగణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 2018లో నాటి సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నారు. కొత్తచెరువులో రూ.కోటి నిధులతో నిర్మాణపనులకు శ్రీకారం చుట్టారని, వైసీపీ అధికారంలోకి రావడం, సైకో ముఖ్యమంత్రి జగన్ కారణంగా పనులు నిలిచిపోయాయని విమర్శించారు. గత ఏడాది 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్య గురించి ప్రజలు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఆ తరువాత కొత్తచెరువులో జరిగిన మెగా పీటీఎంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తాము తీసుకెళ్లామని, వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తామని చెప్పారని తెలిపారు. నిర్మాణ పనులకు రూ.2.10 కోట్లతో ప్రతిపాదనలు అందించగా మంజూరు చేశారని తెలిపారు. వీటితో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



స్మగ్లర్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రెడ్ స్మగ్లర్ ముజామిల్ అరెస్టు

» ఎర్రచందనం అక్రమ రవాణాలో కింగ్‌పిన్

» తిరుపతి వద్ద పట్టుకున్న టాస్క్‌ఫోర్సు

» టీమ్‌ను అభినందించిన పవన్ కల్యాణ్

తిరుపతి(కపిలతీర్థం), అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం స్మగ్లర్లు, వారి వెనుక ఉన్న సూత్రధారుల ఆట కట్టించేందుకు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (టాస్క్‌ఫోర్స్) వేట మొదలు పెట్టింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ఎర్రచందన స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను అరెస్టు చేసింది. శనివారం ఉదయం చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారిపై అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందం ముజామిల్‌ను పట్టుకుంది. ముజామిల్‌కు చైనాలోని జైమెన్ టాంగాంగ్ ఫాంగ్ ట్రేడ్ కంపెనీతో సంబంధాలున్నట్లు విచారణలో తేలింది. ఎర్రచందనం దుంగలను లైసెన్స్ పేరు చెప్పి, అక్రమంగా చైనా తరలించేవాడు. శేషాచలం నుంచి బెంగళూరు మీదుగా రవాణా చేసేవాడు. ముజామిల్‌పై అనేక కేసులున్నాయి. అత్యధిక కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయి. దాంతో తప్పించుకు తిరుగుతున్నాడు. కాగా, ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడేవారి పట్ల ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తుందని, సూత్రధారులు లొంగిపోవాలని ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ముజామిల్ పట్టుబడ్డాడు. ఆ వివరాలను టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, ఏఎస్పీ కులశేఖర్‌తో కలిసి ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు తెలిపారు. "పొలాల్లో పెరిగే ఎర్రచందనం కొనేందుకు ఉన్న లైసెన్సును అడ్డం పెట్టుకుని చైనా దేశానికి భారీఎత్తున ఎగుమతి చేస్తూ ముజామిల్ రూ.కోట్లు సంపాదించాడు. శేషాచల అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన పలు కేసుల్లో అతడు ముద్దాయి. గత ఏడాది టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పక్కా ప్రణాళికతో ముజామిల్‌ను తిరుపతి సమీపంలోని తనపల్లి క్రాస్‌వద్ద అరెస్టు చేశాం. కర్ణాటకకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు సయ్యద్ అబ్దుల్, లతీఫ్ అలియాస్ సెట్టు, సేటుబాయ్, వాజీబ్‌లతో కలిసి ఏపీ నుంచి ఎర్రచందనం అక్రమంగా తరలించడమే కాకుండా బెంగళూరుకు చెందిన రవి అనేవ్యక్తి ద్వారా రైతుల నుంచి ఎర్రచందనం కొనుగోలు చేశాడు. ఎర్రచందనం అక్రమ రవాణాలో ముజామిల్‌కు సహకరిస్తున్న చైనాకు చెందిన గ్జియామెన్ ట్యాంగాంగ్ఫంగ్ ట్రేడ్ కో లిమిటెడ్ అనే కంపెనీకి చెందిన జోజో, మనదేశంలో అక్రమ రవాణాకు సహకరిస్తున్న మైఖేల్ పాత్రలపై లోతైన దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిలువరించడానికి టాస్క్‌ఫోర్సు త్రిముఖ చర్యలు అమలు చేస్తోందన్నారు. ఫలితంగా గతేడాది జనవరి నుంచి 27కేసుల్లో 87శాతం ముద్దాయిలపై నేరం రుజువై శిక్షలు పడ్డాయని సుబ్బరాయుడు చెప్పారు. కాగా, ముజామిల్ ఆట కట్టించిన ఆపరేషన్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, సిబ్బందిని పవన్ కల్యాణ్ అభినందించారు.

'ఆప్కో'లో అగచాట్లు!

సంస్థను చుట్టుముట్టిన సమస్యలు

» ఉనికిని నిలబెట్టుకోవడానికి ఆపసోపాలు

» సేల్స్ సిబ్బందికి జీతాలూ ఇవ్వలేని దుస్థితి

» ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న షోరూమ్‌ల మేనేజర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

చేనేత ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఏర్పాటైన 'ఆప్కో' సమస్యల వలయంలో చిక్కుకుంది. లక్షలాది మందికి ఉపాధి కల్పించిన సంస్థ ఇప్పుడు తన ఉనికిని నిలబెట్టుకోవడానికి ఆపసోపాలు పడుతోంది. చేనేత వృత్తిపై ఆధారపడి జీవించే నేతన్నల సంక్షేమం కోసం 50 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార సంఘం (ఆప్కో) ఏర్పాటైంది. సంప్రదాయ చేనేత కళకు, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుసంధానంగా నిలుస్తూ చేనేత కళాకారుల జీవితాల్లో ఆర్థిక భద్రతను తీసుకురావడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా షోరూమ్‌లు ఏర్పాటు చేసి గ్రామీణ చేనేత సొసైటీల నుంచి వస్త్ర ఉత్పత్తులు సేకరించి వినియోగదారులకు విక్రయిస్తోంది. ఆప్కో పరిస్థితి ఇప్పుడు అత్యంత దయనీయంగా తయారైంది. షోరూమ్‌ల్లో పనిచేసే సేల్స్ సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉంది. ఆప్కోలో శాశ్వత ఉద్యోగులు 67 మంది, అవుట్ సోర్సింగ్ ద్వారా మరో 140 మంది పని చేస్తున్నారు. వీరితో పాటు దినసరి వేతనం కింద పనిచేసే సేల్స్ హెల్పర్లు 180 మందికి గత 5 నెలలుగా జీతాలు చెల్లించడంలేదు. రాష్ట్రంలో 2.5లక్షల మంది చేనేత కార్మికులు ఉండగా 950 వరకూ చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వాటినుంచి సేకరించే వస్త్రాల విక్రయానికి 85 షోరూమ్‌లు ఉండగా అందులో 15 మెగాషోరూమ్‌లు. వీటిద్వారా ఏటా కోట్లాది రూపాయల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి.

దోపిడీకి అడ్డుకట్ట ఏదీ?

ఆప్కో షోరూమ్‌ల్లో మేనేజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. షోరూమ్‌ల్లో ఉన్న స్టాకు విక్రయించిన సొమ్ము సొంతానికి వాడేసుకొంటున్నారు. విజయవాడలోని మెగా షోరూమ్ మేనేజర్ ఏకంగా రూ.1.70కోట్లు వాడేసి పరారయ్యాడు. మరిన్ని షోరూమ్‌ల్లోనూ సొంతానికి డబ్బులు వాడేసి... జీతాలు రాకపోవడంతో తప్పట్లేదని చెబుతున్నారు. మరి కొన్నిచోట్ల సొంత స్టాకు తెచ్చుకుని షోరూంలో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. గోడౌన్లలో స్టాకులోనూ భారీ తేడాలు ఉన్నట్లు చెబుతున్నారు.

ఆ ఉన్నతాధికారి తీరే వేరు.!

చేనేత జౌళి శాఖలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. జిల్లాల్లోని అధికారుల బదిలీ మొదలుకొని ప్రతిదాంట్లోనూ కమీషన్ లేనిదే ఒప్పుకోరని, అత్యంత విలాసవంత జీవితం గడుపుతూ ఆప్కోను నిర్వీర్యం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎవరేం చెప్పినా పట్టించుకోకపోగా వారిపై పగబడుతున్నారని చర్చ జరుగుతోంది. ఆ అధికారి తీరుతో విసిగి వేసారిన కొందరు అధికారులు ఇటీవల గుంటూరులో సమావేశమై ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సిబ్బందిని బదిలీ చేయకుండా అక్కడే ఉంచాలంటే రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు వాపోయారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని ఆధారాలు కూడా ప్రభుత్వానికి పంపారు. ఆ అధికారి తాగే రకరకాల ఫ్రూట్ జ్యూస్‌ల నుంచి వ్యక్తిగత సహాయకుల వరకూ ప్రతిదీ ఆప్కో నుంచే భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆయన ఢిల్లీ పర్యటనలు ఎక్కువగా చేస్తూ, హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఆప్కోను కనీసం పట్టించుకోవట్లేదని విమర్శిస్తున్నారు. 'మీరు ఎవరికి చెప్పినా లెక్క చెయ్యను.. మీకు మాత్రం జీతాలు ఇవ్వను..' అని తెగేసి చెబుతున్నట్లు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి పండగలకు రూపాయి ఇవ్వలేదని, సంక్రాంతికి కూడా ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వాపోతున్నారు. ఆప్కోను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సంక్షేమ శాఖలు ఈ సంస్థ నుంచి వస్త్రాలు కొనుగోలు చేయాలంటూ చంద్రబాబు సర్కారు గతంలోనే జీవో తీసుకొచ్చింది. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నా ఆ ఉత్తర్వు అమలు కావట్లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితర సంక్షేమ హాస్టళ్లు పొరుగు రాష్ట్రాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేస్తున్నాయి. తమకు అవసరమైన దుప్పట్లు, టవళ్లు, ఇతరత్రా ఆప్కో సరఫరా చేయలేక పోవడమే అందుకు కారణమని ఆయా శాఖల బాధ్యులు చెబుతున్నారు. అయితే కమీషన్ల కోసమే ప్రైవేటు వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారని చేనేత వర్గాలు ఆరోపిస్తున్నాయి.

తిరస్కరించే అవకాశం ఉన్నా విచారణకు వస్తున్నా

» నందినగర్ ఇంట్లో నేడు విచారణకు కేసీఆర్ అంగీకారం

» 3 గంటలకు అందుబాటులో ఉంటానని కబురు

» బీఆర్ఎస్ ఆందోళనల నేపథ్యంలో భారీ బందోబస్తు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిట్ అధికారులు నందినగర్‌లోని ఆయన నివాసంలో విచారించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. విచారణ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలకు పిలుపునివ్వడంతో ఆయా ప్రాంతాన్ని బారికేడ్లతో దిగ్బంధనం చేసి అదనపు బలగాలను మోహరిస్తున్నారు. సిట్ అధికారులు పంపిన రెండో నోటీసుకు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. మూడు పేజీల సుదీర్ఘ లేఖను జూబ్లీహిల్స్ ఏసీపీకి పంపారు. సిట్ అధికారులు ఇచ్చిన నోటీసు చట్టప్రకారం లేదని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ బాధ్యతాయుతమైన వ్యక్తిగా విచారణలో పాల్గొంటానని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. కేసీఆర్ తన లేఖలో పలు కోర్టు తీర్పులను ప్రస్తావించారు. సిట్ చట్ట ప్రకారం వ్యవహరించడం లేదని, ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. పంజాగుట్టలో నమోదైన క్రైం నెంబర్ 243 కేసు విచారణలో భాగంగా సెక్షన్ 160 సీఆర్‌పీసీ కింద సిట్ అధికారులు ఈ నెల 29న ఇచ్చిన నోటీసుకు తాను అదే రోజున జవాబు పంపానని చెప్పారు. సెక్షన్ 160 ప్రకారం 65 ఏళ్ల వయస్సు పైబడిన వారిని విచారించాల్సి వస్తే వారు నివసిస్తున్న ప్రదేశానికి దర్యాప్తు అధికారి వెళ్లి విచారణ చేపట్టాలని చట్టం స్పష్టంగా చెబుతోందని గుర్తు చేశారు. తాను ఎర్రవెల్లిలో ఉంటున్నానని, ఈ కేసుకు సంబంధించి తదుపరి సమాచారం ఏదైనా ఆ చిరునామాకే పంపించాలని కోరానని ప్రస్తావించారు. 30న గుర్తు తెలియని వ్యక్తులు నందినగర్‌కు వెళ్లి, అక్కడ తన గురించి విచారించి, తాను లేనని తెలుసుకుని గోడకు లేఖ అంటించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఎర్రవెల్లిలో ఉంటున్న విషయాన్ని స్పష్టంగా 29వ తేదీన లేఖలో పేర్కొన్నప్పటికీ సిట్ అధికారులు ఎన్నికల అఫిడవిట్, అసెంబ్లీ రికార్డుల ప్రకారం నందినగర్ ఇల్లు అధికార చిరునామా అవుతుందని పేర్కొంటూ అక్కడ నోటీసులు అంటించడాన్ని ఖండించారు. అసెంబ్లీ, ఎన్నికల అఫిడవిట్ ప్రకారమే దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సి వస్తే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న సిద్దిపేట ఇంటికి వెళ్లి నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని, ఆయనకు హైదరాబాద్‌లో నోటీసులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. పోలీసులు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. నోటీసు ఎవరికి ఇవ్వదలచుకున్నారో ఆ వ్యక్తి నివసిస్తున్న ప్రదేశానికి స్వయంగా వెళ్లి నోటీసును అందచేయాల్సి ఉండగా సిట్ చట్టాన్ని అతిక్రమించి తాను ఉండని ప్రదేశానికి వెళ్లి గోడపై ఎలా అంటిస్తారని ప్రశ్నించారు. సిట్ అధికారుల చర్య కోర్టు ధిక్కారం కిందకే వస్తుందన్నారు. తాను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే నివసించనపుడు అసలు తనకు నోటీసులు ఇచ్చే అధికారమే జూబ్లీహిల్స్ పోలీసులకు లేదని కేసీఆర్ అన్నారు. చట్టవిరుద్ధమైన నోటీసులకు తాను కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు. వీడీ మూర్తి వర్సస్ ఆంధ్రప్రదేశ్ కేసులో 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, మహిళలను వారు నివసిస్తున్న చోటే విచారణ జరపాలని హైకోర్టు స్పష్టంగా పేర్కొందని గుర్తు చేశారు. వారు సానుకూలంగా ఉంటేనే పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ చేయవచ్చని తీర్పులో ఉందని ప్రస్తావించారు. దర్యాప్తు అధికారికి ఎవరినైనా విచారణకు పిలిచే అధికారం ఉన్నప్పటికీ అది తన జ్యూరిస్డిక్షన్ పరిధిలో ఉన్న వారి విషయంలోనే వర్తిస్తుందని చెప్పారు. తాను జూబ్లీహిల్స్ పరిధిలో నివసించడం లేదని గుర్తు చేశారు. సిట్ అనుసరించిన ద్వంద్వ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే తాను నందినగర్‌లో విచారణకు హాజరు కాకుండా సిట్ నోటీసును తోసిపుచ్చవచ్చని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రిగా, బాధ్యతాయుత పౌరుడిగా చట్టాన్ని గౌరవిస్తూ సిట్ తప్పుడు నోటీసులు ఇచ్చినా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పోలీసుల కోరిక మేరకు విచారణకు నందినగర్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు.

పీఎస్‌కు వెళ్దామనుకున్నా...

జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు వెళ్లడమా లేక నందినగర్ ఇంట్లోనే విచారణకు అందుబాటులో ఉండటమా అనే అంశంపై బీఆర్ఎస్ అధినేత పార్టీ నేతలతో చర్చించారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడం వల్ల పార్టీకి ప్లస్ అవుతుందని అత్యధికులు భావించారు. విచారణ జరిగేది రెండో అంతస్తులో కావడం, అన్ని మెట్లు ఎక్కి కేసీఆర్ వెళ్లడం కష్టం కాబట్టి నందినగర్ నిర్ణయాన్ని తీసుకున్నారని సమాచారం. ఇటీవలే సిట్ విచారణకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కేటీఆర్, హరీశ్‌లు ఎన్ని మెట్లు ఎక్కాల్సి వస్తుందో కేసీఆర్‌కు వివరించారు. కేసీఆర్ తుంటి ఎముక శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో రెండతస్తులు ఎక్కడం ఇబ్బంది అని నందినగర్ ఇంటికే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్ చుట్టుపక్కల జన సమీకరణ

కేసీఆర్ ఉదయం 9గంటల సమయంలో ఎర్రవల్లి నివాసం నుంచి బయల్దేరతారు. 11గంటలకు నందినగర్ నివాసానికి చేరుకుంటారు. ఆయన రాక సందర్భంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో జనసమీకరణ చేసేందుకు బీఆర్ఎస్ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ భవన్‌లో మూడు వేల మందికి భోజనాల ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

తుపాకీతో కాల్చి.. ఆరు లక్షలు దోపిడీ

» హైదరాబాద్‌లో కలకలం... బాధితుడికి ఉస్మానియాలో చికిత్స

హైదరాబాద్/ అఫ్జల్‌గంజ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇద్దరు దుండగులు.. దోపిడీ కోసం పక్కాగా స్కెచ్ వేశారు.. బ్యాంకు నగదు డిపాజిట్ యంత్రం (సీడీఎం)లో జమ చేయడానికి వచ్చిన వ్యాపారిపై కాల్పులు జరిపి.. రూ.6 లక్షల నగదుతో వ్యాపారి స్కూటీపైనే పారిపోయారు. హైదరాబాద్‌లోని కోఠిలో శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. కాల్పుల్లో కుడికాలికి తీవ్ర గాయమైన వ్యాపారిని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుల్తాన్‌బజార్, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కజికోడ్‌కు చెందిన రిన్షాద్ పి.వి. (26) తన బంధువుతో కలసి అక్కడ రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తుంటారు. రెండు నెలలకోసారి హైదరాబాద్‌కు వచ్చి దివాన్ దేవిడీ ప్రాంతంలో హోల్‌సేల్ దుస్తులు కొనుగోలు చేసి కేరళకు పార్శిల్ చేసుకుంటుంటారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం రిన్షాద్ డబ్బులు తీసుకొని హైదరాబాద్‌కు వచ్చారు. నాంపల్లిలోని ఓ అపార్టుమెంట్‌లో స్నేహితుడు అమీర్ ఫ్లాట్‌లో బస చేశాడు. కొత్త స్టాక్ లేకపోవడం, తాము కోరిన తరహా దుస్తులు దొరక్కపోవడంతో కొనుగోలు చేయలేదు. దీనితో డబ్బులు తన ఖాతాలో జమ చేయాలని కేరళలోని బంధువు సూచించారు. ఈ మేరకు రిన్షాద్ శనివారం ఉదయం 6:30 గంటలకు స్నేహితుడు అమీర్ స్కూటీపై కోఠిలోని స్టేట్‌బ్యాంకు సీడీఎం (నగదు డిపాజిట్ యంత్రం)లో నగదు జమ చేయడానికి వచ్చారు. ఆయన వెనకాలే మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు సీడీఎం సెంటర్‌లోకి ప్రవేశించారు. నగదు ఉన్న బ్యాగును లాక్కోవడానికి ప్రయత్నించగా రిన్షాద్ ప్రతిఘటించడంతో తుపాకీతో కాల్పులు జరిపారు. అందులో ఒక బుల్లెట్ బాధితుని కుడికాలుకు తగిలి పడిపోయారు. వెంటనే దుండగులు బాధితుడి స్కూటీపై కాచిగూడ రైల్వేస్టేషన్ వైపు వెళ్లారు. అక్కడ బండి వదిలేసి డీమార్ట్ దగ్గర దుస్తులు మార్చుకున్నారు. తర్వాత ఆటోలో సికింద్రాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.



మేడారం జాతరలో చివరిరోజున భక్తులు

తల్లుల వనప్రవేశం.. ముగిసిన మేడారం జాతర

» నాలుగు రోజుల్లో కోటిన్నరకుపైగా భక్తుల సందర్శన

వరంగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దర్శనాలు చేసుకున్నారు.. మొక్కులు తీర్చుకున్నారు.. కొత్త మొక్కులు మొక్కుకున్నారు. బెల్లం సమర్పించారు.. కొబ్బరి కాయలు కొట్టారు.. జీవాలనూ బలిచ్చారు.. ముక్క, చుక్కతో మజా చేసుకున్నారు. ఆ అనుభూతులన్నీ మనసులో నిక్షిప్తం చేసుకొని, ఇంటిబాట పట్టారు. రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతర భక్తకోటికి పండగే అయింది. నాలుగు రోజుల పాటు సాగిన జాతర శనివారంతో ముగిసింది. మహాజాతర సందర్భంగా వనదేవతలను దర్శించుకునేందుకు కోటిన్నర మందికిపైగా భక్తులు పోటెత్తారు. తెలుగురాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిసా, మధ్యప్రదేశ్ నుంచే కాకుండా విదేశాల నుంచీ ఈసారి భక్తులు మేడారానికి తరలివచ్చారు. వీరంతా జాతరలో వెయ్యికోట్లకుపైగా ఖర్చుచేసినట్లు అంచనా. నాలుగు రోజుల్లోనే సుమారు 4లక్షలకుపైగా గొర్రెలు, మేకలు తల్లులకు బలిచ్చినట్లుగా అంచనా. గొర్రెకు సగటున రూ.8వేల చొప్పున లెక్కేసుకున్నా రూ.320 కోట్లు గొర్రెలకే ఖర్చు చేసినట్లు అంచనా. 10 లక్షల కోళ్లను జాతరలో భక్తులు ఆరగించినట్లుగా అంచనా. కోడి కిలోన్నర నుంచి రెండు కిలోల బరువు ఉంటాయి. జాతరలో కోడిని రూ.400చొప్పున విక్రయించారు. ఈ లెక్కన కోళ్ల రూపంలోనే సుమారు రూ.40 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా. జాతరలో మద్యం ఏరులైపారింది. ఎక్సైజ్ శాఖకు ఈ జాతరలో సుమారు రూ.4.50 కోట్ల ఆదాయం వచ్చినట్లుగా అంచనా. మద్యం పేరిట రూ.10 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా మాంసం, మద్యం పేరుతో సుమారుగా రూ.400 కోట్ల వరకు ఖర్చు అయినట్లుగా అంచనా వేస్తున్నారు. వీటితో పాటు లక్షల్లో కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, పాన్, గుట్కా, సిగరెట్ భారీగా అమ్మకాలు జరిపారు. జాతరలో ఈసారి సుమారు 500 టన్నుల బెల్లాన్ని విక్రయించినట్లుగా అంచనా. కిలో బెల్లం రూ.70 చొప్పున విక్రయించారు. జంపన్న, నాగులమ్మ గద్దెల వద్ద, సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తులు కొబ్బరికాయలు కొడుతుంటారు. తలా నాలుగు కొబ్బరికాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అంటే కనీసం కోటికి పైగా కొబ్బరికాయలు విక్రయించినట్లుగా అంచనా. కొబ్బరికాయకు రూ.60 వేసుకున్నా రూ.60 కోట్ల మేర కొబ్బరికాయల వ్యాపారం జరిగినట్లుగా అంచనా. చీరె, సారె, గాజులు, ఒడిబియ్యం, తల్లులకు సమర్పించే కానుల రూపంలో మరో రూ.50 కోట్ల వరకు భక్తులు ఖర్చు చేసినట్లుగా అంచనా. ఇవేకాకుండా హోటళ్లు, ఎగ్జిబిషన్స్, తినుబండారాలు, ఆట వస్తువులు, బ్యాగులు తదితర షాపింగ్‌ల పేరుతో మరో రూ.20 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లుగా అంచనా. భక్తులు అద్దె వాహనాల్లో, ఆర్టీసీ బస్సుల్లో, సొంత వాహనాల్లో మేడారానికి వచ్చారు.

వీఐపీల తాకిడి

శనివారం కూడా మేడారానికి వీఐపీల తాకిడి కొనసాగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, హైకోర్టు జడ్జిలు సృజన, రాణి, మాధవీలతరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు వచ్చారు. తొలుత తులాభారం ద్వారా ఎత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సాయంత్రం తల్లుల వనప్రవేశం జరిగింది. సమ్మక్క తల్లిని ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సాలరమ్మను కాక సారయ్య కన్నెపల్లి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడ్డిరాజును పూనుగొండ్లకు తరలించి వారి నిజస్థానాలకు తీసుకువెళ్లి వన ప్రవేశం చేయించారు. డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో నృత్యాలు చేసుకుంటూ ముందుకు సాగారు. మహిళలు శివసత్తుల వేషధారణలో చెర్నాకోలాలు ధరించి శిగాలూగారు. దీనితో మేడారం మహా జాతర ముగిసినట్లయింది. మొక్కులు చెల్లించుకున్న భక్తులు తిరుగుముఖం పట్టడంతో మేడారంలోని గుడారాలన్నీ ఖాళీ అవుతున్నాయి.





అంబటి ఫ్లెక్సీని చెప్పులతో కొడుతున్న టీడీపీ శ్రేణులు, అంబటి ఇంటి వద్ద టీడీపీ శ్రేణుల నిరసన, పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

బూతుల రాంబాబు బరి తెగింపు.. రాయలేని భాషలో సీఎంపై బూతులు..

అంబటి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

చివరకు ఆ అంశం శాంతించగా, రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో టీడీపీ కార్యకర్తలు అంబటిపై ఫిర్యాదు చేశారు. అసలేం జరిగిందంటే... టీటీడీలో కల్తీ నెయ్యి ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు వెలిశాయి. గుంటూరు నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ దాబా వద్ద కూడా అలాంటి ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబు శుక్రవారం ఆ ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మీడియాతో మాట్లాడుతూ, 24 గంటల్లో దానిని తొలగించాలని, లేదంటే తానే తీసివేస్తానంటూ హెచ్చరించారు. చెప్పినట్లుగానే శనివారం మరోసారి ఆ ఫ్లెక్సీ వద్దకు వచ్చి, దానిని తొలగించాలని అక్కడ ఉన్నవారికి చెప్పి.. గోరంట్ల వెంకటేశ్వర స్వామి గుడిలో పూజ చేయడానికి వెళ్లారు. రాంబాబు ఫ్లెక్సీ వద్దకు వచ్చారని తెలుసుకున్న తెలుగుదేశం కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. తిరిగొచ్చి రాంబాబు ఒకవేళ ఫ్లెక్సీ చించితే అడ్డుకోవాలని పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, మహిళలు అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అంబటి తన కారులో ఫ్లెక్సీ వద్దకు వచ్చారు. అక్కడ ఉన్న ఓ టీడీపీ మహిళ గురించి అనుచితంగా మాట్లాడారు. దీంతో మహిళలంతా ఆయనకు ఎదురు తిరిగారు. అప్పటివరకు కారులో ఉన్న అంబటి ఆవేశంతో ఊగిపోతూ.. కారు కిటికీలోంచి తల బయటకు



పెట్టి.. పోలీసులు వింటుండగానే.. లం.కొ. అంటూ రాయలేని భాషలో చంద్రబాబుపై అసభ్యకరమైన పదజాలం ప్రయోగించారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహంతో రగిలిపోయిన తెలుగు తమ్ముళ్లు.. అంబటి కారును అడ్డుకోబోగా.. పోలీసులు వారించారు. రాంబాబును అక్కడినుంచి పంపించివేశారు.

అంబటి అరెస్టు.. హైడ్రామా..

చంద్రబాబును దూషించడమే కాకుండా ఇంటి వద్ద నడిరోడ్డుపై మీడియా సమావేశం ఏర్పాటు చేసి బహిరంగంగా సవాల్ విసరడాన్ని టీడీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోయారు. అంబటి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మహిళలు ఆయన ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో తెలుగు యువత నాయకులు శివ నాగమల్లేశ్వరరావు (మల్లి), కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మాధవి భర్త రామచంద్రరావు తమ అనుచరులతో అంబటి కార్యాలయంలోకి దూసుకు వెళ్లారు. అప్పటివరకు అంబటికి అండగా ఉన్న వైసీపీ కార్యకర్తలు తలోదిక్కు పారిపోయారు. అంబటి రాంబాబు ఇంటిలోకి వెళుతున్న తెలుగుదేశం కార్యకర్తలపై అక్కడే ఉన్న వైసీపీకి చెందిన రౌడీ షీటర్లు దాడికి పాల్పడ్డారు. ఇంటి సమీపంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో ఉన్న అంబటిపై కొందరు టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న సీఐలు, ఎస్సైలు వారందరినీ అదుపులోకి తీసుకొని బయటకు నెట్టుకొచ్చారు. పెద్ద సంఖ్యలో పోలీసులు అంబటి ఉన్న గది వద్ద మోహరించి తెలుగుదేశం శ్రేణులను అడ్డుకున్నారు. ఇంతలో కార్యకర్తలు అంబటి కార్యాలయంలోని మిగిలిన రెండు గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫొటోలు అద్దాలు ధ్వంసం చేశారు.



ప్లాస్టిక్ షీల్డ్‌ల రక్షణ వలయం మధ్య అంబటిని తరలిస్తున్న పోలీసులు

అంబటి ఇంటి వద్ద రౌడీషీటర్ల హడావుడి..

చంద్రబాబును దూషించిన మీడియా వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. తెలుగు మహిళలు గుంటూరు నగరంలోని అంబటి రాంబాబు ఇంటి వద్దకు చేరుకుని నిరసనకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఆయన ఇంటి వద్దకు వైసీపీ శ్రేణులతో పాటు రౌడీషీటర్లు చేరుకున్నారు. వారు తెలుగు మహిళల వెంటపడి తరిమి కొట్టారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అంబటి ఇంటి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని అక్కడ అడ్డుకున్నారు. ఇంటి వద్ద నడిరోడ్డుపై మరోసారి రెచ్చిపోయిన అంబటి.. అక్కడే మీడియాతో మాట్లాడుతూ, మరోసారి చంద్రబాబును ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడారు. "చంద్రబాబును నేను తిట్టలేదు. నన్ను చంపడానికి కర్రలు, రాడ్లతో టీడీపీ కార్యకర్తలు, మహిళలు రావడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో క్షణికావేశంలో అలా మాట్లాడాల్సి వచ్చింది. నన్ను తిడుతున్న మహిళలను నేను కూడా ఒక మనిషిగా తిట్టకూడదా? చంద్రబాబుకు, లోకేశ్‌కు, ఆయన నడిపిస్తున్న రెడ్ బుక్‌కు నా ఇంట్లో కుక్క కూడా భయపడదు. దమ్ముంటే అరెస్టు చేసుకోండి. అరెస్టుకు సిద్ధంగా ఉన్నా... బెయిల్ కూడా తీసుకోను... జైల్లో ఉంటా... నీ సంగతి తెలుస్తా.. ఐ డోంట్ కేర్... నేను పారిపోను. ఇంట్లోనే ఉంటా... ఇది తెగింపు కాదు పిల్లిని కట్టేసి కొడితే పులిలా మారుతుంది. ప్రస్తుతం నేను కూడా అలానే..." అంటూ తనను పులిలా అభివర్ణించుకున్నారు..

ఆ తర్వాత కార్యాలయం ఎదురుగా ఉన్న అంబటి ఇంటిపై దాడి చేశారు. ఇంటి అద్దాలు, పూల కుండీలు ధ్వంసం చేశారు. పరిస్థితిని ముందే పసిగట్టిన అంబటి తన కుటుంబ సభ్యులను వేరే ప్రాంతానికి తరలించారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. పరిస్థితి చేయి దాటిపోతుందని భావించిన పోలీసు అధికారులు, పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను అంబటి ఇంటి వద్దకు తరలించారు. అంబటి క్షమాపణ చెప్పాల్సిందేనంటూ మరోసారి టీడీపీ కార్యకర్తలు అక్కడకు పెద్దఎత్తున చేరుకున్నారు. మరోసారి ఆయన కార్యాలయం, ఇంటిపై దాడి చేశారు. ముఖ్యమంత్రిని దూషించిన అంబటిని ఎందుకు అరెస్టు చేయడం లేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో రాత్రి 10.30 గంటల వరకు అంబటి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. ఈ సమయంలో అంబటి రాంబాబును పోలీసులు అరెస్టు చేసి షీల్డ్‌లు పట్టుకున్న పోలీసుల వలయం మధ్య తీసుకొచ్చి వజ్ర వాహనం ఎక్కించి.. తరలించారు. ఆ సమయంలో కోడుగుడ్లు, రాళ్లతో ఆందోళనకారులు దాడి చేశారు. పకడ్బందీ రక్షణ మధ్య అంబటిని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఆందోళనకారులు అంబటి కార్యాలయం కిటికీకి, అంబటికి, ఆయన అనుచరుడికి చెందిన రెండు కార్లకు నిప్పుపెట్టారు.



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహనం

అంబటీ ఖబడ్దార్.. నువ్వు మనిషివేనా?

సహించం, చూస్తూ ఊరుకోం: మంత్రుల హెచ్చరిక

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి చంద్రబాబుపై బండ బూతులతో విరుచుకుపడ్డ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పలువురు మంత్రులు నిప్పులు చెరిగారు. "అంబటీ ఖబడ్దార్.. నువ్వు మనిషివేనా?. వీధి రౌడీ కూడా నీలా నోరు పారేసుకోడు. ఇలాంటి నేతను ప్రజలు తరిమి కొట్టాలి." అని పలువురు మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేశారు. అదేసమయంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని దుయ్యబట్టారు.

ప్రజలు ఉమ్మేస్తున్నారు: అనిత

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ముఖ్యమంత్రిని, పోలీసు అధికారులను అసభ్య పదజాలంతో దూషించిన అంబటిపై కచ్చితంగా కేసు నమోదు చేస్తామని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేత పట్టాభి చిన్న పదం వాడినందుకు ఆయన ఇంటిపైనా, టీడీపీ పార్టీ కార్యాలయంపైనా దాడి చేశారని ఆమె గుర్తుచేశారు. కల్తీ నెయ్యి విషయంలో వైసీపీపై రాష్ట్ర ప్రజలు ఉమ్మేస్తున్నారని విమర్శించారు.

నీచం..: అచ్చెన్న

సీఎం చంద్రబాబుపై అంబటి వ్యాఖ్యలు అత్యంత నీచమని, సభ్యసమాజం సిగ్గుపడేలా మాట్లాడటం దారుణమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో మాట్లాడుతూ.. సీఎంపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు.

మనిషివేనా..: సంధ్యారాణి

'అంబటీ నువ్వు మనిషివా..? జంతువువా..? రాక్షసుడివా..? 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారే. ఇంకా మీకు సిగ్గు లేదా? సీఎం పదవిలో ఉన్న వ్యక్తిపై అలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా? ముఖ్యమంత్రి హోదాను అవమానించేలా మాట్లాడడం ప్రజాస్వామ్యానికే అవమానం. చంద్రబాబుకు బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి డిమాండ్ చేశారు.

తరిమి కొట్టాలి: కొండపల్లి

సీఎం చంద్రబాబుపై అంబటి చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలపడం నిజం కాదా? అని ప్రశ్నించారు. అంబటి వంటి వారిని తరిమి కొట్టాలని ఆయన వ్యాఖ్యానించారు.

లోకేశ్ పిలుపునిస్తే..: సవిత

చంద్రబాబు మాతృమూర్తిని దూషించిన వైసీపీ నేత అంబటి రాంబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రి సవిత డిమాండ్ చేశారు. వైసీపీ నేతలకు మహిళలంటే గౌరవం లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఒక్క పిలుపునిస్తే వైసీపీ నాయకులు ఒక్కరు కూడా బయటికి రాలేరని మంత్రి హెచ్చరించారు. వైసీపీని ఎన్నికల సంఘం బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు.

వీధి రౌడీ: అనగాని

సీఎం చంద్రబాబును అత్యంత దారుణంగా దూషించిన అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. అంబటి వీధి రౌడీ కన్నా నీచంగా మాట్లాడారని, ఆయన సమాజానికి పట్టిన చీడపురుగు అని ధ్వజమెత్తారు. అంబటితోపాటు ఆయన్ను సమర్థించే వైసీపీ నేతలకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు.

హేయం: సత్యకుమార్

సీఎం చంద్రబాబుపై అంబటి చేసిన వ్యాఖ్యలను మంత్రి సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. నిత్యం అహం భావంతో వ్యవహరించే అంబటి రాంబాబు సీఎం చంద్రబాబును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమని అన్నారు.

అంబటీ.. అండగా ఉంటాం

- రాంబాబుకు ఫోన్‌లో జగన్ భరోసా
- చంద్రబాబు దుర్మార్గాలు పెరిగిపోతున్నాయి: జగన్

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించిన వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఆ పార్టీ అధినేత జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. అంబటికి పార్టీ మొత్తం అండగా ఉంటుందని, తానున్నానంటూ జగన్ ధైర్యం చెప్పారు. అంబటిపై టీడీపీ గూండాలు ఉద్దేశపూర్వకంగానే హత్యాయత్నానికి పాల్పడ్డారని, దాడులకు దిగారని ఆరోపించారు. చంద్రబాబు అరాచక పాలనను ప్రజలు సహించబోరని వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆటవిక రాజ్యాన్ని నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దుర్మార్గాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలు అన్నీ చూస్తున్నారని మండిపడ్డారు. అంబటికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్రను పోషించారని నిందించారు.

సిగ్గు.. సిగ్గు..

'బోసడికే'.. ఈ పదానికి అర్థం ఏంటో చాలామందికి తెలియదు. సాధారణంగా వాడుకలో ఉన్న పదం. చాలామంది సరదాగా కూడా అనేస్తుంటారు. దీని అర్థం ఏంటన్నది కూడా చాలామంది పట్టించుకోరు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన్ను టీడీపీ నేత పట్టాభి బోసడికే అన్నారని నాడు వైసీపీ శ్రేణులు రచ్చ రచ్చ చేశాయి. విజయవాడలోని ఆయన ఇంటికి వెళ్లి మరీ వైసీపీ గూండాలు విధ్వంసం సృష్టించా రు. ఆ సమయంలో ఇంట్లో పట్టాభి లేకపోవడంతో బతికిపోయారు. వెంటనే పట్టాభిపై పోలీసులతో కేసులు పెట్టించి అరెస్ట్ చేయించి నానా రభస చేశారు. నాడు వైసీపీ నేతలు డిక్షనరీల్లో బోసడికే పదానికి అర్థాలు వెదికి.. ప్రెస్‌మీట్లు పె ట్టి.. జగన్‌కు ఘోర అవమానం జరిగిందని ఆరోపించారు. నాడు ఎవరికీ అర్థం కాని బోసడికే పదం అన్నందుకు వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించి, బూతు ఉచ్చరిస్తే కోపం రాదా? అయినా అంబటి రాంబాబును జగన్ నిస్సిగ్గుగా సమర్థిస్తున్నారు. ఫోన్ చేసి భరోసా ఇస్తున్నారు.

కల్తీ నెయ్యిపై డైవర్షన్ పాలిటిక్స్

'కల్తీ'ని సమర్థించుకోలేక వైసీపీ తికమక

తీవ్రమైన వివాదాల్లోకి కూరుకుపోయినప్పుడు.. తీవ్రమైన సమస్యలు చుట్టుముట్టినపుడు.. దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నప్పుడల్లా.. వైసీపీ వాడే అస్త్రం డైవర్షన్ పాలిటిక్స్. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా.. తర్వాత అధికారంలో ఉన్నా.. ఇప్పుడు మళ్లీ విపక్షంలో ఉన్నా.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇదే ఎత్తుగడ. తామే తప్పులు చేసి ఎదుటివారిపై నిందలు వేయడం.. ప్రజల దృష్టి మళ్లించేందుకు లేదా ప్రజల సానుభూతి కోసం 'నాటకాలు' ఆడటం ఆనవాయితీగా వస్తోంది. వివేకా హత్యపై 'కట్టు'కథలు, కోడి కత్తితో దాడి.. ఇలా ఎన్నో డైవర్షన్ పాలిటిక్స్ నడిపారు. తాజాగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మరో నాటకానికి తెరలేపారు. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలపడం నిజమేనంటూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేసిన సీబీఐ సిట్ తేల్చిన సంగతి తెలిసిందే. దీన్ని సమర్థించుకునేందుకు వైసీపీ నేతలు నానా పాట్లు పడ్డారు. టీడీపీపై ఎదురుదాడికి దిగారు. నెయ్యి కల్తీ జరిగినట్టు సిట్ చెప్పినా చంద్రబాబు ఆరోపించినట్టుగా నెయ్యిలో జంతుకొవ్వు కలిపినట్టు తేల్చలేదని తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. కానీ, ఎన్‌డీడీబీ రిపోర్టు బయటకు రావడంతో తాము చేస్తున్న వాదనలు బూమరాంగ్ అయ్యాయని జగన్ బృందం గ్రహించింది. దీంతో ప్రజల దృష్టి మళ్లించేలా వైసీపీ నేత అంబటి రాంబాబును రంగంలోకి దింపారు.

అంబటిపై 3 కేసులు

గుంటూరులో 2.. పల్నాడులో ఒకటి నమోదు

- రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసి అల్లర్ల సృష్టికి ప్రయత్నిస్తున్నారని గుంటూరు ఎస్పీకి టీడీపీ ఫిర్యాదు

గుంటూరు/కంచరపాలెం (విశాఖపట్నం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన మాజీ మంత్రి అంబటిపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. చంద్రబాబును దూషించినందుకు గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ రెస్టారెంట్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్దకు అంబటి రాంబాబు వచ్చిన సమయంలో పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించారు. రోడ్డుపై వాహనాన్ని పార్కింగ్ చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించారు. ఎస్ఐ రామకృష్ణ రోడ్డుపై వాహనం పార్క్ చేయవద్దని చెప్పినందుకు.. 'మీరెవరు నాకు చెప్పడానికి' అంటూ ఆయనపై దౌర్జన్యం చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో అంబటి, ఆయన అనుచరులపై కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా నకరికల్లులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు అంబటిపై మరో కేసు నమోదు చేశారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు

చంపేస్తా.. ఫ్లెక్సీలు చించేస్తా అంటూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసి అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న అంబటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఇతర పార్టీ నేతలతో కలిసి గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్‌కు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. టీడీపీ శ్రేణులను అసభ్యపదజాలంతో తిడుతూ చంపేస్తానని బెదిరించారన్నారు. చంద్రబాబును కూడా దమ్ముంటే రమ్మంటూ బూతులతో తిట్టి, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అటు చంద్రబాబుపై అంబటి వ్యాఖ్యలపై విశాఖపట్నంలోని 54వ వార్డు టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.



తిరుపతిలో అంబటి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ శ్రేణులు

సంస్కార హీనులు!

ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రాలేదు

రాష్ట్రంలో అశాంతి రేపేందుకు వైసీపీ ప్లాన్.. అంబటి వ్యాఖ్యలపై టీడీపీ నేతల ధ్వజం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సభ్యసమాజం తల దించుకునేలా సీఎం చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడ్డారు. రాజకీయాల్లో స్థాయిని మరిచి, సంస్కారాన్ని వదిలేసి మాట్లాడటం ఆ పార్టీ నేతలకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అశాంతిని రగిల్చేందుకు పక్కా ప్లాన్‌తోనే వైసీపీ తన పార్టీ నాయకులతో ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తోందని ఆరోపించారు. అంబటి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల అంబటి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ప్రజలు ఛీత్కరించినా మార్పు రాలేదు: వర్ల

ఎన్నికల్లో ప్రజలు ఛీత్కరించినప్పటికీ.. వైసీపీ నేతల్లో మార్పు రాలేదని, అంబటి వ్యాఖ్యలు ఆయన నీచత్వానికి నిదర్శనమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో జగన్ భార్య భారతి గురించి ఓ టీడీపీ కార్యకర్త అనుచితంగా మాట్లాడితేనే చంద్రబాబు అతడిని వెంటనే అరెస్టు చేయించారని గుర్తుచేశారు. అత్యంత నీచమైన భాష వాడిన అంబటిపై జగన్ ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు.

చెప్పులతో కొట్టి ఊరేగిస్తాం: ఎమ్మెల్యే రాజు

అంబటి రాంబాబు ఎక్కడ కనిపించినా టీడీపీ కార్యకర్తలు చెప్పులతో కొడతారని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. నాలుగుసార్లు సీఎం అయిన చంద్రబాబు వంటి నాయకుడి గురించి నీచంగా మాట్లాడిన వాడు నడిరోడ్డుపై ఎక్కడ కనిపించినా.. చెప్పులతో కొట్టి ఊరేగిస్తామని హెచ్చరించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో అంబటి దిష్టిబొమ్మను ఆయన దహనం చేశారు. మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అంబటిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

తిరుపతిలో అంబటి దిష్టిబొమ్మ దహనం

అంబటి వ్యాఖ్యలపై తిరుపతి టీడీపీ నేతలు మండిపడ్డారు. శాప్ చైర్మన్ రవినాయుడు, జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నేతలు నిప్పులు చెరిగారు. క్రమశిక్షణ కలిగిన పార్టీలో ఉన్నామని, పార్టీ కనుసైగ చేస్తే అంబటిని రాష్ట్రంలో తిరగనివ్వకుండా చేస్తామని హెచ్చరించారు.

నోటికొచ్చింది మాట్లాడితే..: నాదెండ్ల బ్రహ్మం

అంబటి రాంబాబు రాజకీయ పతనం మొదలైందని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం అన్నారు. కల్తీ నెయ్యి ఉదంతం వైసీపీ నేతల మెడకు చుట్టుకుంటుండటంతో ప్రజల దృష్టి మరల్చేందుకు వైసీపీ నాయకులు రోడ్ల మీద పడి వీరంగం ఆడుతున్నారన్నారు. అంబటి రాంబాబు పిచ్చి కుక్క కరిచిన వాడిలా నోటికొచ్చింది మాట్లాడితే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

అంబటి క్షమాపణలు చెప్పాలి: టీఎన్‌యూఎస్

అంబటి వ్యాఖ్యలను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఖండించారు. రాజకీయాల్లో నిర్మాణాత్మక విమర్శలు చేసుకోవాలి గానీ.. ఒక సీఎంపై సభ్యసమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అంబటి వెంటనే క్షమాపణలు చెప్పాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి: పల్లా

రాజకీయాల్లో విమర్శలు ఉండాలి కానీ.. వ్యక్తిత్వ హననం కాదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. అంబటి వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని దూషించినట్లు కాదని, రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించిన దశాబ్దాల చరిత్ర గల దార్శనికుడిని అవమానించడమన్నారు. సంస్కారాన్ని వదిలేసి మాట్లాడటం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. అంబటి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం: బీజేపీ నేత వల్లూరు

వ్యక్తిత్వ హననం చేయడమే రాజకీయం అనుకునే వైసీపీ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు రాకపోవడం బాధాకరమని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు. వినడానికే జుగుప్సాకరంగా ఉన్న అంబటి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల్ని చట్టపరంగా ప్రభుత్వం, రాజకీయంగా ఆయన పార్టీ చర్య తీసుకుంటే మరొకరు ఇటువంటి వ్యాఖ్యలు చేయబోరని అభిప్రాయపడ్డారు. సిగ్గుమాలిన వ్యాఖ్యలు చేసిన వ్యక్తుల్ని వెనకేసుకొస్తే జగన్‌కు రాజకీయంగా పుట్టగతులు ఉండబోవన్నారు.

ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలి: ఎంపీ కలిశెట్టి

తన వ్యాఖ్యలను అంబటి వెనక్కి తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు సతీమణిపై కూడా దుర్భాషలాడారని, సభ్యసమాజం ఇలాంటి వ్యాఖ్యల్ని సహించదన్నారు. ప్రధాని మోదీతో పాటు ప్రపంచ నేతలు చంద్రబాబును గౌరవిస్తారని, దూరదృష్టి గల అలాంటి నేతపై హేయమైన వ్యాఖ్యలు దారుణమన్నారు.

సభ్య సమాజం తలదించుకునేలా..: పాలంకి

అంబటి వ్యాఖ్యలు సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉన్నాయని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ అన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

హెల్మెట్ పెట్టు బ్రో!

అనంతలో రోడ్డు భద్రతపై బుల్లితెర నటుల ర్యాలీ

అనంతపురం క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై బుల్లితెర నటులు ప్రచారం చేశారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌లో పాల్గొనేందుకు శనివారం అనంతపురం జిల్లా కేంద్రానికి వచ్చిన నటులు రోడ్డు భద్రత వారోత్సవాల్లో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి నగరంలోని క్లాక్‌టవర్ మీదుగా ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. నటులు ప్రభాకర్, సుస్మిత, పవన్‌సాయి, అనిల్, శ్రీరాం తదితరులు ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మణిదీప్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో.. హెల్మెట్ ముద్దు బ్రో, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వద్దు..' అంటూ నినాదాలు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని వారు కోరారు. ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని,ప్రాణాలు పోతున్నాయని తెలిపారు.



అనంతపురంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బుల్లితెర నటులు

'పోలవరం'లో పెద్దపులి అలజడి

పోలవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం ఏజెన్సీలో పెద్దపులి దాడులతో జనం బెంబేలెత్తారు. సుమారు వారంపాటు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన పులి.. దాదాపు 12 మూగజీవాలను బలితీసుకుంది. ఆ తర్వాత బుట్టాయిగూడెం మండలం పులిరామన్నగూడెం మీదుగా వచ్చిదారినే పులి అడవుల్లోకి వెనుదిరిగి వెళ్లిందని ప్రచారం జరగడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ తాజాగా పోలవరం మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున మండలంలోని ఇటుకలకోట గ్రామంలో మడకం కన్నమ్మ ఇంటికి సమీపంలో కట్టి ఉంచిన రెండు గేదెదూడలపై దాడి చేసి చంపేసింది.



పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ చానల్ వద్ద పులి పాదముద్రలు

తాడిపత్రిలో 30 అడుగుల వాసవీమాత విగ్రహం

▸▸ కడప రోడ్డులో ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్

తాడిపత్రి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం సమీపంలోని కడప రహదారిలో వాసవీ మాత 30 అడుగుల విగ్రహాన్ని మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తాడిపత్రిలో వాసవీమాత భారీ విగ్రహాన్ని సర్కిల్‌లో ఏర్పాటు చేయడం గర్వకారణమని మంత్రి భరత్ అన్నారు. ఇక్కడి ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సహాయ సహకారాలు అందించడంవల్లే వాసవీమాత విగ్రహం ఏర్పాటు చేయగలిగామని అన్నారు. ఆర్యవైశ్యులతో జేసీ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్యులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన సమయంలో ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. ఆర్యవైశ్యులు వ్యాపారాల్లోనే కాదు, రాజకీయ రంగంలోనూ రాణించాలన్నారు.



అనంతపురం జిల్లా తాడిపత్రిలో వాసవీమాత 30 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు

ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించే బాధ్యత మనదే

▸▸ పార్టీ నేతలు, కార్యకర్తలకు బీజేపీ అధ్యక్షుడు మాధవ్ నిర్దేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తోన్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పార్టీ కేడర్ సేవకు నడుంబిగించాలి. ఏ పథకానికి ఎవరు అర్హులు? ఆయా పథకాలకు దరఖాస్తు ఎలా చేసుకోవాలి? అన్న విషయాలను వివరించాలి. వాటిని తామే పూర్తి చేసి తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ పరిష్కారం అయ్యేలా చూడాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ ముఖ్య నేతల భేటీలో వ్యాఖ్యానించారు. నెల రోజుల పాటు బీజేపీ శ్రేణులు తమ గ్రామ, వార్డుల్లో ప్రజల్ని సంప్రదించి సేవ చేసే కార్యక్రమాన్ని 'చేరువ' పేరుతో బీజేపీ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. 'మా ఊరు... మా జెండా' పేరుతో ప్రతి గ్రామం, వార్డులో బీజేపీ జెండాలు ఆవిష్కరించి.. అక్కడి దిమ్మకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తారు. గ్రామస్తులు ఎవరైనా మొబైల్‌లో ఆ కోడ్ స్కాన్ చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ గ్రామ, వార్డు అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులతో పాటు సంక్షేమ ఫలాల వివరాలు కనిపిస్తాయి.' అని మాధవ్ తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా రవిదాస్ జయంత్యుత్సవాలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'సమానత్వం, మానవత్వమే సంత్ రవిదాస్ సందేశం. ఆయన జయంత్యుత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 5 వరకూ బీజేపీ ఘనంగా నిర్వహిస్తోంది' అని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేశ్ తెలిపారు. 'జన్మతో కాకుండా కర్మతో లభించే కులాన్ని చూసి, మనిషిని మనిషిగా గౌరవించాలని అనే భావనను సంత్ రవిదాస్ చాటారని అన్నారు.

కుప్పానికి ప్రగతి కళ

(మొదటి పేజీ తరువాయి)

విధానంలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని మరింత పెంచుతాం. డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి" అని ఆకాంక్షించారు. కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి విజయవంతమైన డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు సంజీవనిని ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చంద్రబాబు చెప్పారు. "మెరుగైన వైద్య సేవలను ప్రజలకు ఇంటి వద్దకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని ప్రాజెక్టు అమలు చేసేందుకు నిర్ణయించాం. కుప్పానికి రూ.7,088 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు రావడంతో ప్రత్యక్షం, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి లభించనుంది. వర్క్ ఫ్రమ్ హోం చేసుకునేవారికి, ఆఫీసు స్పేస్ లేనివారికి ఉపయోగపడేలా కుప్పంలో రాష్ట్రంలోనే తొలి కో- వర్కింగ్ స్పేస్‌ను ఏర్పాటు చేశాం" అని సీఎం వివరించారు.విధ్వంస పాలనతో రాష్ట్ర అభివృద్ధిని వైసీపీ వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. "వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగానే కూటమి ప్రభుత్వానికి భూవారసత్వ సమస్యలు వచ్చాయి. రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసి పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలను ముద్రించుకున్నారు. దుర్మార్గం చేసింది చాలక, ఇప్పుడు తమ పాలనే బెటర్ అంటూ మాట్లాడుతున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో తెచ్చిన నల్లచట్టాన్ని కూడా సమర్థించుకుంటున్నారు" అని మండిపడ్డారు.



గిన్నిస్ వరల్డ్ రికార్డును ముఖ్యమంత్రికి అందజేస్తున్న నిర్వాహకులు

గిన్నిస్ వరల్డ్ రికార్డులో కుప్పానికి చోటు

జనవరి 29 మధ్యాహ్నం 12 గంటల నుంచి 30వ తేదీ 12 గంటల వరకు 5,555 ఇ-సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో కుప్పం నియోజకవర్గం చోటు సంపాదించుకుంది. ఇ-సైకిళ్లను ఇంత పెద్ద సంఖ్యలో పంపిణీ చేయడంపై ఈ రికార్డు నమోదు అయినట్లు గిన్నిస్ వరల్డ్ బుక్ ప్రతినిధి ప్రకటించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇ-సైకిళ్ల తయారీ సంస్థ ఇ-మోటరాడ్ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కుప్పాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ప్రతి వెయ్యి ఇ-సైకిళ్ల ద్వారా ఏడాదికి 37 టన్నుల కార్బన్ డైయాక్సైడ్ తగ్గుతుంది. సైకిల్ అంటే పురోగతికి చిహ్నం. ఇ-సైకిల్ ఈతరానికి సింబల్‌గా నిలుస్తుంది" అని అన్నారు.

4 కిలోమీటర్లు సైకిల్‌పై సీఎం

'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా బెగ్గిలపల్లెలో పెన్షన్లను పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు అనంతరం, కడపల్లెలోని తన నివాసం నుంచి తుమ్మిశిలోని ప్రజావేదిక వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఇ-సైకిల్‌లో ర్యాలీగా వచ్చారు. 75 ఏళ్ల వయసులోనూ సైకిల్ తొక్కుతూ రావడం చూసిన అక్కడి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలోని పీ4 బంగారు కుటుంబాలు- మార్గదర్శులతో సీఎం సమావేశమయ్యారు. కుప్పంలోని మూడు మండలాలను దత్తత తీసుకున్న మేఘా ఇంజనీరింగ్, అదానీ ఫౌండేషన్, టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులతో ముఖా ముఖిలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్

కుప్పం మున్సిపాలిటీలోని స్వర్ణ నవదిశ సెంటరులోని రెండు అంతస్తుల్లో అన్ని రకాల టెక్నాలజీ వసతులతో డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని సీఎం చంద్రబాబు శుక్రవారం రాత్రి ప్రారంభించగా.. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కార్పొరేషన్ సంస్థ రూ.కోటి ఆర్థికసాయం అందించిందని ఆ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. ఈ సెంటరు వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు, ఫ్రీలాన్సర్లు లబ్ధి పొందుతారని, ముఖ్యంగా గ్రామీణ పేద కుటుంబాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా మోహనకృష్ణను సీఎం చంద్రబాబు అభినందించారు.



గుడుపల్లె మండలం బెగ్గిలపల్లెలో చిన్నతాయమ్మకు వితంతు పింఛను అందజేస్తున్న సీఎం

నేడు అదానీ పర్యటన...?

▸▸ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు పరిశీలన..!

తాడిమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మం డలం దాడితోట సమీపంలో నిర్మిస్తున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టును పరిశీలించేందుకు గౌతమ్ అదాని ఆదివారం వస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. కడప జిల్లా అధికారులు ఆయన పర్యటనకు ఏర్పాట్లు చేశారని సమాచారం. తాడిమర్రి మండలంల మొత్తం 408 ఎకరాల విస్తీర్ణంలో 500 మెగా వాట్ల సామర్థ్యంతో అదానీ కంపెనీ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది.



నిర్మిస్తున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు

ఈ-పంటలో రైతులే నమోదు చేసుకోవచ్చు

▸▸ వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ వెల్లడి

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదులో స్వయంగా నమోదు చేసుకోవటానికి ప్రభుత్వం రైతులకు వెసులుబాటు కల్పించిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ వెల్లడించారు. శనివారం జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిలానీ మాట్లాడుతూ రైతు తాను సాగు చేస్తున్న పంటలను విధిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఏఐఎంఎస్ 2.0 మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసి, ఎంపీఐఎన్ సెట్ చేసుకోవాలి. ఆధార్ ఆధారంగా వెబ్‌ల్యాండ్ (ఆర్వోఆర్)తో అనుసంధానమైన రైతు భూ కమతాలు యాప్‌లో కనిపిస్తాయి. ఆర్ఎస్‌కే సహాయకుడు పంట నమోదు చేయని భూముల వివరాలను రైతే స్వయంగా నమోదు చేసుకోవచ్చు. పంట నమోదు సమయంలో 20 మీటర్ల జియో రిఫరెన్స్ హద్దులతో పొలంలో ఫొటో తీసుకోవాలి. ఇందుకోసం రైతు తప్పనిసరిగా పొలంలోనే ఉండాలి. నమోదు చేసిన సమాచారాన్ని సంబంధిత ఆర్ఎస్‌కే సహాయకుడి ధ్రువీకరణ కోసం పంపుతారు. పంట నమోదు స్థితిగతులపై రైతులకూ సమాచారం ఇస్తారు. ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా ఆర్ఎస్‌కే సిబ్బంది వివరాలన్నీ పరిశీలించి, ఆమోదిస్తారు. వివరాలు సరిగ్గా లేకపోతే గ్రీవెన్స్‌లో నమోదుకు అవకాశం ఇస్తారు. ఈ సౌకర్యాన్ని స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులు వినియోగించుకోవచ్చు' అని జిలానీ తెలిపారు.

పోలవరానికి సంపూర్ణ సహకారం!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నిర్దేశించారు. గత నెల పోలవరం ప్రాజెక్టు క్షేత్ర పర్యటనకు వెళ్లిన చంద్రబాబుకు, కీలకమైన డయాఫ్రమ్ వాల్ ఫిబ్రవరి నెలాఖరునాటికి పూర్తవుతుందని ..గ్యాప్ -1, గ్యాప్-2 పనులు సహా డయాఫ్రమ్‌వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయగలమని కాంట్రాక్టు సంస్థ తెలిపింది. గత నెలలో పోలవరం ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర జల సంఘం అధికారులతో 2027 మార్చినాటికి పోలవరం తొలిదశ 41.15 మీటర్ల కాంటూరులో పూర్తి చేస్తామని పోలవరం ప్రాజెక్టు పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. కాగా, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలలో ఎలాంటి అవరోధాలు రానివ్వబోమని రాష్ట్ర ఆర్థిక శాఖకు కేంద్ర జలశక్తి శాఖ స్పష్టంచేసింది. శుక్రవారం జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి కాంతారావును ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ కలిశారు. మూడో విడత కింద రూ. 3,000 కోట్లు ఇవ్వాలని కాంతారావును రొనాల్డ్ రోస్ కోరారు. ఈ నిధులు మంజూరు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంతారావు వివరించారు. చెరో రూ.1,500కోట్లు చొప్పున రూ.3,000 కోట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ నిర్మాణ పనుల తీరుపై నరసింహమూర్తిని కాంతారావు ఆరా తీశారు. పోలవరం ప్రాజెక్టు పనులు వచ్చే ఏడాది మార్చి లేదా జూన్ నాటికి పూర్తి చేస్తామని నరసింహమూ ర్తి ధీమా వ్యక్తంచేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్లను కేంద్ర జల సంఘం ఆమోదించాల్సి ఉం దని నరసింహమూర్తి వివరించారు. దీంతో .. నిధుల విడుదలతో సహా డిజైన్లను కూడా వీలైనంత వేగంగా ఆమోదం తెలుపుతామని కాంతారావు హామీ ఇచ్చారు.

అయ్యో తల్లీ..

▸▸ కొడుకు, కూతురుతో కలిసి తల్లి ఆత్మహత్య

▸▸ బిడ్డలను గుండెలకు హత్తుకొని గూడ్స్‌రైలు కింద పడిన తల్లి

▸▸ చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో దారుణం

▸▸ మృతురాలు సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీంలీడర్

▸▸ కారు పార్కింగ్ స్లిప్ వెనుకవైపు సూసైడ్ నోట్

▸▸ తెల్లవారితే భర్త పుట్టినరోజు..



విజయారెడ్డి మృతదేహం



ఆత్మహత్యకు ముందు రైల్వేస్టేషన్‌లో నడుచుకుంటూ వెళ్తున్న విజయారెడ్డి, చేతనరెడ్డి, విశాల్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/బీబీనగర్/కుషాయిగూడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భర్తకు దుబాయ్‌లో ఉద్యోగం.. ఆమెకు రూ.లక్షకు పైగా జీతంతో ఐటీ ఉద్యోగం.. బంగారం లాంటి ఇద్దరు పిల్లలు ప్రముఖ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు.. ఆర్థికంగా ఇబ్బందులు లేవు.. కానీ, ఆ తల్లికి ఏం కష్టం వచ్చిందో ఏమో.. తన ఇద్దరు పిల్లలను గుండెలకు హత్తుకొని గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. హృదయ విదారకమైన ఈ ఘటన చర్లపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ పరిధిలోని చెంగిచెర్ల హరితవనంలో ఉంటున్న పెనాటి విజయారెడ్డి(38) గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీం లీడర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త సురేందర్‌రెడ్డి దుబాయిలో ఓ ప్రవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. వారికి కూతురు చేతనరెడ్డి(18), కుమారుడు విశాల్‌రెడ్డి (17) ఉన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ కాలేజీలో హాస్టల్‌లో ఉంటూ చేతనరెడ్డి ఇంటర్ ద్వితీయ సంవత్సరం, విశాల్‌రెడ్డి(17) మొదటి సంవత్సరం చదువుతున్నారు. చెంగిచెర్లలోని ఇంట్లో విజయారెడ్డి తన తల్లితో కలిసి ఉంటోంది. వీరి స్వగ్రామం భువనగిరి మండలం బొల్లపల్లి అని తెలిసింది.

మీటింగ్‌కు వెళ్తున్నానని చెప్పి..

శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో తనకు మీటింగ్ ఉందని తల్లితో చెప్పి విజయారెడ్డి ఇంటి నుంచి కారులో ఘట్‌కేసర్‌లోని హాస్టల్‌కు వెళ్లి .. తన కొడుకు, కూతురును వెంటతీసుకెళ్లింది. రాత్రి 11.30 గంటల సమయంలో వీరు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకొని, స్టేషన్ ఆవరణలో కారును నిలిపి లోపలికి వెళ్లారు. చర్లపల్లి- ఘట్‌కేసర్ వైపు ప్లాట్‌ఫాం దాటి దాదాపు మూడున్నర కిలోమీటర్ల దూరం నడుస్తూ వెళ్లారు. అర్ధరాత్రి 1:00 గంట సమయంలో విజయారెడ్డి తన ఇద్దరు పిల్లలను గుండెలకు హత్తుకుని అటుగా వస్తున్న గూడ్స్ రైలుకు అడ్డంగా పట్టాలపై నిలబడింది. వారిని గమనించిన లోకోపైలట్ పదేపదే హారన్ కొట్టినా వారు పక్కకు వెళ్లలేదు. దీంతో రైలు వారిని ఢీ కొడుతూ వెళ్లిపోవటంతో ముగ్గురూ ప్రాణాలు వదిలారు. పట్టాలపై వారి మృతదేహాలు ఛిద్రమైన స్థితిలో చెల్లాచెదరుగా పడిపోయాయి. రైలు లోకోపైలట్ వెంటనే చర్లపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మేనేజర్ జ్యోతికి సమాచారం అందించగా, ఆమె సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు విషయం తెలిపారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. ముగ్గురి మృతదేహాలు కనిపించాయి. విశాల్‌రెడ్డి జేబులో కారు తాళంచెవి లభ్యం కావటంతో పార్కింగ్‌లో ఉన్న కారు(టీఎస్08జేసీ5224) ఆధారంగా మృతుల వివరాలు సేకరించారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో విజయారెడ్డి తల్లితో పాటు తమ్ముడు చిరంజీవి ఘటనా స్థలానికి బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆత్మహత్యపై అనుమానాలు..

విజయారెడ్డి ఫోన్‌ను పోలీసులు పరిశీలించగా, ఓ వ్యక్తి నుంచి 'సారీ మేడం మరోసారి తప్పు చేయను' అనే టెక్స్ట్ మేసేజ్ కనిపించింది. దీంతో ఆమెకు ఆఫీస్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. భార్య, కొడుకు, కూతురు ఆత్మహత్య చేసుకున్న సమాచారం తెలుసుకున్న భర్త సురేందర్‌రెడ్డి.. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు. ఆయన వస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ చెప్పా రు. విజయారెడ్డికి సారీ చెప్తూ మెసేజ్ పంపిన వ్యక్తికి పోలీసులు ఫోన్ చేయగా.. ఆ ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. దీంతో ఆ వ్యక్తిని కనిపెట్టే పనిలో పోలీసులు ఉన్నారు.

కారు పార్కింగ్ స్లిప్ వెనక సూసైడ్ నోట్..

విజయారెడ్డి కారు పార్కు చేసిన తర్వాత చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో దాదాపు గంటపాటు తన పిల్లలతో గడిపినట్లు తెలుస్తోంది. ఆమె సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు ఒక కెమెరాలో కనిపించగా, మరో కెమెరాలో చేతిలో వాటర్ బాటిల్ పట్టుకొన్న తల్లికి చెరోవైపు పిల్లలిద్దరూ నడుచుకుంటూ వెళ్లడం రికార్డయ్యింది. కారులో లభించిన పార్కింగ్ స్లిప్ వెనుక విజయారెడ్డి రాసిన సూసైడ్ నోట్ కనిపించింది. అందులో 'నా చావుకు ఎవరూ కారణం కాదు.. జీవితం భారంగా ఉంది.. ఇష్టంలేని జీవితం గడపాలని లేదు' అని రాసి ఉన్నట్లు తెలిసింది. శనివారమే విజయారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి పుట్టినరోజు. తెల్లవారితే శుభాకాంక్షలు చెబుతారని ఆశించిన సురేందర్‌రెడ్డి.. వారు ఇక లేరన్న వార్తను వినాల్సి వచ్చింది.

వితంతువులే టార్గెట్!

▸▸ పెళ్లి పేరుతో వల.. బంగారంతో జంప్

▸▸ అంతర్రాష్ట్ర కేటుగాడి అరెస్టు

▸▸ 340 గ్రాముల బంగారం, 75 లక్షల నగదు స్వాధీనం



నారాయణ

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా వితంతువులకు వల వేసి.. బంగారు ఆభరణాలతో ఉడాయించే చిత్తూరు జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తూర్పు గోదావరి పోలీసులకు చిక్కిన ఇతడి నేరాల చిట్టాను డీఎస్పీ శ్రీకాంత్ వెల్లడించారు. పెళ్లిళ్ల పేరుతో నమ్మించి బంగారు ఆభరణాలు, కార్లు దొంగిలిస్తున్న చిత్తూరు జిల్లా పలమనేరు మండలం పి.వడ్డూరు గ్రామానికి చెందిన చల్లా నారాయణ(కృష్ణ నారాయణ, నారాయణ కృష్ణ, కృష్ణప్ప)ను అరెస్టు చేశామని చెప్పారు. భర్త మరణించి రెండో వివాహం నిమిత్తం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేసుకున్న వాళ్లతో ఫోన్ ద్వారా నారాయణ మాటలు కలుపుతాడు. మారు పేర్లతో వాట్సా‌ప్‌లో చాటింగ్ ఆరంభిస్తాడు. ఒంటినిండా నకిలీ బంగారు ఆభరణాలు ధరించి ధనికుడిలా ఫొటోలు పంపిస్తాడు. అవతలవైపు నుంచి కొద్దిగా చొరవ కనబడిన తర్వాత.. మీ ప్రొఫైల్ మా తల్లిదండ్రులకు చూపించాను. మీరు బాగా నచ్చారని, అయితే మీ జాతకంలో కొద్దిగా దోషం ఉందని ఆమెతో చెబుతాడు. రాజమహేంద్రవరం వచ్చి గోదావరిలో స్నానమాచరించి దోష నివారణకు పూజలు చేస్తే సరిపోతుందంటాడు. ఇక్కడికి వచ్చినప్పుడు తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానని, మంచి చీర, బంగారు ఆభరణాలు ధరించి రావాలని సూచిస్తాడు. అలా హైదరాబాద్, విశాఖపట్నం, కడప, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలకు చెందిన మహిళలను రాజమహేంద్రవరం రప్పించాడు. వాళ్లను కారులో పుష్కర ఘాట్ లేదా కోటిలింగాల ఘాట్‌కి తీసుకెళ్లి స్నానం చేయడానికి ముందు బంగారు ఆభరణాలు బ్యాగ్‌లో పెట్టుకోమని సలహా ఇస్తాడు. వాళ్లు స్నానం చేసి వచ్చిన తర్వాత దుస్తులు మార్చుకొనే గదిలోకి వెళ్లే సమయంలో.. పూజ సామగ్రి తీసుకొస్తానని చెప్పి బంగారు ఆభరణాల బ్యాగ్‌తో ఉడాయిస్తాడు. ఇలా ఇద్దరికి చెందిన వేగనార్, ఇన్నోవా కార్లను దొంగిలించాడు. ఈ ఘటనలపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదయ్యాయని డీఎస్పీ చెప్పారు. ఫోన్ ద్వారా నారాయణను ట్రాప్ చేసి రాజమహేంద్రవరం రప్పించి శనివారం అరెస్టు చేశామన్నారు. త్రీటౌన్‌లో నమోదైన కేసులకు సంబంధించి 340 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. నారాయణపై చిత్తూరు, తిరుమల, అలిపిరి, పలమనేరు, విశాఖపట్నం, నెల్లూరు, కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌లలో పోక్సో, హత్య, దోపిడీ తదితర నేరాలకు సంబంధించి 2018 నుంచి 8 కేసులు ఉన్నాయన్నారు. అతడిపై పలమనేరు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉందని తెలిపారు. నారాయణ వల్ల మోసపోయిన వాళ్లు ఇంకా ఎవరైనా ఉంటే పోలీసులను ఆశ్రయించి వివరాలు తెలియ జేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐలు వి.యేసేబు, బి.సురేశ్, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుళ్లు వి.కృష్ణ, రామయ్యలకు రివార్డులు ప్రకటించారని డీఎస్పీ చెప్పారు.

పెట్రోల్ పోసి.. నిప్పంటించి..
ప్రియుడి భార్య, కుమారుడి హత్య

▸▸ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని ఓ మహిళ ఘాతుకం

▸▸ తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో ఘటన



మమత



తరుణ్ నందన్

మర్రిగూడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తోందని ప్రియుడి భార్య, 6 నెలల కుమారుడిపై ఓ మహిళ పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఆ తల్లి ఆర్తనాదా లు చేస్తూ ఒడిలో బిడ్డతో సహ మంటల్లో కాలిపోయింది. ప్రాణాలు కాపాడుకునేందుకు ఇంట్లో నుంచి వీధిలోకి పరుగు తీసి న ఆమె అక్కడికక్కడే చనిపోగా.. ఆ పసికందు ఆస్పత్రిలో ప్రాణాలొదిలా డు. ఈ దారుణ ఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కేతేపల్లి గ్రామంలో శనివారం జరిగింది. కేతేపల్లికి చెందిన కుందేలు నగేష్‌కు మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన మమతతో(25) ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నగేష్ కేతేపల్లిలోనే ఉంటూ తనకున్న పొలం సాగు చేయడంతో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో కేతేపల్లికే చెందిన సుజాతతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. సుజాత భర్త ఆరేళ్ల క్రితం మృతిచెందగా, ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నగేష్‌కు పెళ్లి కాకముందు నుంచే సుజాతతో వివాహేతర సంబంధం ఉంది. నగేష్‌కు పెళ్లైన తర్వాత నుంచి అతనికి, సుజాతకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న మమతను అంతమొందించాలని సుజాత నిర్ణయించుకుంది. శనివారం నగేష్ పని నిమిత్తం పెద్ద కుమారుడితో కలిసి బయటికి వెళ్లాడు. నగేష్ లేడని నిర్ధారించుకున్న సుజాత మధ్యాహ్నం పక్కా పథకం ప్రకారం కారం, కోళ్లను కోసే కత్తితో పాటు పెట్రోల్ తీసుకొని అతని ఇంటికి వెళ్లింది. మమత తన చిన్న కుమారుడు తరుణ్‌నందన్(6 నెలలు)తో ఇంట్లో ఉండగా, ఆమెపై సుజాత పెట్రోల్ పోసి నిప్పటించింది. అనంతరం సుజాత నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది.

వైసీపీ యువనేతకు దేహశుద్ధి

▸▸ చితకబాది, వాహనం ధ్వంసం చేసిన అదే పార్టీ నేత

తిరుపతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన వైసీపీ యువనేత ఒకరికి అదే పార్టీ నేత దేహశుద్ధి చేశారు. యువనేతను చితకబాదడంతో పాటు అతడి వాహనాన్ని సైతం ధ్వంసం చేశారు. గత బుధవారం జరిగినట్టుగా భావిస్తున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ యువ నేత ఆయన. గతంలో తిరుపతి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షునిగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రికి అత్యంత సన్నిహితుడు. ప్రస్తుతం వైసీపీలోనే వేరే విభాగంలో పనిచేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలంలో ఆ యువ నేత ప్రస్తుతం నివాసముంటున్నారు. పొరుగు మండలంలోని వైసీపీ గ్రామ స్థాయి ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన మహిళతో సన్నిహితంగా ఉంటున్నట్లు సమాచారం. ఆ క్రమంలో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం ప్రాంతంలో గత బుధవారం ఒక హోమ్ స్టేలో ఆ మహిళతో వుండగా గ్రామ స్థాయి వైసీపీ ప్రజాప్రతినిధి వచ్చి ఆ ఇద్దరిపై దాడి చేశాడు. వైసీపీ యువనేతను చెప్పుతో కొట్టి, చితకబాదారు. అతడి వాహనాన్ని ధ్వంసం చేశారు. పరువు సమస్యతో ఈ దాడిపై వైసీపీ యువనేత పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది. కాగా ఈ దృశ్యాలను అక్కడున్న కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అవుతున్నాయి. కాగా వైసీపీ యువనేతపై దాడికి పాల్పడ్డ గ్రామస్థాయి ప్రజాప్రతినిధి గతంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీపై జరిగిన దాడి కేసులో నిందితుడని సమాచారం.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.